సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 20-9-2024 ₹ 30/-

# సర్వతోముఖ నాయకత్వం

సీరత్
ప్రత్యేక సంచిక



# గీటురాయి వారపత్రిక
## GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Mail : geeturaiweekly@gmail.com
Website: www.geeturai.com

సంపుటి: 46 సంచిక: 38 హైదరాబాద్
శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 రూ.30-00
16 రబీఉల్ అవ్వల్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

ఎవరయితే నైతిక ప్రవర్తనలో ఉత్తముడో అతనే విశ్వాసంలోనూ పరిపూర్ణుడు.

- ముహమ్మద్ ప్రవక్త (స)


సంపాదకులు
**ఎస్.ఎమ్. మలిక్**

అసోసియేట్ ఎడిటర్
**అబ్దుల్ వాహెద్**

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
**ముహమ్మద్ ముజాహిద్**

సబ్ ఎడిటర్
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్**


**ఆయనే నమూనా**

ప్రవక్త బోధనలలో
ఇహపర సాఫల్యం
కాదంటే తనమాట
తప్పదోయి వైఫల్యం!

సకల జీవరాసులకు
కారుణ్యం ఆయన
జీవన రంగాలన్నిట
ఆయనేలే నమూన!!

- యం.డి. ఉస్మాన్‌ఖాన్

## లోపల...


| | | |
|---|---|---|
| పాఠాలు గ్రహిద్దాం | ...... | 4 |
| సర్వతోముఖ నాయకత్వం | ...... | 5 |
| సత్యసందేశ ప్రదాత | ...... | 8 |
| సర్వతోముఖ నాయకత్వం మానవాళికి మార్గదర్శి | ...... | 10 |
| సర్వతోముఖ నాయకత్వం మానవాళికి కారుణ్యం | ...... | 12 |
| సంపూర్ణ ఆదర్శం విస్మరించిన బాధ్యత! | ...... | 14 |
| ఆ ప్రవక్త! | ...... | 18 |
| మహా మనీషి ముహమ్మద్ (స) | ...... | 22 |
| మంచి మనసులు | ...... | 28 |
| ప్రవక్త (స) వారి హాస్యం | ...... | 31 |
| సందేశంతో సంస్కరణ | ...... | 32 |
| సిగ్గు అనే సుగుణ శ్రేష్ఠత | ...... | 34 |
| సర్వోన్నత సుగుణాల ఖజానా- ముహమ్మద్(స) | ...... | 36 |
| సమాజ సంస్కర్త ముహమ్మద్ (స) | ...... | 40 |
| ఆయన(స) అడుగుజాడలే నేటి సమస్యలకు పరిష్కారం | ...... | 43 |
| మానవ మహోపకారి | ...... | 44 |
| మిలాదున్ నబీ | ...... | 46 |
| మహాప్రవక్త రాకను గూర్చి ముందే వివరించిన వేదవేదాంగాలు | ...... | 48 |
| మహిళల హక్కుల పరిరక్షణ | ...... | 50 |

సర్వతోముఖ నాయకత్వం

# పాఠాలు గ్రహిద్దాం

**మనిషి** భూమి మీద అడుగుపెట్టి నప్పటి నుంచి సహజధర్మం సత్యధర్మమే అన్నది సైద్ధాంతిక నమ్మకం. ప్రవక్త ముహమ్మద్ (స) తర్వాత అరేబియాలో ఇస్లాం ఆవిర్భవించిం దన్నది అందరూ చారిత్రకంగా గుర్తించే విషయం.

ఒక విచిత్రమైన వాదన అప్పుడప్పుడు మన ముందుకు వస్తుంటుంది. భారతదేశంలో ముస్లిములందరు ఒకప్పుడు హిందువులే, కొన్ని తరాల క్రితం ఇస్లాం స్వీకరించిన వారి సంతానమే అంటుంటారు. నిజానికి ప్రపంచంలోనే కాదు, స్వయంగా అరబ్బు భూభాగాల్లోని ముస్లిములందరు కూడా వారి పాత తరాల్లో ఏదో ఒక సందర్భంలో ఎవరో ఒకరు ఇస్లాం స్వీకరించడం వల్ల ముస్లిములుగా మారినవారే. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించింది 1400 సంవత్స రాల క్రితం. ఆ తర్వాతే అరేబియాలో ఇస్లాం విస్తరించింది.

ప్రారంభకాలంలో అరేబియా పరిస్థితి ఏమిటి? బహుదేవతారాధన, విగ్రహారాధన సమాజంలో లోతుగా వేళ్ళూనుకుని స్థిరపడిన సమాజంలో, తరతరాలుగా ప్రజలు తాతముత్తాతల మతవిశ్వాసా లకు, ఆచారాలకు గట్టిగా కట్టుబడిన వాతావరణంలో ఒక కొత్త సిద్ధాంతాన్ని, కొత్త విశ్వాసాన్ని, సామాజికంగా స్థిరపడిన వ్యవస్థను కుదిపేసే విశ్వాసాన్ని ప్రకటించి ప్రచారం చేయడానికి ఎంత ధైర్యం ఉండాలి?

ప్రవక్త ముహమ్మద్(స) అదే పని చేసి చూపించారు. దేవుడు ఒక్కడే, మనుషులు ఒక్కటే అన్నారు. మతపెద్దల పెత్తనాన్ని, సామాజిక అన్యాయాన్ని సవాలు చేసిన నినాదం ఇది. ఫలితం దాడుల పరంపర మొదలయ్యింది. ఆకలి, అణచివేతలు, భౌతికదాడులు, హింసా కాండ, చివరకు హత్యాకాండ కూడా మామూలయ్యాయి. అయినా ప్రారంభకాలంలో ఇస్లాం స్వీకరించిన వారి నిబద్ధత చెక్కు చెదరలేదు. ఇది ప్రవక్త వ్యక్తిత్వం, సందేశ ప్రచార సరళి సాధించిన విజయం. ప్రారంభకాలంలో ఇస్లాం స్వీకరించినవారు గుప్పెడు మంది మాత్రమే. కాని ఇస్లాం కోసం గట్టిగా నిలబడ్డారు. వారి మధ్య దృఢమైన ప్రేమానుబంధాల మానవ సంబంధాలు ఏర్పడ్డాయి. ఒకరి కోసం ఒకరు నిలబడే సమైక్యత ఏర్పడింది.


చివరకు ప్రవక్త (స) మక్కా వదలి మదీనా వలస పోవలసి వచ్చింది. ఆయన దైవాదేశంతో ముస్లిములను మదీనా వెళ్ళవలసిందిగా చెప్పారు. తాను కూడా మదీనా వలస వెళ్ళారు. ఈ సంఘటనను హిజ్రత్ అంటారు. ఇది ప్రవక్త వెనకడుగు వేయడం కాదు, వ్యూహాత్మక నిర్ణయం. దీనివల్ల మక్కాలో వ్యాపార వాణిజ్యాలు దెబ్బతిన్నాయి. మక్కా ఆర్థిక పరిస్థితి దెబ్బతింది. మదీనాలో ముస్లి ములు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమదైన సొంత రాజ్యవ్యవస్థను దైవాదేశాల ప్రకారం ఏర్పాటు చేసుకోగలిగారు. ఇది ఒక వ్యూహాత్మక నిర్ణయం, సాధించిన విజయం. హిజ్రత్ సంఘటన తర్వాతే మక్కా అవిశ్వాసుల పతనం ప్రారంభమయ్యింది. సత్యసందేశ ప్రదాతగా ప్రవక్త ముహమ్మద్ (స) సాధించిన విజయం ఇది.

ఇలాంటి వ్యూహాత్మక నిర్ణయమే మనకు హుదైబియా ఒప్పందంలో కనిపిస్తుంది. హుదైబియా ఒప్పందం వెనకడుగుగా కనిపించి నప్పటికీ తర్వాత మక్కా విజయానికి దారులు వేసిన ఒప్పంద మయ్యింది.

మదీనాలో ప్రవక్త (స) సోదరసంబంధాలను ఏర్పరచి సత్సమాజాన్ని ఎలా ఏర్పాటు చేయాలో నిరూపించారు. మదీనాలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) గురించి ప్రస్తావించడం అవసరం. ఆయనను మదీనా స్థానికుడు సాద్ బిన్ రబి (రజి)ను సోదరునిగా ప్రవక్త ప్రకటించారు. ఈ సోదర బంధం ఎలాంటిదంటే సాద్ (రజి) మదీనాలో అత్యంత సంపన్నుడు. ఆయన తన సగం సంపదను అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌కు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. కాని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) తనకు సంపద వద్దన్నారు. మార్కెట్‌కు వెళ్ళే దారి చూపించమని అడిగారు. మక్కా నుంచి వచ్చినప్పుడు ఆయన వద్ద బహుశా రెండు మూడు దీనార్లు మాత్రమే ఉన్నాయి. వాటితోనే చిరుస్థాయిలో వ్యాపారం ప్రారంభించారు. మదీనాలో పెద్ద వ్యాపారిగా అచిరకాలంలోనే మారగలిగారు.

ఇక్కడ రెండు విషయాలు మనం గమనించాలి. నేడు శరణార్థుల విషయంలో స్థానికుల్లో అసహనం కనిపిస్తోంది. వలసవచ్చే శరణార్థుల వల్ల తమకు సమస్యలు వస్తాయనే ఆగ్రహం చాలా దేశాల్లో మనం చూస్తున్నాం. కాని ఇలా వలస వచ్చిన వారిని స్థానిక సమాజంలో ఐక్యమయ్యేలా ఎలా చేయవచ్చునో, ఎలా సామరస్యాన్ని ప్రోత్సహించవచ్చునో, వలస వచ్చిన వారు ఎలా స్థానిక ఆర్థిక ప్రగతికి తోడ్పడతారో ఈ సంఘటన మనకు చాటి చెబుతుంది. దైవంపై నమ్మకంతో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) చేసిన ప్రయత్నాలు ఆయన్ను పెద్ద వాణిజ్యవేత్తగా నిలబెట్టాయి. నేడు bootstrapping గురించి మనం వింటున్నాము. కాని అప్పట్లోనే ఎలాంటి బయటి సహాయం, పెద్ద పెట్టుబడి లేకుండా వ్యాపారాన్ని ఎలా నిలబెట్టాలో ఈ సంఘటనలో ఒక పాఠం ఉంది. తొలికాలపు ముస్లిములను ప్రవక్త తీర్చిదిద్దిన తీరులో మనకు ఎన్నో పాఠా లున్నాయి.

అబ్దుల్ వాహెద్




**మతం ఒక 'గుడ్డి నమ్మకం'** అనే విమర్శ తరచు వింటూ ఉంటాం. కొన్ని మూఢనమ్మకాలు, మూఢాచారాలు చూసినప్పుడు అలా అనిపించవచ్చు కాని మూఢాచారాలు లేని సంపూర్ణ జీవనవ్యవస్థగా సత్యధర్మం మానవజీవనికి సాంత్వన ఇస్తుంది. మూఢాచారాల్లో కూరుకు పోయిన సమాజాన్ని, వ్యవస్థను ఆ ఊబి నుంచి బయటకు లాగిన ఇస్లాం ఆ కాలంలో ఎంత ప్రాముఖ్యత పొందిందో నేడు కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉంది. ఇస్లాం బోధనలు 1400 సంవత్సరాల క్రితం మానవ సమాజాన్ని ఎలా సంస్కరించాయో నేడు కూడా ప్రతి మనిషి వ్యక్తిగత జీవితానికి, సామాజిక జీవితానికి మార్గం చూపించే బోధనలుగా రుజువవుతున్నాయి.

ప్రవక్త ముహమ్మద్ (స) వివేకంతో, దైవిక జ్ఞానంతో, శిక్షణాసంస్కరణలతో, హితబోధతో, మార్గదర్శకత్వంతో, నాయకత్వ పటిమతో సాధించిన సర్వతోముఖ విప్లవాన్ని అర్థం చేసుకోవడం అవసరం. క్లుప్తంగా:

- సత్యం ఏమిటో ఆయన వివరణాత్మకంగా తెలియజేశారు.
- నైతిక ప్రమాణాల శిక్షకుడిగా మానవసంబంధాలకు దిశానిర్దేశన చేశారు.
- హేతుబద్ధ ఆలోచనలను ప్రోత్సహించి, శాస్త్రప్రగతికి దారులు వేశారు.

నేటికి 14 శతాబ్దాల క్రితం అప్పటి అరబ్బు సమాజంలో మాత్రమే కాదు యావత్తు ప్రపంచంలో మనిషి జీవితం గురించి, మానవజన్మ ఉద్దేశ్యం, లక్ష్యాల గురించి ఆలోచనలే ఉండేవి కావు. జీవితమంటే తినడం, తాగడం, ఆనందించడం, మరణించడంగా భావించేకాలం అది. బహుశా నేడు కూడా అలాగే ఉంది.

మనోవాంఛలే మనిషికి దైవాలయ్యాయి. నేడు కూడా మనకు ఈ పరిస్థితి కనిపిస్తుంది. మనిషి తన మనోవాంఛల ప్రకారం జీవించడానికి మాత్రమే ప్రయత్నిస్తాడు. భౌతిక సుఖభోగాలే ప్రధానంగా అప్పట్లోను ఉండేవి. నేడు కూడా ఉన్నాయి. నిజానికి మనిషి జీవితం భూమిపై కేవలం మున్నాళ్ళ ముచ్చట మాత్రమే, సంవత్సరాలు, దశాబ్దాలు ఇట్టే గడిచి పోతాయని, జీవితం చరమదశకు శరవేగంగా చేరుకుంటుందన్న స్పృహ నాడు ఉండేది కాదు, నేడు కూడా కనిపించదు. భౌతిక సుఖభోగాలే ప్రధానంగా మారినప్పుడు, ప్రాపంచిక హోదాలే ముఖ్యమైనప్పుడు, ప్రతిష్ఠ పెంచుకునే ప్రయత్నాలు కూడా సహజంగానే మొదలవుతాయి. ఆధ్యాత్మిక విలువలు అంతరించి ఆధ్యాత్మికతను ప్రదర్శించడం ప్రధానమవుతుంది. ప్రదర్శనతో ప్రతిష్ఠ పెంచుకునే ప్రయత్నాలు జరుగుతాయి. ఈ ప్రదర్శనకు ఉపయోగపడేది భౌతికంగా కనిపించే వస్తుసామగ్రి. తమ ప్రదర్శనాత్మక ఆధ్యాత్మికతతో ప్రతిష్ఠ పెంచుకునే ప్రయత్నాలకు విగ్రహాలు చాలా ఉపయోగపడతాయి. ఫలితంగా సొంత దేవుళ్ళ విగ్రహాలను తయారు చేసుకోవడం మొదలయ్యింది. తమ తమ ఇష్టానుసారం, తమ తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ గొప్పగా తమ తమ దేవుళ్ళ విగ్రహాలు తయారు చేసి ప్రదర్శించేవారు.

ఆధునిక కాలంలో ప్రతిష్ఠ కోసం ఈ ప్రదర్శనాత్మక వైఖరి కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక కార్లు, అత్యాధునిక

భవనాలు, ఖరీదైన చేతివాచీలు, ఖరీదైన దుస్తులు, ఖరీదైన సెల్ ఫోన్లు ... ఖరీదైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ....

ఆధ్యాత్మికత నైతిక ప్రధానమైనది. కాని అది భౌతిక ప్రధానమైనదిగా మారిపోతే ఆధ్యాత్మికతలో సారం అంతరిస్తుంది. మనుషులు లేని ఇల్లు ఇల్లు కాదు. ఆత్మ లేని శరీరం శరీరమూ కాదు. అలాగే నైతికత లేని భౌతిక ప్రదర్శన ఆధ్యాత్మికతా కాదు. నైతికసారం అంతరించడం వల్ల మనిషి జీవితం మరణంతో అంతరిస్తుందనే అభిప్రాయం బలపడింది. ఇక్కడేం చేసినా ఎలా బతికినా చనిపోయిన తర్వాత ఎవరికీ ఎక్కడా జవాబు చెప్పుకోవలసిన అవసరం లేదనే భావం ప్రబలింది. ప్రవక్త ఈ సామాజిక భావనలను పటాపంచలు చేశారు. చాలా సరళమైన సందేశంతో అప్పటి ఈ జీవనవిధానాన్ని సవాలు చేశారు. దేవుడు ఒక్కడే, ఆయనే విశ్వప్రభువు అని చెప్పారు. అంటే ప్రదర్శనాత్మక ప్రతిష్ఠలు పెంచుకునే వారందరి గొప్పలు నిజానికి గొప్పలు కావు. నిజమైన గొప్పవాడు దేవుడు ఒక్కడే. నిజమైన అధికారాలు ఆ దేవునికే ఉన్నాయి. మానవులంతా, రాజైనా, పేదైనా అందరూ ఆ విశ్వప్రభువుకు దాసులే. స్తుతిస్తోత్రాలు మనిషికి కాదు, దేవునికి మాత్రమే అనే ఈ సందేశం సమాజాన్ని ఒక్క కుదుపు కుదిపింది. విశ్వప్రభువు నిత్యుడు, ఆయన సృష్టికర్త, ఆయన మనిషి మరణించిన తర్వాత మళ్ళీ లేపి భూమిపై చేసిన ప్రతి పనికి లెక్క తీసుకుంటాడు అనే ఈ సందేశం ప్రదర్శనాత్మక ఆధ్యాత్మికత పునాదులు కుదిపేసింది.

ప్రదర్శనాత్మక ఆధ్యాత్మికత సొంత దేవుళ్ళను తయారు చేసింది. మనిషి ఎలా కావాలంటే అలా నియంత్రించ గలిగే అవకాశముండేది. కాని ప్రవక్త ముహమ్మద్ (స) సందేశం ఈ పరిస్థితిని మార్చేసింది. మనిషి చేతుల్లో నియంత్రణ లేదు, మనిషి జీవితం ఇహలోకంలోను, పరలోకంలోను దేవుని నియంత్రణలో ఉందని చాటి చెప్పింది. దీని ఫలితమేమిటంటే, మనిషి తన ఇష్టానుసారం జీవించడం కుదరదు, దైవాదేశాల ప్రకారం జీవించాలి. ఈ విశ్వాసం మనసులో స్థిరపడితే మంచి చెడు, పాపం పుణ్యం అనే ఆలోచనలు మొదలవుతాయి. దైవం శిక్షిస్తాడన్న భయం అనేక చెడులను నిర్మూలిస్తుంది.

మనిషి అన్నింటిని నియంత్రించాలనుకుంటాడు. తన అదుపు నుంచి ఏదీ బయటకు వెళ్ళరాదన్న మనస్తత్వం అంతర్గతంగా ఉంటుంది. ఈ మనస్తత్వమే కొందరిని నియంతలుగా మార్చేస్తుంది. కొన్ని విషయాల నియంత్రణ కోసం నియంత్రితులుగా మారిపోయి నియంతలకు దాసులయ్యేలా మరికొందరిని మార్చేస్తుంది. ఇది ఆధ్యాత్మికతలోనూ చోటు చేసుకుంటుంది. దైవాన్ని నియంత్రించడానికి సొంత దేవుళ్ళను తయారు చేసుకున్న తర్వాత, ఆ దేవుళ్ళను నియంత్రించే కట్టుబాట్లు, ఆచారాలు, సంస్కారాల జాలం అల్లేశారు. వీటన్నింటినీ చేయగలిగే వర్గం ఉనికిలోకి వచ్చింది. దేవుడితో ఈ పనులు చేయించుకోడానికి ఈ వర్గం చెప్పినట్లు సగటు ప్రజలు వినే వాతావరణం ఏర్పడింది. ఈ మొత్తం వ్యవస్థను ముహమ్మద్ (స) సందేశం తుత్తునియలు చేసింది. సగటు మనిషికి దేవునికి మధ్య మధ్యవర్తులెవ్వరు లేరని తేల్చి చెప్పింది. దేవుడు ఒక్కడే, మనుషులంతా ఒక్కటే. దేవుడికి రాజైనా, పేదైనా ఎవరైనా ఒక్కటే. ఎవరి మాటైనా ఒకేలా వింటాడు. ఈ విశ్వాసం ఏదో మామూలు మాట కాదు. వ్యవస్థల పీఠాలను కదిలించే విప్లవ నినాదం ఇది. ఈ విశ్వాసం మానవకల్పిత అసంఖ్యాక అసత్య దేవుళ్ళ నుంచి మనిషికి విముక్తి ప్రసాదించింది. నా దేవుడు గొప్ప అనే అహంకారాన్ని పటాపంచలు చేసింది. ప్రతిష్ఠ కోసం పాకులాడే మనస్తత్వాన్ని భూస్థాపితం చేసింది. అజ్ఞానాన్ని దూరం చేసింది. మనిషి రాజైనా పేదైనా అందరూ ఒకే వరుసలో నిలబడవలసి వచ్చింది.

మనిషికి స్వేచ్ఛనిచ్చిన నినాదం ఇది. అణిచివేతల నుంచి, లేమి నుంచి, భయం నుంచి స్వేచ్ఛ నిచ్చిన విశ్వాసం ఇది. ఈ విశ్వాసం జీవితాన్ని అర్ధవంతంగా, లక్ష్యబద్ధంగా మార్చింది. మనిషి భూమిపై దైవానికి ప్రతినిధిగా మారాడు. దేవుని ఆరాధించడం, దైవకారుణ్యాన్ని గుర్తించి కృతజ్ఞతలు చెప్పుకోవడం, దైవప్రసన్నత కోసం ప్రయత్నించడమే జీవితలక్ష్యంగా మారింది. ఇది సామాజిక జీవనంలో విప్లవాత్మక మార్పులకు దారితీసింది.

మానవ జీవితం అనేది భూమిపై ఒక ప్రయాణం వంటిది. మనిషికి ఇది పరీక్షా కాలం. ఈ పరీక్షలో నెగ్గి, దైవప్రసన్నత పొందితే దేవుని బహుమతులు పొందగలడు. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ ఇలా చెప్పింది: ''నిజానికి, ప్రజలలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించాలని, భూమిపై ఉన్న వస్తు సామగ్రినంతటినీ మేము భూమికి అలంకారంగా చేశాము. చివరకు మేము దీనినంతటినీ చదునైన మైదానంగా చేసి వేయనున్నాము.'' (కహఫ్: 7).

"ఈ సంపదా, ఈ సంతానమూ కేవలం ఐహిక జీవితపు తాత్కాలిక అలంకారాలు మాత్రమే. అసలు, శాశ్వతంగా ఉండిపోయే పుణ్యకార్యాలే నీ ప్రభువు దగ్గర పరిణామం రీత్యా ఉత్తమమైనవి. కాబట్టి వాటి మీదనే పెద్ద ఆశలు పెట్టుకోవాలి." (కహఫ్: 46).

డబ్బు ఎలా సంపాదించాలో? వ్యాపారంలో ఎలా లాభాలు పెంచుకోవాలో ప్రవక్త (స) నేర్పించలేదు. మనిషి జీవితాన్ని అర్థవంతం చేసే విలువలు, నమ్మకాలు బోధించారు. ఈ విలువలు నైతిక, ఆధ్యాత్మిక జీవితాన్ని సుసంపన్నం చేయడమే కాదు, భౌతిక జీవితంలోను సంతృప్తిని, సంతోషాన్ని సాధించి పెడతాయి.

మనిషి ఎల్లప్పుడు తనకు ఏది ముఖ్యమో దాని కోసమే ప్రయత్నిస్తాడు. సానుభూతి, దయ, క్షమాగుణం, సహనం నైతిక ప్రగతికి అవసరమనే భావన, నైతిక ప్రగతి లేనిదే మనిషి ఆధ్యాత్మిక సాఫల్యం లభించదనే నమ్మకం లేనప్పుడు ఈ విలువలు మానవసంబంధాల్లో కనిపించవు. ప్రవక్త (స) ఈ విలువలతో మానవసంబంధాలు వృద్ధి చెందేలా చేశారు. అందుకోసం నైతికంగా ఉత్తమవ్యక్తిత్వాలు సాధించుకునేలా ప్రోత్సహించారు.

ప్రవక్త బోధించిన నైతిక వ్యక్తిత్వం మనిషిని సామాజిక బాధ్యతలు గుర్తించేలా చేస్తుంది. భావోద్వేగాలను అదుపులో ఉంచుతుంది. నైతిక వివేచనను పెంపొందిస్తుంది. గమనించవలసిన మరో ముఖ్యమైన విషయమేమిటంటే, మనిషి కేవలం బుద్ధి వివేకాలున్న ప్రాణి మాత్రమే కాదు, ఆధ్యాత్మిక, నైతిక బాధ్యతలున్న ప్రాణి. ఈ బోధనలు సత్సమాజ నిర్మాణానికి తోడ్పడ్డాయి. ఈ సమాజంలో హక్కులే కాదు బాధ్యతల స్పృహ కూడా ప్రతి మనిషికి ఉంటుంది. దారిలో నడిచే హక్కు ఉన్నట్లే దారిలో ముళ్ళు కనబడితే తొలగించే బాధ్యత కూడా మనిషికి ఉంటుంది. ప్రవక్త సాధించిన విజయం ఈ స్పృహను పెంపొందించడం, ఇస్లాం సాముదాయిక జీవితాన్ని ప్రోత్సహించింది. ప్రవక్త సాముదాయికతను బోధించారు. ప్రార్థనల్లో అయినా మరో పనిలో అయినా ఒక టీముగానే వ్యవహరించాలి. దీనివల్ల ఒకరి కోసం ఒకరు నిలబడడం, త్యాగభావం, ఇతరుల పట్ల సానుభూతి, ఔదార్యం వంటి గుణగణాలు పెంపొందాయి.

ప్రజలను మంచి వైపు ఆహ్వానించడానికి, మంచిని చెయ్యమని ఆదేశించడానికి, చెడును నిరోధించడానికి ప్రతి మనిషి పూనుకోవాలని బోధించారు. ఈ బోధనలు బలమైన, నైతిక ప్రధానమైన మంచి సమాజాన్ని నిర్మించాయి.

ముఖ్యంగా ప్రవక్త కృతజ్ఞతా భావాన్ని, క్షమాగుణాన్ని ప్రోత్సహించారు. తోటి మానవుల పట్ల కృతజ్ఞత చూపించలేని వాడు దైవం పట్ల కూడా కృతజ్ఞత చూపించలేడని వక్కాణించారు. పరిశోధనల్లో తెలిసిందేమిటంటే కృతజ్ఞతా భావం కలిగి ఉండడం మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అందుకే దివ్య ఖుర్ఆన్ ప్రవక్త గురించి "మీకు దైవప్రవక్తలో అత్యుత్తమ ఆదర్శం ఉంది" (అహ్జాబ్ : 21) అని చెప్పింది.

అలాగే ప్రవక్త అత్యున్నత స్థాయి క్షమాగుణాన్ని ప్రదర్శించారు. తాయిఫ్ సంఘటనలో ఈ క్షమాగుణం మనకు కనిపిస్తుంది. అలాగే మక్కా విజయానంతరం కూడా. క్షమాగుణం వల్ల మనిషిలో సంతృప్తి జనిస్తుంది. సానుభూతి పెరుగుతుంది. మానసిక ఒత్తిడి తొలగిపోతుంది.

ప్రవక్త హేతుబద్ధ ఆలోచనలను ప్రోత్సహించారు. దివ్య ఖుర్ఆన్ అనేక సందర్భాల్లో తమ పరిసరాల్లో ప్రాకృతిక దృష్టాంతాలను చూసి ఆలోచించాలని ప్రోత్సహించింది. మానవ చరిత్రలో హేతుబద్ధ ఆలోచనలతో చరిత్రను మలుపు తిప్పాయి ఈ ఆలోచనలు. ప్రజల్లో పరిశీలనను, తార్కిక ఆలోచనలను పెంచాయి. శాస్త్రసాంకేతిక ప్రగతికి పునాదులు వేశాయి.

క్లుప్తంగా చెప్పాలంటే మైకెల్ హెచ్. హార్ట్ రాసినట్లు "ప్రపంచంలో అత్యంత ప్రభావశీల నేతల జాబితాలో ప్రవక్త ముహమ్మద్ (స) పేరును అందరికన్నా అగ్రభాగాన నేను ప్రస్తావించడం చాలా మందికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కొందరు ఈ ఎంపికను ప్రశ్నించనూ వచ్చు. కాని చరిత్రలో ధార్మిక, లౌకిక రంగాల్లో తిరుగులేని విజయాలు సాధించి ఏకైక వ్యక్తి ఆయన మాత్రమే."

ఆయన సర్వతోముఖ నాయకుడు. ఒక సందేశప్రదాతగా విప్లవాత్మక సందేశాన్ని ప్రజలు స్వీకరించేలా చేసిన సందేశ ప్రదాత. ప్రజలను సత్సమాజం స్థాపించే ఉత్తమ వ్యక్తిత్వాలుగా తీర్చిదిద్దిన సంస్కర్త. క్షమాగుణం, కృతజ్ఞతా భావాలకు అత్యుత్తమ ఉదాహరణగా మానవాళికి ఆదర్శంగా నిలిచిన మానవమహోపకారి. దైవప్రసన్నతే జీవితలక్ష్యంగా వ్యక్తులకు శిక్షణ ఇచ్చి సత్సమాజాన్ని స్థాపించిన అద్వితీయ శిక్షకుడు. ఈ నాలుగు లక్షణాలే ఆయన్ను సాటిలేని సర్వతోముఖ నాయకుడిగా చేశాయి. ❁




**ఉమైర్**

**నిశ్చయంగా అల్లాహ్ ప్రవక్త (స)** గొప్ప సందేశప్రదాత. ఆయన తన ఇంటి నుండి, సన్నిహిత మిత్రుల నుండి సందేశప్రచార కార్యక్రమం ప్రారంభించారని గుర్తించాలి. తరువాత అది యావత్తు ప్రపంచం విస్తరించింది. ఆయన భార్య ఖదీజా (రజి), సోదరుడు అలీ (రజి), మిత్రులు అబూబక్ర్ (రజి), జైద్ బిన్ హారిస్ (రజి) సందేశాన్ని స్వీకరించి ముస్లిములయ్యారు. ఆ పిదప ప్రవక్త (స) సందేశప్రచారం వల్ల, ఆయన సహచరుల సందేశ ప్రచారం వల్ల మరికొందరు ఇస్లాం స్వీకరించారు. ప్రారంభ కాలంలో ప్రవక్త ఆయన సహచరులు ఒక కొండచాటుకు వెళ్లి రహస్యంగా నమాజులు చేసేవారు. రహస్యంగానే తమ ఆరాధనలు కొనసాగించేవారు. ఆ తర్వాత ఇస్లాం సందేశాన్ని బాహాటంగా ప్రకటించాలని దైవం ఆదేశించాడు.

“వస్త్రం కప్పుకుని పడుకున్న మనిషీ! లే లేచి హెచ్చరించు. నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు.”అని దివ్యఖుర్ఆన్ ఆదేశించింది.

ఈ ఖుర్ఆన్ వాక్యం అర్థం ఏమిటంటే, ఓ ప్రవక్తా! లేచి, నీ చుట్టు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న, దైవాన్ని విస్మరించిన ప్రజలను హెచ్చరించు. ఏమనుకుంటే అది చేసేయడానికి, ఎలాంటి జవాబుదారితనం, బాధ్యతాభావం లేకుండా వ్యవహరించడానికి వారేమీ ఆటవిక రాజ్యంలో బతకడం లేదు. విశ్వప్రభువు ఔన్నత్యాన్ని ప్రకటించు. ఒక ప్రవక్త చేసే మొదటి పని ఇదే. ఎందుకంటే ఈ లోకంలో ఒకే ఒక్క దేవుడు తప్ప మరెవ్వరు గొప్పవారు కాదు.

ప్రవక్త జీవితచరిత్రను రచించిన ప్రఖ్యాత ధర్మవేత్త ఖాజీ సులైమాన్ సల్మాన్ మన్సూర్ పూరి సందేశ ప్రచారానికి సంబంధించి ఐదు తరగతులను వర్ణించారు. అవి:

1) సన్నిహితులు, బంధువులు
2) నగరవాసులు, తన ప్రాంతం వారు
3) మక్కా శివార్లలో ఉన్న తెగలు
4) అరేబియాలోని అన్ని తెగలు
5) ప్రపంచంలోని అన్ని నాగరిక జాతులు, మత సముదాయాలు

ఈ ఐదు తరగతులను గమనిస్తే ఆనాటి కాలంలో, శాస్త్ర సాంకేతిక ప్రగతి అనేది కనిపించని కాలంలో కూడా ప్రవక్త (స) తన సందేశ ప్రచార కార్యక్రమాన్ని ఎంత వ్యవస్థీకృతంగా నిర్వహించారో అర్థమవుతుంది. ప్రవక్త (స) స్థిరంగా, మొక్కువోని దీక్షతో, నిబద్ధతతో అన్ని రకాల కష్టనష్టాలను ఎదుర్కుంటూ తన సందేశప్రచారాన్ని కొనసాగించారు. హేతుబద్ధంగా, నిదర్శనాలతో, చక్కని వాక్పటిమతో తన సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. అనతికాలం

లోనే ఆ సందేశం యావత్తు ప్రపంచంలో విస్తరించింది.

ఆయన సఫా పర్వతంపైకి ఎక్కి తన సందేశాన్ని వినిపించారు. ప్రతి బస్తీలో, వీధిలో తన మాటను చేరవేశారు. ప్రజలను ఏకదైవా రాధన వైపునకు పిలిచారు.

ఆయన వివిధ తెగల వద్దకు ప్రయాణాలు చేసి తన సందేశాన్ని వారికి చేరవేశారు. తాయిఫ్‌లో బనూ సఖీఫ్ తెగకు తన సత్యసందేశాన్ని వినిపించారు. బనూ కుందా, బాను అమీరు తెగల వద్దకు వెళ్ళారు. వారికి ఇస్లాం గురించి తెలియజేశారు. ఈ ప్రయాణంలో ఆయనతో పాటు అబూ బకర్ (రజి) కూడా ఉన్నారు. ప్రవక్త మహనీయులు సత్యసందేశ ప్రచార కార్యక్రమాన్ని జీవితాంతం కొనసాగించారు. లేఖల ద్వారా, తన సహచరుల బృందాలను పంపించడం ద్వారా ఆ కాలంలో నాగరిక దేశాలన్నింటికి సత్యసందేశం చేరవేశారు.

ఆయన సత్యసందేశ ప్రచార సరళిని క్లుప్తంగా చూద్దాం. ఒక సందేశప్రచారకునిలో ఉండాల్సిన గుణగణాలన్నీ సంపూర్ణంగా ఆయనలో కనిపించేవి. మతాలను, వాటి వ్యవస్థాపకులను అధ్యయనం చేసిన పరిశోధకులు కూడా ఈ విషయాన్ని ఒప్పు కుంటారు. ప్రపంచంలోనే ప్రవక్త (స) ఈ విషయంలో అగ్రగామి. ఆయన సందేశం ఆయన జీవితకాలంలోనే ప్రపంచం నలుచెరగులా విస్తరించింది. నేటికీ ఇది కొనసాగుతూనే ఉంది. ఆయన సందేశప్రచార సరళిలో క్రింది విషయాలు ముఖ్యమైనవి:

## క్రమబద్ధంగా హితబోధ చేయడం

ఆయన నిరంతరంగా, అన్ని సమయాల్లో ప్రసంగాలు, హితబోధలు చేసేవారు కాదు. ఇరవై నాలుగు గంటలు సందేశప్రచారమే చేసేవారు కాదు. కానీ, సరైన సమయంలో, వివేకంతో సందేశప్రచారం చేసేవారు. ఒకేసారి అంతా చెప్పేయాలని ప్రయత్నించేవారు కాదు. క్రమబద్ధంగా, ఆగి ఆగి, తగిన విరామాలతో ఏకదైవారాధన గురించి, ఇస్లాం గురించి తెలియజేసేవారు.

అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఇలా అన్నారు: ''ప్రవక్త మహనీయులు హితబోధ చేయడానికి కొన్ని రోజులు నిర్ధారించేవారు. ఆ విధంగా వినేవారు విసుగు చెందకుండా చూసేవారు. అంటే, సందేశప్రచారాన్ని ప్రతిరోజు, ప్రతి సమయంలో నిర్వహించడం వల్ల వినేవారు విసిగిపోయే పరిస్థితిని నివారించడానికి తగిన విరామాలతో, తగినంత సమయం మాత్రమే ఈ పని చేసేవారు. ఆయన వినేవారి మానసిక పరిస్థితిని కూడా దృష్టిలో ఉంచుకునేవారు. ఎప్పుడు, ఏ సమయంలో శ్రోత మనస్సు, హృదయం సత్యాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉంటుందో ఆయన గ్రహించేవారు.

## సత్యసందేశప్రచారంలో వివేకవివేచనలు

ఆయన సత్యసందేశ ప్రచారసరళిలో ఒక ప్రత్యేకత ఉంది. ఎవరికైనా సత్యసందేశం గురించి వినిపించినప్పుడు ఆ వ్యక్తి స్వభావం, మనోభావాలను పూర్తిగా దృష్టిలో ఉంచుకునేవారు. అదేవిధంగా, ఇతర మతవర్గాల పండితులు ఎవరైనా ధార్మికచర్చ, సంభాషణ, సంవాదం కోరితే ఆయన అత్యంత మేలైన పద్ధతిలో సంభాషణ, సంవాదాల ద్వారా సత్యసందేశాన్ని తెలియజేసేవారు. ఇదే అల్లాహ్ ఆదేశం కూడాను.

ఒక సారి ఒక యువకుడు ప్రవక్త (స) సమావేశంలోకి వచ్చి, వ్యభిచరించడానికి అనుమతి కోరాడు. ఇది విని సహచరులు ఆగ్రహోదగ్రులయ్యారు. కాని ప్రవక్త వారిని నివారించి, ఆ యువకుడిని తన వద్దకు పిలిచారు. మృదువుగా అతనితో నీ తల్లి వ్యభిచరించడాన్ని ఇష్టపడగలవా? అని అడిగారు. ఆ యువకుడు 'అస్సలు ఇష్టపడను' అని జవాబిచ్చాడు. మీ కుమార్తె విషయంలో ఇష్టపడతారా అని అడిగారు ప్రవక్త. ఆ యువకుడు లేదు అని జవాబిచ్చాడు. ఇలా సుదీర్ఘ సంభాషణ జరిగింది. చివరకు ఆ యువకుడు వ్యభిచారం ఎలాంటిదో, ఎంత చెడ్డదో అర్థం చేసుకున్నాడు. ఆ యువకుడిని దేవుడు క్షమించాలని ప్రవక్త ప్రార్థించారు.

ప్రవక్త అనుసరించిన వివేకంతో కూడిన పద్ధతి ప్రభావం వల్ల ఆ యువకుడు శాశ్వతంగా వ్యభిచారాన్ని వదిలేశాడు. పశ్చాత్తాపం చెందాడు.

శ్రోతల భాషా పలుకుబడులను, జాతీయాలను కూడా దృష్టిలో ఉంచుకునేవారు. వినేవారు గంభీరమైన, ప్రామాణిక సాహిత్య భాషను అర్థం చేసుకునేవారైతే అలాంటి ప్రామాణిక భాషలోనే మాట్లాడేవారు.

ఆయన తన మాటలను పదే పదే చెప్పేవారు. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఆయన తన సహచరులకు ఏదన్నా చెప్పాలనుకుంటే మూడు సార్లు చెప్పేవారు. ఆ విధంగా తన మాటలు వారి మనోమస్తిష్కాలపై ముద్రించబడేలా చెప్పేవారు.

పై విషయాలను పరిశీలిస్తే ప్రవక్త సందేశప్రచార సరళి వివేకవివేచనలతో మనోహరంగా ఆకట్టుకునేలా ఉండేదని తెలుస్తోంది. ఆయన కేవలం మాటలతో చెప్పడమే కాదు, నేలపై గీతలు గీసి కూడా వివరించేవారు. కొన్నిసార్లు చారిత్రక సంఘటనల ద్వారా, కొన్నిసార్లు సూచనాప్రాయంగా చెప్పేవారు. ఆయన ఎన్నడూ గట్టిగా అరిచి, కేకలు వేసి, కోపంతో గొంతు చించుకుని మాట్లాడలేదు. చాలా మృదుమధురంగా మాట్లాడేవారు. ❁




మానవ సమాజాన్ని సంస్కరించడానికి, మార్గనిర్దేశం చేయడానికి, అల్లాహ్ ఇస్లాం రూపంలో ఉత్తమ జీవన నియమావళిని, ఖురాన్ రూపంలో పరిపూర్ణమైన రాజ్యాంగాన్ని ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా యావత్తు మానవాళికి ప్రసాదించాడు.

ఇస్లాం మతం ఒక పరిపూర్ణ మతం, "పరిపూర్ణత" అనే పదంలో సంపూర్ణ పురోగతి చెందిన అనే భావం ఉంది. మానవ జీవితానికి సంబంధించిన సమస్త రంగాల్లో అవసరమైన మార్గదర్శకత్వాన్ని సత్య ధర్మం సుస్పష్టం చేసిందన్న భావన ఇందులో ఇమిడి ఉంది. ఇస్లాంకు సంబంధించిన ఈ ప్రత్యేకత ముస్లింలకు మాత్రమే కాదు, ఇతర మతస్తులు కూడా గుర్తిస్తున్న ప్రత్యేకత. ఉదాహరణకు, ఒక సందర్భంలో ఒక యూద పండితుడు ఉమర్(రజి)తో, "మీ గ్రంథం (ఖుర్ఆన్) లో ఒక వాక్యం ఉంది. అది మా యూదులకు లభించి ఉంటే మేము ఆ రోజును పండుగ రోజుగా ప్రకటించి ఉండేవాళ్ళం."

ఉమర్ (రజి) ఆ యూద పండితునితో, "ఏ వాక్యం?" అని అడిగారు. అల్ మాయిదా సూరాలోని 3 వాక్యంలో "ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను." అనే వాక్యంగా ఆ యూద పండితుడు తెలియజేశాడు. గత కాలాల ప్రవక్తల అనుచర సముదాయాల్లో ఎవరికీ ఈ ప్రత్యేకత లభించలేదు.

మానవ జీవితంలోని ప్రతి రంగంలో మార్గదర్శనం ఇస్లాం ఇస్తుంది. ఈ మార్గదర్శనానికి ఉత్తమ ఉదాహరణ అల్లాహ్ పంపిన చివరి ప్రవక్త (స) జీవితంలో ఉంది. ఆయన గొప్ప సందేశ ప్రచారకర్త, సాటిలేని నేత, రాజకీయవేత్త, నిర్వాహకుడు, దౌత్యవేత్త, సైన్యాధ్యక్షునిగా, మానోవైజ్ఞానిక నిపుణునిగా, నిజాయితీపరునిగా, అమానతుదారునిగా, వ్యాపారిగా, మానవీయ విలువల బోధకునిగా, న్యాయమూర్తిగా, ప్రేమాభిమానాలు మూర్తీభవించిన తండ్రిగా, భర్తగా, సంస్కర్తగా, చిట్టచివరి ప్రవక్తగా ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయం.

ఇస్లాం ప్రత్యేకత ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం, వ్యక్తిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఒక పరిపూర్ణ నమూనా మనకు దొరుకుతుంది. ఆయన మదీనా నగరంలో స్థాపించిన ఇస్లామీయ రాజ్యం ఒక ఆదర్శరాజ్య నమూనాగా నిలిచింది. పౌరుల సామాజిక, సాంఘీక అవసరాలను ఒక రాజ్యం ఎలా తీర్చాలో చాటి చెప్పింది. ప్రపంచం ఉన్నంత కాలం అప్పటి మదీనా రాజ్య నమూనా ఒక ఆదర్శనమూనాగా కొనసాగుతుంది. మక్కా వీధుల నుంచి, తాయిఫ్ సందేశబోధనల నుంచి ప్రారంభమైన ఈ ప్రయాణం అనేక మలుపులు తిరిగింది. హింసాత్మక అణిచివేతలు భరించింది. యుద్ధాలను ఎదుర్కొంది. కష్టనష్టాలతో కూడిన కఠినమైన దారిలో తీవ్రమైన దుర్భర దశలను దాటుకుని న్యాయం ప్రధానమైన తరువాత న్యాయం ప్రధానంగా ఏర్పడిన రాజ్యవ్యవస్థ ఇది. తరతమ భేదాలు లేకుండా చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ ఇది. ధర్మం జీవితంలోని అన్ని రంగాల్లో ప్రతిబింబించేది. వివిధ తెగల రణభూమిగా ఉండే యస్రిబ్ నగరాన్ని ప్రవక్త తన రాజకీయ దూరదృష్టి, ఆదర్శ పరిపాలనతో సంక్షేమ రాజ్యంగా నిలబెట్టారు. తెగల వైరాన్ని అంతం చేసి ఒక్కటి చేశారు. ప్రవక్త ప్రగతిశీల ఆలోచనలు, వ్యక్తిత్వం వల్లనే మదీనాకు వలస వచ్చిన తర్వాత అక్కడ సురాజ్యవ్యవస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టారు. ఒక వ్యవస్థీకృత, రాజ్యాంగబద్ధ రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేయడానికి పూర్తి శ్రద్ధ చూపించారు. దేవుడు ఒక్కడే, మనుషులంతా ఒక్కటే అనే ధార్మిక పునాదిపై నిలబడిన వ్యవస్థీకృత రాజ్యాన్ని ఏర్పాటు

చేశారు. ఇలాంటి ఉదాహరణ మనకు ప్రపంచంలో మరొకటి కనిపించదు. మతదురభిమానాలను ఆయన తొలగించారు. మీ ధర్మం మీది మా ధర్మం మాది, ధర్మం విషయంలో బలవంతం లేదని స్పష్టంగా ప్రకటించింది ఇస్లాం. పాలకుడు అంటే ప్రజాసేవకుడు అనే భావాన్ని ప్రవేశపెట్టారు ప్రవక్త ముహమ్మద్ (స). ఈ ఆదర్శ రాజ్యం ఎలా ఉండేదంటే -

మక్కా నుంచి మదీనాకు వలస వచ్చిన ముస్లిములు అనేక సమస్యలతో పాటు పేదరికాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి ప్రవక్త ప్రపంచంలో ఎక్కడా ఎవ్వరు ఎన్నడూ చూడని గొప్ప సోదరభావాన్ని సమాజంలో ప్రవేశపెట్టారు. ముస్లిములందరు సోదరులని ప్రకటించారు. మక్కా నుంచి వలస వచ్చిన ముస్లిములు, మదీనాలోని ముస్లిములు అందరూ ఒకరికి ఒకరు సోదరులయ్యారు. ఈ ప్రకటన ఏదో సాధారణ నీతిసూత్రంగా మాట వరసకు చేసిన ప్రకటన కాదు. మదీనాలోని స్థానిక ముస్లిముల్లో ప్రతి ఒక్కరికి మక్కా నుంచి వలస వచ్చిన ప్రవాస ముస్లిమును సోదరునిగా మార్చారు. ఆ తర్వాత మదీనా స్థానిక ముస్లిములు మక్కా నుంచి వచ్చిన ప్రవాస ముస్లిమును తమ స్వంత సోదరుడిగా స్వీకరించి, ఒక సోదరుడికి ఇవ్వవలసిన ఆస్తి పంపకాలు కూడా చేశారు. తమ ఇళ్ళు, భూములు, వ్యాపారాల్లో వారికి భాగమిచ్చారు. ఇలాంటి సోదరభావానికి మరో ఉదాహరణ చరిత్రలో ఎక్కడైనా ఉందా? సమాజంలో ఆర్థిక హెచ్చుతగ్గులను ఈ సోదరభావం నిర్మూలించింది. ఒకరి కోసం మరొకరు త్యాగాలు చేసే త్యాగభావాన్ని పెంపొందించింది. ఈ సోదరభావం సమాజంలో అప్పు తీసుకుని చెల్లించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న వారి రుణాలను క్షమించే వైఖరిని ప్రోత్సహించింది. ఆ విధంగా అప్పట్లో యూద వడ్డీ వ్యాపారుల వడ్డీ ఆధారిత రుణాల ఊబిలో చిక్కుకున్న అనేకమంది పేదలను కాపాడ్డం జరిగింది. పేదరికాన్ని పారద్రోలి సమాజంలో ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించింది.

మదీనా స్థానికుల్లో రెండు తెగలు ఉండేవి. ఔస్, ఖజ్రజ్ అనే ఈ రెండు తెగలతో పాటు యూద తెగలు కూడా ఉండేవి. ఈ తెగలన్నింటి మధ్య సమైక్యతను ప్రవక్త సాధించారు. ఒక రాజ్యవ్యవస్థను స్థాపించారు. ఈ తెగలన్నింటి మధ్య ఒక రాతపూర్వక ఒప్పందం చేయించారు. ఇది 622 లో సంతకం చేసిన ప్రపంచంలోని మొట్టమొదటి అంతర్జాతీయ వ్రాతపూర్వక ఒప్పందం. స్థానిక తెగలు ఒక స్థానికేతర నాయకుడిని ఒప్పుకుని ఇందులో పాల్గొన్నాయి. ఈ ఒప్పందంలో 53 నిబంధనలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం, ప్రతి తెగ, ప్రతి వ్యక్తి తన మత విశ్వాసానికి కట్టుబడే స్వేచ్ఛ ఉంది. ఈ ఒప్పందం వల్ల శాంతి నెలకొంది. ప్రజల ప్రాణాలకు, సంపదకు రక్షణ లభించింది. నేరాలకు శిక్షలు విధించే ఖచ్చితమైన వ్యవస్థ వల్ల నేరాలు తగ్గాయి. మదీనాపై బయటి నుంచి దాడుల ప్రమాదాలు తగ్గాయి.

మదీనాలో ఆర్థిక వ్యవస్థ సుస్థిరమైన తరువాత, ప్రవక్త అంతర్గత రాజకీయ విధానాన్ని ప్రకటించారు. మదీనా పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న తెగలన్నింటిని ఒక్కటి చేశారు. ఇందులో చాలా ముస్లిమేతర తెగలున్నాయి. వారందరితోను ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వారందరికీ మదీనా రాజ్యంలో పౌరులుగా గుర్తించడం జరిగింది. అలాగే ఇస్లాం స్వీకరించి ఎవరైనా వ్యక్తి లేదా సమూహం మదీనాకు వలస రావాలనుకుంటే వారు రావచ్చని ప్రకటించారు. ఆ విధంగా మదీనాలో ముస్లిముల బలం పెరిగింది. సుస్థిర రాజ్యవ్యవస్థ ఏర్పడింది.

ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా రాజ్య విదేశాంగ విధానాన్ని స్పష్టంగా నిర్వచించారు. శాంతిభద్రతలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు. సరిహద్దులపై దాడులు, దండయాత్రల పరిస్థితుల్లో మాత్రమే ఆత్మరక్షణకు పోరాటానికి దిగాలని నిర్ణయించారు. మదీనా రాజ్యంలో చట్టబద్ధ పాలన, న్యాయస్థాపన ముఖ్యమైన అంశాలుగా మార్చారు. జాతి, వర్ణం, వర్గం, మతం తదితర వివక్షలు లేకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించేది. ప్రవక్త (స) తన వ్యాపార వ్యవహారాలను, రాజ్య వ్యవహారాలను స్వయంగా చూసేవారు. సామాజిక సంస్కరణలను అమలు చేస్తూ, నిశితంగా పర్యవేక్షించేవారు. ఫిర్యాదులపై తక్షణం స్పందించేవారు. దోషులను శిక్షించడంలో ఎలాంటి పక్షపాతాలు లేనే లేవు.

ప్రవక్త (స) మదీనా రాజ్యంలో విద్యకు అత్యధిక ప్రాముఖ్యతను ఇచ్చారు. ముస్లిములు మదీనా వలస రావడానికి ముందు ముసైబ్ బిన్ ఉమైర్‌ను ఉపాధ్యాయుడిగా మదీనాకు పంపారు. అక్కడి ప్రజలకు ఇస్లామీయ విద్యాజ్ఞానాలు లభ్యమయ్యేలా చేశారు. వలసల తరువాత, ప్రవక్త మసీదు నిర్మాణం, సుఫ్ఫా విద్యాలయం ఉనికిలోకి వచ్చింది. సహచరులు వివిధ భాషలు నేర్చుకునేలా ప్రోత్సహించారు. ప్రతి వ్యక్తి వివిధ విద్యలు, యుద్ధనైపుణ్యాలు నేర్చుకోవడం కళలు మరియు యుద్ధ బోధన ప్రతి వ్యక్తి నేర్చుకునేలా చేశారు. మహిళలు కూడా చేతివృత్తులు, చికిత్సా పద్ధతులు నేర్చుకునేలా ప్రోత్సహించారు.

ఇది ఒక చారిత్రాత్మక పరిణామం. అరబ్బు సంచార అజ్ఞాన తెగలు ప్రవక్త ముహమ్మద్ (స) నాయకత్వంలో ఒక్కటయ్యాయి. దేవుడు ఒక్కడే అనే సందేశంతో ప్రపంచంలో ప్రాబల్యం వహించడం ప్రారంభమయ్యింది. వారి విశ్వాస శక్తి శాస్త్రసాంకేతిక రంగాల్లోను, పరిపాలనా రంగంలోను, ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లోను నేటికి కూడా చరిత్రలో తనదైన, సాటిలేని అధ్యాయాన్ని రచించింది.

# సర్వతోముఖ నాయకత్వం మానవాళికి కారుణ్యం

రూహి

ఇస్లాం ఆవిర్భావానికి ముందు, ప్రపంచంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉండేది. మానవత్వం అనేది మృగ్యమయ్యింది. దయ, జాలి, సానుభూతి అనే పదాలు అరబ్బు భూభాగంలో అర్థం లేని పదాలుగా ఉండేవి. సొంత సోదరుల మధ్యనే భీకర పోరాటాలు జరిగేవి. మానవత్వం అనేది మచ్చుకు కూడా కనబడేది కాదు. అంధకారం అలుముకున్న కాలం అది. అలాంటి నేపథ్యంలో అరబ్బు భూభాగంలో ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించారు. ఆయన నలభై సంవత్సరాల వయస్సుకు చేరుకున్నప్పుడు దైవం ఆయన్ను భూమిపై ప్రవక్తగా నియమించాడు. ఆ వెంటనే ఆయన సర్వశక్తిమంతుడైన దేవుని సందేశాన్ని ప్రజలకు వినిపించడం ప్రారంభించారు. కాని ఈ సందేశం అక్కడి ప్రజలకు నచ్చలేదు. తాతముత్తాతల ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడు తున్నారని ఆగ్రహించారు. దౌర్జన్యాలు, దుర్మార్గాలు, క్రూర అణిచివేతల పరంపర ప్రారంభమయ్యింది. చిత్రహింసలకు గురి చేయడం మొదలయ్యింది. ఈ హింసాకాండను ప్రవక్త భరించారు. ప్రాణశత్రువుల పట్ల కూడా కారుణ్యం చూపించారు. చరిత్రలో నమోదైన కొన్ని సంఘటనలు చూడండి:

➢ ఒక వృద్ధ మహిళ ప్రతి రోజూ ఆయన నడిచే దారిలో చెత్తా చెదారం పోసేది. ప్రవక్త ముఖంపై చిరునవ్వు చెదిరేది కాదు. కాని ... ఒక రోజు ఆమె కనిపించ లేదు. తనపై చెత్తాచెదారాలు పడలేదు. ఆమెకేమయ్యిందో అని ఆయన విచారించారు. ఆమె ఆరోగ్యం బాగోలేదని తెలిసింది. ఆమె ఇంటికి వెళ్ళి ఎలా ఉన్నారు అని పరామర్శించారు.

➢ ఒక అవిశ్వాసి ఆయనపై ద్వేషంతో ఆయన నమాజులో ఉన్నప్పుడు ఆయనపై ఒంటె ప్రేవులు తెచ్చి మీద వేశాడు. ఆ వ్యక్తిని కూడా ఆయన క్షమించేశారు.

➢ ఆయన విజేతగా మక్కాలో ప్రవేశించినప్పుడు ఆయన ప్రాణశత్రువులు, ఆయన్ను అనేక రకాలుగా హింసించిన వారు గజగజలాడుతున్నప్పుడు, వారందరినీ ప్రవక్త క్షమించేశారు.

➢ ఆయన క్షమించి వదిలేసిన వారిలో హిందా అనే మహిళ కూడా ఒకరు. ఆయన ఎంతగానో ప్రేమించే పినతండ్రి హంజా (రజి)ను హతమార్చి, ఆయన కాలేయాన్ని నమిలిన మహిళ ఆమె. ఆమె ఆయన ముందుకు వచ్చి క్షమాభిక్ష కోరినప్పుడు ఆయన క్షమించానని చెప్పారు.

➢ ప్రపంచంలో ఇలాంటి ఉదాహరణలు మరెక్కడా కనిపించవు. ఆయన్ను చంపడానికి కుట్రలు పన్నిన అబూ సుఫ్యాన్ క్షమించారు. అంతేకాదు, మక్కాలో మొదటి శరణార్థి నిలయం అబూసుఫ్యాన్ ఇల్లుగా ప్రకటించారు.

➢ ఆయన తాయిఫ్ లోయకు వెళ్ళి దైవసందేశ ప్రచారానికి ప్రయత్నించినప్పుడు అక్కడి ప్రజలు రాళ్ళతో కొట్టి శరీరాన్ని రక్తసిక్తం చేశారు. దైవదూత జిబ్రయీల్ (అలై) ఆయన ముందుకు వచ్చి, మీరు ఆదేశిస్తే, నేను రెండు పర్వతాల మధ్య ఈ దుష్టులను నలిపేస్తాను అన్నారు. కాని ప్రవక్త దానికి ఒప్పుకోలేదు. వారిని క్షమించడమే కాదు వారికి తగిన హితబోధ ప్రసాదించాలని దేవుణ్ణి ప్రార్థించారు.

➢ ఆయన యావత్తు ప్రపంచానికే కాదు, మొత్తం విశ్వంలోని కణకణానికి కారుణ్యంగా పంపబడిన ప్రవక్త. దౌర్జన్యాలు, అణిచివేతల పర్వతాలు తనపై విరుచుకుపడుతున్నా ఆయన చిరునవ్వుతో కారుణ్యాన్ని ప్రదర్శించారు. ఆయన కారుణ్యం కేవలం ముస్లిములకే పరిమితం కాలేదు, అందరి విషయంలో అదే వైఖరి ప్రదర్శించారు. ఒకసారి అమానుష క్రూర అణిచి వేతలతో విసిగిన సహచరులు ఆయనతో అవిశ్వాసులను శపించ మని కోరారు. ఆయన వారికి జవాబిస్తూ, నేను శపించడానికి కాదు కరుణించడానికి పంపబడ్డాను అన్నారు. తుఫైల్ బిన్ ఉమర్‌ను దౌసీ తెగ వద్దకు ఇస్లాం సందేశ ప్రచారానికి పంపినప్పుడు ఆ తెగవారు సందేశాన్ని నిరాకరించారు. తుఫైల్ బిన్ ఉమర్ అక్కడి నుంచి వెనక్కి వచ్చి, ఆ తెగవారి వైఖరి అనుచితంగా ఉందని వారిని శపించాలని కోరారు. కాని ప్రవక్త

ఆ తెగవారి హితబోధ కోసం దేవుని ప్రార్థించారు. అస్మా (రజి) ప్రకారం ప్రవక్త ఏమనేవారంటే తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించాలని బోధించేవారు. తల్లిదండ్రులు ముస్లిములు కాకపోయినా సరే వారి పట్ల ప్రేమాదరాలు, గౌరవ మర్యాదులు కారుణ్యవైఖరితో వ్యవహరించాలని చెప్పేవారు.

మదీనాలో చాలా మంది కపటులు కూడా ఉండేవారు. ప్రవక్త సమక్షంలో ముస్లిముల సమక్షంలో తాము కూడా ముస్లిములుగా నటిస్తూ, దొంగచాటుగా దెబ్బతీయడానికి, తెర వెనుక కుట్రలు పన్నేవారు. ఈ విషయాలన్నీ ప్రవక్తకు తెలిసినా వారిని చూసి చూడకుండా వదిలేసేవారు. ఆయన కారుణ్యం మనుషులకే కాదు పశుపక్షాదుల పట్ల కూడా సమానంగా ఉండేది. అబూ హురైరా (రజి) ప్రకారం "మీ జంతువుల వీపులను వేదికలుగా మార్చేయవద్దు. వాటికి వేళకు మేత నీరు పెట్టండి. వాటిపై ఎక్కువ భారం వేయవద్దు. మేతబయళ్లలో వాటిని స్వేచ్ఛగా మేయడానికి వదిలేయండి. అవి కోరినవిధంగా మేస్తాయి. ఆయన పశువుల మధ్య పందేలు పెట్టడం, పోరాటాలు పెట్టడం, పక్షులను బాణాలతో గురిపెట్టడాలను కూడా నిషేధించారు. ఒకసారి ఒక వ్యక్తి తన దుప్పటిలో పక్షులను చుట్టి పట్టుకుని ఆయన వద్దకు వచ్చాడు. అది చూసిన వెంటనే ఆయన ఆ పక్షులను వదిలేయమని ఆదేశించారు.

ఆయన సంపద మొత్తాన్ని అనాథలకు, పేదలకు పంచేసేవారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం, ఆయన ఎంత ఉదారంగా ఉండేవారంటే, ఆయన వంటి వారు మరెవ్వరు లేరు. ఆయన స్వయంగా పేద నిరాడంబర జీవితాన్ని గడిపేవారు, కాని దాతృత్వంలో మహారాజులను, చక్రవర్తులను మించిపోయేవారు. ఒక స్త్రీ ఆయనకు ఒక దుప్పటి కానుకగా ఇచ్చింది. అదే సమయంలో ఒక పేద వ్యక్తి ఆయనతో ఆ దుప్పటి దానమివ్వ మని కోరాడు. వెంటనే ప్రవక్త(స) ఇచ్చేశారు. ఒకసారి 90,000 దిర్హములు ఆయన వద్దకు వచ్చాయి. ఆ మొత్తాన్ని అప్పటి కప్పుడు ఆయన పంచేశారు. జాబిర్ (రజి) ప్రకారం ఆయన ఎవరికీ ఎన్నడూ అడిగింది నిరాకరించలేదు. ఆయన వద్దకు వచ్చి అడిగిన వారు ఉత్తచేతులతో వెనక్కి వెళ్ళడం జరగలేదు. అనస్ (రజి) ప్రకారం ప్రవక్త ఎన్నడూ రేపటి కోసం ఏదీ దాచుకోలేదు. తన వద్ద ఉన్నదంతా అవసరమున్న వారికి పంచేసేవారు. ప్రవక్త ముహమ్మద్(స) చేసిన చివరి హజ్ ప్రసంగం నిజానికి న్యూ వరల్డ్ ఆర్డర్ వంటిది. ఆయన ఇలా అన్నారు:

## అంతిమ హజ్జ్ ప్రసంగం

"బాగా వినండి, అజ్ఞాన కాలపు ఆచారాలన్నీ నా పాదాల క్రిందున్నాయి (అంతమయి పొయ్యాయి). అరబ్బు వ్యక్తికి అరబ్బేతరునిపైగాని, అరబ్బేతరునికి అరబ్బుపై గాని ఎలాంటి ఆధిక్యత లేదు. మీరంతా ఆదమ్ సంతతిలోని వారే, ఆదమ్ మట్టితోనే సృజించబడ్డారన్నది మరువకండి.

"ముస్లిములంతా పరస్పరం సోదరులు."

"మీ బానిసలు! మీ బానిసలు!! మీరు స్వయంగా తినే భోజనమే వారికి కూడా పెట్టండి. మీరు స్వయంగా ధరించే బట్టలే వారికి కూడా ధరించడానికి ఇవ్వండి.

"అజ్ఞాన కాలపు హత్యాపరిహారాలన్నీ నేటితో అంతం చేయబడ్డాయి (ఇక ఎవరికీ ఎవరి హత్య ప్రతీకారమూ తీర్చుకునే అధికారం లేదు). ప్రప్రథమంగా నేనే నా వంశంలో రబియా బిన్ అల్ హరస్ కుమారుని హత్య ప్రతీకారాన్ని అంతం చేస్తున్నాను.

"మహిళల గురించి దేవునికి భయపడి మెలగండి, మీకు స్త్రీలపై ఏ విధంగా హక్కు ఉందో అదేవిధంగా వారికి కూడా మీపై హక్కు ఉంది.

"మీ రక్తం (ప్రాణం), మీ ధనం ప్రళయం వరకు ఒకరిదొకరికి పవిత్రం (అంటే నిషిద్ధం, వాటికి హాని చేయరాదు)- ఈ రోజు, ఈ నెల, ఈ నగరం పవిత్రమైనట్టు!

"నేను మీ కొరకు ఒక వస్తువును వదిలి వెడుతున్నాను, దాన్ని మీరు దృఢంగా పట్టుకుని అనుసరించారంటే మీరు దారి తప్పరు- అదే దైవగ్రంథం ఖుర్ఆన్."

ఆ తరువాత మహాప్రవక్త(స) ఎన్నో షరీఅత్ ఆదేశాలు తెలిపారు. పిదప సమావేశమయిన వారిని సంబోధిస్తూ, "దైవ సన్నిధిలో మిమ్మల్ని నా గురించి ప్రశ్నించినప్పుడు మీరు ఏమని సమాధానమిస్తారు?" అనడిగారు.

"మీరు దేవుని సందేశం మాకు అందజేశారనీ, తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారని బదులిస్తాం"అని జవాబు చెప్పారు సహాబా. దానికి ఆయన ఆకాశం వైపునకు వ్రేలెత్తి "అల్లాహ్! నీవు సాక్షి" అని మూడు పర్యాయాలు పలికారు. ఆ సందర్భంలోనే ఈ ఆయత్ అవతరించింది :

"నేడు నేను మీ కొరకు మీ ధర్మాన్ని, జీవిత సంవిధానాన్ని పరిపూర్ణం గావించాను. నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ కొరకు ఇస్లామ్‌నే అనుసరణీయమైన ధర్మంగా సమ్మతించాను."
ట (మాయిదా : 3)

ఈ హజ్జ్‌లోనే మహాప్రవక్త(స) హజ్జ్ సంప్రదాయాలన్నింటినీ స్వయంగా ఆచరించి హజ్జ్ ఎలా చేయాలో బోధించారు. అప్పుడే ఆయన "ఇదో, హజ్జ్‌లో పాటించవలసిన లాంఛనాలన్నీ ఇప్పుడు నా ద్వారా నేర్చుకోండి, నాకు తెలియదు, దీని మీదట నాకు మరోసారి హజ్జ్ కొరకు వచ్చే అవకాశం లభిస్తుందో లేదా!" అని సెలవిచ్చారు.

అప్పుడే, "ఇప్పుడు ఇక్కడ ఉన్నవారు ఈ మాటలన్నీ ఇక్కడ లేనివారికి తెలియజేయాలి" అని కూడా అన్నారాయన. ❀

# సంపూర్ణ ఆదర్శం విస్మరించిన బాధ్యత!



నిజామీ కుమార

**ఆయన జీవితం ఆదర్శ జీవితం-** ఆనందంలోనూ ఆపత్తుల్లోనూ, ఆసియాలోనూ ఆఫ్రికాలోనూ, మగవారికయినా మగువలకయినా, గతంలోనయినా వర్తమానంలోనయినా; రాజులకయినా పేదలకయినా, పాలకులకయినా పాలితులకయినా, వాణిజ్యవేత్తలకయినా యోధానుయోధులకయినా; న్యాయాధిపతులకయినా, రాజ్యాధికారులకయినా!

అంతేకాదు, ఆయన జీవితం సకల సందర్భాలకూ ఆదర్శం. మలమూత్ర విసర్జనలు ఎలా చెయ్యాలో అన్న విషయంతో మొదలెట్టి కాళ్ళూ చేతులూ ఎలా శుభ్రపరచుకోవాలో, స్నానాదులు, భోజన పానీయాలతోపాటు నిద్రపోవటం, భార్యా పిల్లలతో మసలుకునే విధానాలతో సహా సర్వ విషయాలలో అన్ని వేళలా ఆయన జీవితం ఓ నిండు ఆదర్శం.

జగతికి స్వామి, మానవుల కర్త దైవం సమస్త మానవాళికి మార్గదర్శిగా, కాంతిగా ఆయన్ని పంపాడు:

***మీ వద్దకు అల్లాహ్ వద్ద నుంచి కాంతి వచ్చేసింది. మరొక సత్యస్వరూపమయిన గ్రంథం (కుర్ఆన్) కూడా.*** *(మాఇద: 15)*

ఆయన్ని నిఖిల జగతికి కారుణ్యంగా కూడా పంపాడు :

***ముహమ్మద్! మేము నిన్ను ప్రపంచవాసుల కొరకు కారుణ్యం గానే చేసి పంపాము.*** *(అన్బియా : 107)*

అందువల్లనే దైవం ఆయనలో ఉత్తమ ఆదర్శం ఉందని వక్కాణించాడు :

***వాస్తవానికి మీ కొరకు దైవ సందేశహరునిలో ఒక ఉత్తమ ఆదర్శముంది.*** *(అహ్జాబ్ : 21)*

ఇవి దివ్య ఖుర్‌ఆన్‌లోని ప్రస్తావనలు. ఇక్కడ ప్రస్తావించబడిన 'ఆయన' సహజంగా మహనీయ ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్). ఆయనే యావత్ప్రపంచానికి ఆదర్శమూర్తి!

ప్రపంచంలో ప్రవక్త శ్రీ ముహమ్మద్(స)ను అనుసరించేవారు లేని దేశమంటూ లేదని నేడు చెప్పవచ్చునేమో కాని ఆయన అందజేసిన సమస్త బోధనల్ని ఆచరిస్తున్నవారున్నారని చెప్ప గలమా? వైయక్తిక ఆదర్శాన్ని పాటించేవారున్నా సామూహిక ఆదర్శాన్ని పాటించేవారు ఎందరు? అలా పాటించగల అవకాశాలున్న సముదాయాలు, సమాజాలు ఎన్ని? ముఖ్యంగా ఆయన స్థాపించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలను పాటిస్తున్నవారెందరు? అలా పాటించగలగ టానికి ఎన్ని దేశాలు ముందుకు వస్తున్నాయి? ఇలా ఆలో చిస్తే ఎన్నెన్నో ప్రశ్నలు ప్రత్యక్షమయి సూటిగా చూస్తాయి.

ఏది ఏమయినప్పటికీ ఆయన లోక నాయకుడు, ధర్మపథ నిర్దేశకుడు, కారుణ్య స్వరూపుడు, జ్యోతిర్మయుడయిన ఆదర్శనీయుడు. ఆయన అడుగుజాడలలో నడవడమే మానవులకు శ్రేయస్కర మార్గం, సఫలతా సోపానం అని నమ్మి కూర్చోవడమే తమ ఇహపర జీవితానికి అంతిమ ఆశయమన్నట్టు క్రియాశూన్యులయి ఉన్న మహామహు లెందరో ఉన్నారు! కాని ఆ ఆదర్శాన్ని తమ వైయక్తిక, కుటుంబ, సామాజిక, ఆర్థిక, రాజకీయ, పరిపాలనా వ్యవహారాలలో, అంతర్జాతీయ సంబంధాల రంగాలలో వినియోగించే పావన జీవులెంత మంది, అటువంటి ఎన్ని సమాజాలు, ఎన్ని సముదాయాలు, ఎన్ని రాజ్యాలు కళ్ళెదుట మెదులుతాయి? అన్నదే ప్రశ్న. ఈ ప్రశ్న మనల్ని అన్ని వైపుల నుంచి కూడా ఎదురవుతూ ఉంటుంది.

సఊదీ అరేబియా వంటి సర్వ స్వతంత్ర ముస్లిం దేశాలు దాదాపు 56 ఈ ప్రపంచంలో ఉన్నాయని అంటారు. ఆ దేశాలు రాజరికంతోనో, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంతోనో, అధ్యక్ష తరహా పరిపాలనా విధానంతోనో అలరారుతున్నాయి. అక్కడెక్కడా నిజమయిన ఇస్లామీయ పరిపాలనా తీరు, ఇస్లామీయ రాజకీయ వ్యవస్థ చెలామణిలో ఉన్నట్టు మనకు కానరాదు. అక్కడి పాలకులు, పాలితులు తమ తమ వ్యక్తిగత జీవితాల్లో ప్రవక్త ఆదర్శాన్ని ఏ మేరకు నిలుపుకుని ధన్యులవు తున్నారో మనమెరుగము. అటువంటి 'ముస్లిమ్' దేశాలలోనే కాక ముస్లిమేతర దేశాలలోనూ పాలనా పాశాలు తమ చేతుల్లో లేని ముస్లిములు ప్రపంచంలోని అనేక ప్రజాస్వామిక రాజ్యాల్లో నివసిస్తున్నారు.

భారతావని కూడా అటువంటి ప్రజాస్వామిక దేశాల్లో ఒకటి. ఇక్కడి ముస్లిములు నివసిస్తున్న వ్యవస్థాగత విధానాన్ని ప్రవక్త కాలంలోని ఏ వ్యవస్థతోనూ పోల్చలేము. మదీనా ఆదర్శాన్ని భారత ముస్లిములు అసలే గ్రహించలేరు. మదీనాలో ప్రవక్తశ్రీ (స), ఆయన సహచరమాన్యులు పాలకులుగా జీవించారు. అందువల్ల అక్కడి ముస్లిముల వ్యక్తిగత శీల స్వభావాల నయితే గ్రహించగలమేమో గాని సామూహిక వ్యవహార సరళిని గ్రహించి పాటించడం బహుధా అసంభవం. పోతే మక్కా జీవితపు ఆదర్శాన్నయినా గ్రహించడం నా దృష్టిలో సులువయిన విషయం కాదు. దీనికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా నేటి మానవుని నాగరికతా ప్రగతి వికాసాలు, రాజకీయ విధానాల సరికొత్త రూపాలు, సుసంఘటిత అంత ర్జాతీయ వ్యవస్థ వల్ల తారసపడిన వాతావరణం ఇత్యాదివి!

నేడు మన దేశం ప్రజాస్వామ్య విధానంతో వ్యవస్థీకృతమయి ఉంది. ప్రజాస్వామిక వ్యవస్థలో అనేక మేళ్ళతోపాటు కొన్ని కీళ్ళూ ఉన్నాయి. ఈ వ్యవస్థలో సహజీవన భావనలకు ప్రాధా న్యత ఉంటుంది. ప్రతి ఒక్కరు తమకు ప్రియమయిన విశ్వాసాన్ని కలిగి ఉండటానికి, ఇతరులను బాధించకుండా దాన్ని ఇతరులకు బోధించడానికి, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి, ప్రత్యర్థుల అభిప్రాయాలను సహించడానికి, భరించడానికి అవకాశముంది, ఆస్కార ముంది. నిజానికి అసలు ప్రజాస్వామిక వ్యవస్థకు ఊపిరి ఇదే. తమకు నచ్చని దాన్నీ ఇతరులకు ఇష్టమయినదయినా భరించడం తప్ప గత్యంతరం లేదు! అయితే ఈ వ్యవస్థలో 'ప్రామాణి కత'కు బదులు 'పరిమాణమే' ముఖ్యం. ఇంకా ఇందులో 'సామర్థ్య బలం'కన్నా 'సత్యతా శక్తి'కన్నా సంఖ్యా బలమే ప్రధానం. ఈ చెడుగు ప్రజాస్వామిక వ్యవస్థలో దారి చేసుకున్న దంటే కారణం వ్యవస్థను రూపొందించడంలో ఎటువంటి 'గీటురాయి'ని ముందుంచుకోకపోవడం మాత్రమే.

నాటి అరేబియాలో ముఖ్యంగా మక్కాలో సుసంఘటిత రాజకీయ వ్యవస్థ ఏదీ లేదు. అలా అని అరాచక స్థితి కూడా ప్రబలిలేదు. అక్కడ తెగలవారీగా పరస్పర రక్షణా బాధ్యతతో ఓ వ్యవస్థ, పరస్పర రక్షణ పూచికత్తు వ్యవస్థ అలరారేది.

తెగల రక్షణ బాధ్యతలతో ఒండొకరి ఆలంబనగా ఆ సంఘం మనగలుగుతూ ఉండేది. ఏ వ్యక్తి లేదా వ్యక్తులయినా తమ తెగ లేకపోతే ఏదో ఒక తెగ రక్షణ ఛాయ లేనిదే అక్కడ జీవించలేరు. అలాగే ఒక తెగలోని ఏ వ్యక్తికయినా ఏదయినా ముప్పు కలిగితే తెగలోని సకల జనులు అతనికి మద్దతుగా కలసికట్టుగా దాన్ని భరించడం సహజం. కాగా, ప్రవక్త(స) తన ఇస్లామ్ సందేశం కారణంగా మక్కా విరోధుల సంఘ బహిష్కరణకు గురయినప్పుడు కేవలం ఆయన, ఆయనతో పాటు ధర్మంలో ఆయన సహచరులు మటుకే కాదు బనూ హాషిమ్, బనూ ముత్తలిబ్ తెగలవారు కూడా బహిష్కృతు లయ్యారు. నిజానికి వారందరూ ఇస్లామ్ స్వీకరించినవారు కారు. ఆ బహిష్కరణను వారు, తెగల వ్యవస్థలోని విధానం కారణంగానే కలసి భరించారు. ఆ ఆపదను తెగవారు, తెగ సంరక్షణ అండలో ఉన్నవారందరూ కలసికట్టుగా భరించారు!!

### జీవన విధానం

ప్రపంచానికి వ్యక్తిగత సామూహిక జీవన వ్యవస్థలు రెండు మార్గాల ద్వారా అందాయి. కొందరు మేథో సంపన్నులు ప్రపంచ పోకడలు, వ్యవహారాలు, జన జీవనంలోని ఎత్తు పల్లాలు గమనించి కొన్ని మార్గాలు సూచించారు. అటువంటి వారు అరిస్టాటిల్, సోక్రటీస్, ప్లాటో తదితరులు. వీరి భావాలకు భూమిక కేవలం ప్రపంచంలో వీరి అనుభవాలు, వీరి ఆలోచనలు, స్వీయ ప్రేరణలు మాత్రమే. ఇదొక మార్గమయితే, మానవులకు భౌతిక, నైతిక జీవన విధానం తెలిసిన మరో మార్గదర్శకులు ప్రవక్తలు. వీరు తమ మేథస్సు ద్వారా, స్వీయ ప్రేరణల ద్వారా, స్వంత ఆలోచనల ఫలితంగా, అనుభవాల మూలంగా ఏమీ పలుకరు, ఏది చెప్పినా ప్రపంచ విరాట్టు, యావత్తు జగతి సృష్టికర్త, విశ్వప్రభువు, జగన్నాయకుడు దైవం తెలిపిన విషయాన్నే అక్షరక్షరం పొల్లు పోకుండా చెబుతారు. వారు చెప్పిన దాన్నే మనం 'ధార్మిక బోధన' అని అంటాము. ఆ పరంపరలోని చిట్టచివరివారే మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్). ఆయన అందజేసిన అంతిమ గ్రంథమే దివ్య కుర్ఆన్. అదే నేడు మానవులకు అతి భద్రంగా అందిన దైవమార్గదర్శక గ్రంథం. ప్రవక్త్రశీ జీవితమే భద్రంగా ఉన్న ఏకైక ఆదర్శ జీవన జ్యోతి.

నేడు మానవుడు సాంఘిక శాస్త్ర రంగంలో ఎంతో ప్రగతి సాధించాడు. ముఖ్యంగా నాగరిక వ్యవహారాలలో గత రెండు మూడు శతాబ్దులుగా గడించిన ప్రగతి, వెనుకటి సహస్రాబ్దుల వృద్ధిని ఒక్కసారిగా ఎన్నో వందల రెట్లు దాటివేశాడు మనిషి. ఒక్క నాగరిక రంగంలోనే కాక సకల శాస్త్రీయ రంగాలలోనూ సాంకేతిక రంగాలలోనూ వృద్ధీ వికాసాలు అలాగే సాగాయన్నది యథార్థం. మనం సామాజిక విషయాన్ని చర్చిస్తున్నాము కాబట్టి వాటి ప్రస్తావన అలా వదలిపెడదాము.

ఇంతకు మనం భారతదేశంలో సామాజిక, రాజకీయ పరిస్థితుల్ని ప్రస్తావిస్తున్నాము. ఇక్కడి ప్రజాస్వామిక వ్యవస్థలోని మంచిచెబ్బరలను చెప్పుకున్నాము. ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాకులదే పాలన. ఇక్కడ అనేక రాజకీయ పార్టీలు, రాజకీయ సిద్ధాంతాలు, కార్యక్రమాల ఆధారంగా పని చేస్తున్నాయి. ఏ సిద్ధాంతాల ఆధారంగానయినా రాజకీయాలను నడిపే సౌలభ్యం, సౌకర్యం ఇక్కడి రాజ్యాంగం రీత్యా ప్రజలకు ప్రాప్తమయి ఉంది. అందువల్లనే సెక్యులర్ (ధర్మాలీన) విధానం గల కాంగ్రెస్ వంటి పార్టీలు, ధర్మ వ్యతిరేకత గల, పూర్తిగా సామాజిక భూమిక గల కమ్యూనిస్టు పార్టీలు, మతతత్వం తమ విధానం కాదంటూనే హిందూ సాంస్కృతిక తత్వాన్ని, హిందూత్వాన్ని ఆధారం చేసుకున్న భారతీయ జనతా పార్టీ వంటి పార్టీలు ప్రాంతీయ తత్వాన్నీ, భాషా తత్వాన్నీ బోధించే శివసేన, ద్రావిడ మున్నేట్ర కజగం వంటి పార్టీలు రాజకీయ రంగంలో పనిచేస్తున్నాయి.

ఇటువంటి పలు విధాల పార్టీలు, అనేక భాషలు, అసంఖ్యాక మతాలు, అభిమతాలు ఉన్న సువిశాల భారతదేశంలో ముస్లిములు నివసిస్తున్నారు. ఈ ఉపఖండం వంటి దేశంలో ముస్లిములు దేశమంతటా విస్తరించి ఉన్నారు. అసాం, కేరళ, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో వీరి సంఖ్యాబలం కాస్త ఎక్కువ ఉన్నా ముస్లిములు లేని జిల్లా, లేని రాష్ట్రం బహుశా దేశంలో ఏదీ లేదు. కశ్మీరు మొదలుకొని కన్యాకుమారి వరకు, గుజరాత్ నుండి అసాం వరకు అనేక భాషలు, అనేక వేషధారణలతో అలరారే భారత జనజీవనంలో ముస్లిములు మమేకమయి పోయినా, తమ విశ్వాసాల రీత్యా, ఆచార వ్యవహారాల దృష్ట్యా తమదంటూ ప్రత్యేకతను ఏదోవిధంగా నిలుపుకుని జీవిస్తున్నారు. అంతేకాని ప్రవక్త మహనీయులు తన చివరి హజ్జ్ ప్రసంగంలో తన సంబోధితులతో ఆనాడు చేయించుకున్న వాగ్దానం ప్రకారం తమకు అప్పగించిన బాధ్యతను పూర్తిగా విస్మరించారు. ఆ రోజున ఆయన(స)

తన సమక్షంలో వింటున్న లక్షలాది విశ్వాసులను సంబోధించి,

**"బల్లిగూ అన్నీ వలౌ ఆయహ్"**

"నా ద్వారా విన్న ఒక్క ఆయత్ అయినా సరే ఇతరులకు ప్రస్ఫుటపరచండి" అన్నారు.

ఇంకా, "ఇక్కడ హాజరయి ఉన్నవారు, హాజరు కాలేకపోయిన వారికి ఈ సందేశాన్ని చేరవేయాలి... నా గురించి దేవుని సమక్షంలో మిమ్మల్ని అడిగినప్పుడు ఏమని సమాధానం చెబుతారు?" అని ఆయన ప్రశ్నించినప్పుడు అక్కడున్న వారంతా ముక్తకంఠంతో,

> "మీరు దైవ సందేశాన్ని పూర్తిగా చేరవేశారు, తమ బాధ్యతను నిర్వర్తించారు అని సాక్ష్యం పలుకు తామ"ని బదులిచ్చారు.

ఆయన(స) వెంటనే సాక్ష్యానికి ప్రతీకగా వ్రేలెత్తి ఆకాశం వైపు చూపుతూ... "దైవమా, నీవే సాక్షి, దైవమా, నీవే సాక్షి" అన్నారు.

ఆనాటి సహచరమాన్యులు (ర) తమ వాగ్దానం ప్రకారం, రేయనక పగలనక, ఎండనక, వాననక, తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణాలు ప్రపంచమంతా సంచరించి ఆయన అందజేసిన సందేశాన్ని, దివ్య ఖుర్‌ఆన్‌ని, ఇస్లామ్ జీవన దాయక అమృతాన్ని అందజేశారు. భారతావనిలోనూ దక్షిణాన కేరళ సముద్ర తీరాలను దాటి వచ్చి, ఉత్తరాన సింధూ ప్రాంతాలకు చేరి, ఆ బాధ్యతను నిర్వర్తించారు. ఆ బాధ్యతను సర్వదా నిర్వర్తిస్తూ ఉండాలని బోధించి మరీ హెచ్చరించారు.

కాని కాలక్రమేణ ఆ బాధ్యతను విస్మరిస్తూ నేడున్న పరిస్థితికి చేరారు విశ్వాసులు!

ఇప్పటికీ సమయం మించిపోలేదు, ఎప్పటికీ మించి పోదు, సత్కార్యానికి సమయం ఎన్నడూ మించిపోదు!!

నేడయినా ముస్లిములు, విశ్వాసులు మేల్కొని తమ ఆ వాగ్దాన పాలనకు సన్నద్ధులయితే అంతకుమించిన శుభ తరుణం మరొకటి ఉండదు!!!






ఎస్.ఎమ్. మలిక్

**నేడు మనం కళ్ళారా పరిశీలిస్తున్నట్లే,** నిత్యం అనుభవిస్తున్నట్లే, మనందరి దౌర్భాగ్య జీవితాల్లో ఈ దృశ్యాలు, భూతకాల దృశ్యాలు వర్తమానాలయిపోయినట్లే, నేటి ప్రజల దురదృష్టకర జీవితాల్లో, నేటి సమాజాల్లో అనుక్షణం, అడుగడుగునా దర్శనమిస్తున్నట్లే లోగడ కూడా ఈ సన్నివేశాలు, ఈ దృశ్యాలు, అనేక ప్రదేశాలలో, అనేక సమాజాలలో, అనేక గత చారిత్రక ఘట్టాలలో అనునిత్య అనుభవాలయినటువంటివే! వాటి ప్రదర్శన విభిన్న రూపాలలో, అనేక ప్రాంతా లలో చోటు చేసుకున్న మాట వాస్తవం. అలాగే నేటికి దాదాపు వెయ్యి న్నర సంవత్సరాలకు పూర్వం, మన నాటికి రమారమి వెయ్యిన్నర మైళ్ళ దూరాన, పశ్చిమ దిశలో, అరేబియా ప్రాంతాన అటువంటి ఘటనలు, ఉదంతాలు అనుదిన ఘటనలయ్యాయి. ఇదే అరాచక సమాజం, ఇదే అనైతిక జనావళి, ఇదే అశ్లీల వాతావరణం! ముఠా తత్వాలు, పోరాటాలు, కలహాలు, కలతలు, కల్లోలాలు!! నాయకత్వం లేదు, దిశ లేదు, నిర్దేశనా లేదు- అంతా ఇదే స్థితి, అంతా ఇదే విచిత్ర చిత్రం, ఇదే చూడనలవి కాని చోద్యం. అప్పుడే... అప్పుడే అవసరమవుతాడు ఓ మార్గదర్శి, ఓ నాయకుడు, ఓ ఆదర్శమూర్తి... అవసర మవుతాడు, అవసరమయ్యాడు! అప్పుడే.. యధావిధిగా ఆవిర్భవిం చాడు ఆ బోధకుడు, ఆ సందేశదాత... దైవ సందేశహరుడు... దైవప్రవక్త!!

కాని... ఆ కాలం... సాధారణ కాలం కాదు.. మునుపటిలా కాదు... నేటికి కేవలం వెయ్యిన్నర సంవత్సరాలకు పూర్వపు కాలమే! ప్రపంచంలో ఆధునిక నాగరికత తప్పటడుగులు వేస్తున్న రోజులు అవి, వేనవేల సంవత్సరాల అనుభవాల సుదీర్ఘ రహదారిని దాటి కొంగ్రొత్త సంస్కృతీ సభ్యతల రాచబాటకు మానవత, పునాదిరాళ్ళు వెతుకుతున్న శుభ సమయమది! దాటిపోయిన అసంఖ్యాకమయిన మజిలీల సుమధుర జ్ఞాపకాల సంపదను మేధో నిధిలో పదిలపరచుకుని ముందడుగు వేస్తున్న కాలమది!! ఎన్నో విద్యలు, కళలు, జ్ఞాన విజ్ఞాన వీధులు సంచరించి అన్నింటినీ ప్రోది చేసుకుని,

ప్రోగు చేసుకుని పురోగమనమే గురిగా, అభ్యుదయమే ధ్యాసగా నవనవో న్వేషణ ఉదయాలే దరహాసాలుగా ఆశలుగా మానవ సభ్యతా సంస్కృ తులు కూనిరాగాలు తీస్తూ అందమయిన మలుపు తిరుగుతున్న కాలమది!!!

అప్పుడు ప్రభవించాడు, ఆ శుభకాలంలో ఆవిర్భవించాడు, బైబిల్ భవిష్యవాణి పలికిన 'ఆ ప్రవక్త'. దేవుని అంతిమ బోధకుడు (ఖాతమన్నబియ్యీన్), చివరి దైవ సందేశహరుడు (ఖత్మురస్సుల్), ఆయన ఒక్క అరేబియాకే కాదు యావజ్జగతికి 'కారుణ్యం' (రహ్మతుల్ లిల్ ఆలమీన్)గా, మూర్తీభవించిన 'సుందర ఆదర్శం' (ఉస్వతున్ హసన)గా!! శుభవార్త నిచ్చేవాని (బషీర్)గా, హెచ్చరిక చేసేవాని (నజీర్) గాను!!! ఆయనే సత్యసంధుడు (సాదిక్), ఆయనే నిజాయితీ పరుడు (అమీన్), ఆయనే దైవం ఎన్నుకున్న ఉత్తమోత్తమ మానవుడు (ముస్తఫా).

## సాధారణ మనిషి

అయితే ఆయన సాధారణ మనిషే. ఆనాడు మక్కా నగరంలో నివసించినటువంటి అనేక మంది అరబ్బు యువకుల్లో ఆయనా ఒకరు. ఆయన శీలస్వభావాలు, వ్యవహారసరళి, నీతి నడవడి ఇంటా బయటా, మక్కావీధుల్లో, మక్కావాసుల మధ్య ప్రత్యేకమయినవి. అందరితో కలసి జీవిస్తూనే వేరుగా కనిపించిన వాడాయన! నోరు విప్పితే అబద్ధాలకే కొదువలేని పరిసరాలలో, దాన్ని తప్పుగా ఎంచని వాతావరణంలో, అటువంటి జనం చేత 'అస్సాదిక్', 'సత్యసంధుడు' (The Truthful) అనిపించుకున్న ఘనుడాయన. చీటికి మాటికి మోసగించడంలో తప్పేమిటీ అనుకునే చోట తన నిజాయితీ తత్పరత మూలంగా 'అల్ అమీన్' (The Honest) 'నిజాయితీ పరుడు' అన్న బిరుదాంకితుడయిన వాడాయన. బాల్యంలో అరబ్బు బాలురిలా గొర్రెల్ని కాచాడు. గొర్రెల కాపరి మానవుల మార్గదర్శి కావడం సులభతరమేమో! దైవప్రవక్తలందరూ... దాదాపు అందరూ... గొర్రెల కాపరులే!!

ఆ అతి సాధారణ మనిషి ప్రపంచంలోని అత్యంత సాధారణ సత్యాన్ని, ప్రపంచం అత్యధికంగా ఎక్కడయితే దారి తప్పుతుందో, ఏ సత్యాన్ని అర్థం చేసుకోవడంలో తికమక పడుతుందో, ఆ సత్యాన్ని, అతి సాధారణంగా, అతి సులువుగా బోధపరచిన ఉత్తమ బోధకుడాయన!

## సమానత

ప్రపంచంలో మానవులు స్త్రీలుగా పురుషులుగా జన్మించారు. యథార్థం ఇదే. జగమెరిగిన సత్యం ఇదే. విశ్వవ్యవస్థ అంతా ఆ స్త్రీ పురుషుల సంగమంతోనే సజావుగా సాగుతోందన్నది మానవుని అనుభవం. మానవ విజ్ఞానం, మానవ నిరంతర ప్రయోగాల ప్రయోజనం, ప్రయోగాల సారం- ఇదే! పుడమి పైన కానవస్తున్న జీవకళ మొదలుకుని మానవ సృష్టి, మానవ మనుగడ, దాని కొనసాగింపు- సర్వం- స్త్రీ పురుష అంశాల సుస్థిరతపైనే ఆధార భూతమయి ఉందని జగతిలోని ఒక్కొక్క కణం, ఒక్కొక్క అణువుతో సహా సమస్త విశ్వంలోని అణువణువూ చాటిచెప్పే యథార్థమిదే. ఈ పరమ సత్యాన్ని బాహాటంగా చాటిచెప్పడంతో బాటు ఆ మహా నీయుడు, తన నాటి మానవుడు లోనయి ఉన్న అపోహనూ మననాటి మానవుడూ ఆపాదిస్తున్న అపార్థాన్నీ దూరం చేస్తూ, ప్రకటించిన యథార్థం- స్త్రీలు, పురుషులు తమ తమ కార్యరంగాల రీత్యానే వేరు కాని ఇతరత్రా పూర్తిగా, సర్వవిధాలా సమానులన్నది! ఇదేదో సామా జిక ఒత్తిడులకు వెరసి చేసిన ప్రకటన కాదు, మానవరాశి కర్త, విశ్వ కర్త, జగతి ప్రభువు విశ్వస్వామి చేసిన వాస్తవికతా సూచన!

విశ్వాసాలు, ఆరాధనలు, ఆచరణలు, ఆచరణా ఫలితాలు, అన్నింటి రీత్యా, త్యాగాలు, సేవలు, పర్యవసానాలు, పరిణామాలు, ఏ రంగం లోనూ, ఏ క్షేత్రంలోనూ ఎక్కడా మానవులు- స్త్రీలు, పురుషులు- వారిరువురిలో ఏ ఒక్కరూ మరొకరికి తీసిపోకుండా సమానులని బహిరంగంగా, తాను అందజేసిన దైవగ్రంథం ద్వారా, దానికి తాను జెప్పిన వివరణల ద్వారా, ఆచరణాత్మకంగా తన ఆదర్శ జీవితం ద్వారా ఆయన చాటి చెప్పిన వాస్తవం ఇది. అయినా ఆయన అంద జేసిన ధర్మంలో స్త్రీలకు అధమ స్థానం ఇవ్వడం జరిగిందని పాశ్చాత్య మేధా ప్రభువులు, రాజకీయ ప్రభువులు అసత్య ప్రచారం చేశారు. ఆ ప్రచారానికి శతాబ్దుల తరబడి బానిసలయిపోయిన జాతులన్నీ అదే అసలు నిజమని, ఆ మహా పురుషుని నమ్మేవారు సయితం, కళ్ళు మూసుకుని నమ్మేశారు!! ఎంత ఘోరం?! ఒక్కసారయినా ఆయన నిజ బోధనల్ని అధ్యయనం చేయాలన్న తలంపు ఈ బానిస జాతులకు రాలేకపోయింది! ఎంత ఆశ్చర్యం?! ఆయన అందజేసిన గ్రంథాన్ని ఓ మత గ్రంథంగా పుణ్యార్జనకే తెరిచారుగానీ, జీవితంలో సన్మార్గ గమనానికి, సన్మార్గ అన్వేషణకు దాన్ని తెరచి చూసే

సౌభాగ్యం వీరికి ప్రాప్తం కాలేకపోయింది - ఆయన్ని నమ్మే వారికీ ప్రాప్తం కాలేక పోయింది- ఎంత దౌర్భాగ్యం!!

## మానవ నిజధర్మం
## 'ఆ ప్రవక్త' చేసిందేమిటి?

ఆ మాటకు వస్తే ఏ ప్రవక్త అయినా చేసేదేమిటీ? మానవునికి అతని గమ్యమేమిటో చూపారు ప్రవక్తలు. గమ్యానికి దారి ఏదో కూడా అతి స్పష్టంగా చూపారు. అంతేకాదు తాము ఆ దారిగుండా పయనించి గమ్యాన్ని చేరే మార్గం సుగమం చేసుకునే విధానాలూ తెలిపారు. ఆ మార్గం, ఆ మార్గాన్ని సుగమం చేసుకునే విధానాలే 'దీన్', 'ధర్మం', ధర్మంలోని విధి నిషేధాలు. ధర్మం లేదా దీన్ అన్న దాని వివరా లేమిటీ? సృష్టికర్త పట్ల మానవుని బాధ్యతలు, అవి సృష్టికర్త హక్కులు, అలాగే ఇతర సృష్టితాల హక్కులు అంటే వారి పట్ల మానవుని బాధ్య తలు! అంతే, అదే ధర్మానికి ఓ నిర్వచనం. మానవునికి తన సృష్టికర్త దైవం ఎడల గల బాధ్యతలు, కర్తవ్యాలు తోటి మానవుల పట్ల గల బాధ్యతలు, కర్తవ్యాలు; వాటినే దైవం హక్కులు మానవ హక్కులుగా 'ధర్మం' లేదా 'దీన్'లో పేర్కొనడం జరిగింది. అరబీలో హుకూకు ల్లాహ్, హుకూకుల్ ఇబాద్! అల్లాహ్ హక్కులు, అల్లాహ్ దాసుల హక్కులు!! ఈ రెండు మాటల్లోనే దీన్ లేదా ధర్మం నిర్వచనం!!

దైవం హక్కుల్లో విశ్వాసాలు, విశ్వాస తత్పరమయిన భావ నలు, ఆరాధనలు, ఆరాధనా భావాలు, ఆరాధనా భావతత్పర వివరాలన్నీ చేరి ఉన్నాయి. అలాగే మానవ హక్కుల్లో- తన స్వీయ హక్కులతో మొదలయి తల్లిదండ్రులు, భార్యా పిల్లలు, కుటుంబం, సమాజం, ఆర్థిక విషయాలు, రాజకీయ వ్యవహారాలు, అంతర్జాతీయ సంబం ధాలు అన్నీ వచ్చేశాయి.

## సహజ సామంజస్యత

భిన్న స్వరూపాలు గల మానవ నైజానికి, మానవ నాగరికతా సంస్కృ తులకు అర్థం తాత్పర్యం ప్రాప్తమయింది- ఎన్ని రంగులున్నా, ఎన్ని హంగులున్నా మానవుడు, మానవత ఒకటే, మానవులంతా ఒక్కటే, మానవులంతా సమానమే అన్న భావన దానంతట అదే ఉత్పన్న మయింది! అలాగే దేవుని హక్కుల్లో సృష్టికర్త ఒక్కడే, పోషకుడు, దేవుడు ఆరాధ్యుడూ ఒక్కడే అన్న భావన ఆ దైవం సమక్షంలో మానవుడు జవాబుదారుడన్న భావన, మానవ నడత ఆధారంగా దైవ మిచ్చే శిక్షా బహుమానాల భావనలు సహజంగానే రూపొం దాయి!!

ప్రవక్త పలికిన ప్రభువు హక్కుల్లో ప్రథమమయినది- విశ్వకర్త, మానవ కర్త, స్వామి, ప్రభువు, ఆరాధ్యుడు ఒక్కడే అన్న యథార్థం! జగతిని సృష్టించిన పరమోన్నత శక్తి ఒకటుందని, అది ఒక్కటే అని అంగీకరించనివాడు నేడు, మెడపైన తల, తలలో మెదడు, మెదడులో మేథ ఉన్న వాడెవడూ లేడు! ఆ శక్తిని దైవమని, ఆయన్ని ఆరాధించాలని మానవులకు తెలియని జ్ఞానాన్ని బోధించారు ప్రవక్త మహనీయులు.

ఆ ప్రభువు పుట్టించిన మానవుడు పుడమిపైన ఎక్కడ నివసించినా ఏ నైసర్గిక భాగంలో జీవించినా, ఏ రంగు చర్మం కలిగి ఉన్నా, ఏ భాష మాటలాడినా తన స్వరూప స్వభావాల రీత్యా మానవుడే గనక, జంతువో, మరే జడ పదార్థమో కాదు గనుక ఒకే రాశికి చెందినవాడు; అందువల్ల మానవులంతా ఒక్కటే, అందరూ సమానులే అన్నది మరో యథార్థం.

మరో వాస్తవికత- అనంత శక్తులున్న జగతిలో అపార జ్ఞాన నిధులిచ్చి మానవ మనుగడకు వసతులు కల్పించిన నిజస్వామి దైవం, ఓ సమయాన తాను ప్రసాదించిన శక్తి సామర్థ్యాల సంపదను, విశ్వంలోని సాధనా సంపత్తుల్ని వినియోగించి సాధించిందేమిటీ? అని ప్రశ్నించ నున్నాడన్న భవిష్యవాణిని వినిపించారు ప్రవక్త మహనీయులు.

ఈ అంశాలే ప్రవక్తశ్రీ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ అందజేసిన ధర్మం, దీన్‌లోని మౌలికాంశాలు! వీటి ఆచరణా పథకమే షరీఅత్- కుర్ఆన్ ఆదేశాలు, ప్రవక్త ఆచరణల (సున్నత్) ఆదర్శ రూపం!!

## శ్రేష్ఠ సమాజం

ఇంతకూ ప్రవక్త చేసిందేమిటి? ఓ శ్రేష్ఠ సమాజాన్ని స్థాపిం చడం, ఉత్తమ సమాజాన్ని నెలకొల్పడం! ఏమిటా శ్రేష్ఠ సమాజం, ఆ ఉత్తమ సమాజం?? దైవం హక్కులు, మానవ హక్కులు- అన్నింటినీ సక్రమంగా సాకల్యంగా నిర్వర్తించే సమాజమే శ్రేష్ఠ సమాజం. సకల సద్గుణ సంపన్నమయిన మానవుల సముదాయం. ప్రేమ, సుహృద్భావం, స్నేహం, సహానుభూతి,సురక్ష, సంరక్షణ, సుభద్రత, సుభిక్ష వెల్లివిరిసే సమాజం. అందులో పరిపాలనా వ్యవస్థ ఉంది. దాన్ని ఏమనాలి, రాజకీయ వ్యవహారాలు ఆ సామాజిక వ్యవస్థలో

లేవా? ఆర్థిక వ్యవహారాలు అనునిత్యం కానరావా? రాజకీయ ఒప్పందాలు, అంతర్జాతీయ ఒడంబడికలు చోటుచేసుకో లేదా?? దాన్నంతటినీ కేవలం మతం, మత వ్యవహారం, ధర్మ వ్యవస్థ, ధార్మిక వ్యవస్థ అని మాత్రమే అన్నా అభ్యం తరం లేదు-అదొక పరిపూర్ణ జీవన వ్యవస్థ- సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలతోపాటు అంతర్జాతీయ వ్యవహారాలను సరిదిద్దే సంపూర్ణ జీవన వ్యవస్థ- అనవలసి వస్తుంది. అలాం టప్పుడు ప్రవక్త నెలకొలిపిన దాన్ని ఇస్లామీయ రాజ్యం, ఇస్లామీయ ప్రభుత్వం అనకూడదా? ఇస్లామిక్ స్టేట్ అనడం తప్పా? అందులో సిగ్గుపడవలసిన అవసరమేముంది?

## ఇస్లామిక్ స్టేట్

ఎవరో కొందరు అనామకులు, దారి తప్పిన దోషులు, ఇస్లామ్ శత్రువుల ఏజెంట్లు ఇస్లామిక్ స్టేట్ అన్న పదబంధాన్ని తప్పుగా ప్రయోగించినంత మాత్రాన ఏ రాజ్యానికైనా ఇస్లామీయ రాజ్యమని ఇస్లామిక్ స్టేట్ అనీ పేరుపెట్టరాదని భావించడం దేనికీ? క్రిస్టియన్ స్టేట్ సాధ్యమే, బోల్షివిక్ స్టేట్ సాధ్యమే, సోషలిస్ట్ స్టేట్ సాధ్యమే, వెల్ఫేర్ స్టేట్ సాధ్యమే, డెమోక్రటిక్ స్టేట్ సాధ్యమే, జ్యూయిష్ స్టేట్ సాధ్యమే, ఎక్కడా- ఏ గ్రంథంలో, ఏ ప్రస్తావనలో- పేర్కొనబడని బుద్ధిస్ట్ స్టేట్ అయినా, హిందూ స్టేట్ అయినా సాధ్యమే-ఎంత విచిత్రం! ప్రపంచంలో రాజ్యాలేలి, శతాబ్దుల తరబడి తన ఉనికిని బహిరంగంగా చాటిన ఇస్లామీయ రాజ్యం, ఇస్లామిక్ స్టేట్, అదే సాధ్యం కాదని, దానికే చోటు లేదని ఓ నిజమయిన ఇస్లామీయ రాజ్యానికి ఇస్లామీయ రాజ్యమని పేరు పెట్ట రాదని భావించడంలో గల ఔచిత్యం ఏమిటీ?

ఇస్లామ్ ఓ సంపూర్ణ జీవన వ్యవస్థ, మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) స్థాపించిన ధర్మం పరిపూర్ణ ధర్మం. అందులో వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకమూ ఉంది. రాజ్య సంస్థాపనా మార్గమూ ఉంది. రాజ కీయ వ్యవస్థాపనా విధానమూ ఉంది. అంతర్జాతీయ రాజ కీయ సంబంధాల, ఒడంబడికల, అనుబంధాల సూత్రాలు సిద్ధాంతాలూ ఉన్నాయి. దానికి ప్రవక్త పవిత్ర జీవని, సహచరుల, అనుచరుల సువిస్తర చరిత్రలే సాక్ష్యం!! ప్రవక్త తన జీవితంలో, తన సహచరగణ్యులతో కలసి నిరంతర కృషి సలిపి నెలకొలిపిన యథార్థాన్ని కాదనగలిగినవారు నేడు ప్రవక్తను తమ ఆదర్శంగా నమ్మేవారిలోనే కానవస్తున్నారు! ఎంత విచిత్రం!?

ప్రవక్తను అనుసరించేవారే కొందరు, ఆయన దైవప్రవక్త అయి నప్పటికీ, తన ప్రాణ సహచరులతోపాటు జరిపిన ప్రాణ విదారక సంఘర్షణను గురించి తెలిసినప్పటికీ, అటువంటి కృషి ఏదీ సలపనవసరం లేదని, ఇస్లామిక్ స్టేట్ దైవదాస్యం వల్ల లభించే దేవుని బహుమాన మని, దేవుని వరప్రసాదమని అంటున్నారు!

ప్రపంచంలో ఏది ప్రాప్తమయినా దేవుని బహుమానమే, వరప్రసా దమే కాదా?! అయితే ఎటువంటి కృషి లేకుండానే ధార్మిక జ్ఞానం ప్రాప్తమవుతుందా? కృషి లేకుండానే హలాల్ జీవిక, ఉపాధి, వ్యాపారం సాధ్యమా? ఏ కృషి లేకుండానే హలాల్ ఉద్యోగం సంపా దిస్తారా? ప్రపంచంలో కృషి లేనిదే ఏదీ ప్రాప్తం కాకపోతే దేవుని ఏ వరప్రసాదమూ, ఆయన అనుగ్రహించే ఏ కటాక్షమూ కృషీ, యత్నమూ లేనిదే ప్రాప్తం కాకపోతే, హలాల్ భోజనం ఉపాధీ కృషి లేకుండా దొరక్కపోతే ఇస్లామీయ రాజ్యం- ఓ దేశ పరిపాలనా వ్యవస్థ-అంత సునా యాసంగా ఎటువంటి ప్రయత్నం లేకుండా ప్రాప్త మయ్యే వరప్రసాదమయిపోయిందా? దివ్యకుర్ఆన్‌లోనయినా, హదీసుల్లోనయినా ఎక్కడయినా కృషి లేనిదే ప్రాప్తమయ్యే ఏ వరప్రసాదం గురించి అయినా ప్రస్తావన ఉందా?

కుర్ఆన్ చాటి చెప్పే సూత్రం, ఇహంలోనయినా పరంలో నయినా-

**లైసలిల్ ఇన్సాన ఇల్లా మాసఆ**

మానవుడు దేనికొరకు కృషి చేస్తాడో అదే తప్ప అతనికి మరేమీ ప్రాప్తం కాదు! ❀

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




అర్షియా, విజయవాడ

**రబీవుల్ అవ్వల్ మాసంలో** అమినా పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆ ఇంట్లో ఒక్కసారిగా ఆనంద కుసుమాలు వెల్లివిరిశాయి. పట్టలేని సంతోషంతో ఓ పడతి లోపల్నుంచి బయటికి వచ్చింది. 'అబ్దుల్ ముత్తల్లిబ్‌కు శుభవార్త చెప్పండి. ఆయనకు మనుమడు పుట్టాడు' అని చెప్పి ఆమె మళ్లీ వెళ్లిపోయింది. తన కొడుకు కోడలు ఆమినా-అబ్దుల్లాహ్‌లకు పండంటి మగ బిడ్డ పుట్టాడన్న శుభవార్త వినగానే సంతోషంతో ఉక్కిరి బిక్కి రయ్యారు. ఇంట్లోకి వెళ్లి మనుమడ్ని వెయ్యి కళ్లతో చూసు కుని మురిసిపోయారు. ఆ అందాల బాలచంద్రుడ్ని గుండె లకు హత్తుకున్నారు. తల్లి ఒడిలో అనిర్వచనీయమైన కాంతు లతో ఆ బాలుడు మెరిసిపోతున్నాడు. ఆ అందాల చంద్రుడికి ఏ పేరు పెడతారో అని అంతా గుసగుసలాడుతున్నారు. తన మనుమడు పుట్టకముందే పేరు పెట్టేశామని చెప్పారు. 'ముహమ్మద్' అని నామకరణం చేశారు. ముహమ్మద్ అంటే ప్రశంసనీయుడు అని అర్థం. తన మనుమడి పేరు భువి పైన్నే కాదు దివిపైన కూడా వెలిగిపోవాలనే నా రతనాల మూటకు ఈ పేరు పెట్టానని చెప్పారు అబ్దుల్ ముత్తల్లిబ్.

తాత పెట్టిన పేరుకు తగ్గట్టుగానే ఆయన సార్థక నామధేయు లయ్యారు. ఆయన ప్రశంసనీయుడు అని రుజువు చేసేందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. ఎంత మహనీయుడినైనా మహా అంటే అతని జయంతి, వర్ధంతి రోజో గుర్తుచేసుకుని స్మరించుకుంటారు. కానీ మహాప్రవక్త ముహమ్మద్ (స) ఈ లోకం వీడి శతాబ్దాలు గడిచినప్పటికీ ప్రపంచం నలు మూలలా ఆయన పేరు నిత్యం స్మరించని ఘడియంటూ లేదు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది పెట్టుకునే పేరు 'ముహమ్మద్'. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిములు తమ ఐదు పూటలా నమాజులో ముహమ్మద్(స) పై శాంతి కురవాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. ఇది అద్భుతమే మరి. ఆయన ప్రవక్తల నాయకుడిగా, కారుణ్యమూర్తిగా, మానవ మహోప కారిగా ప్రళయం వరకూ ఆయన పేరు వెలుగుందుతూనే ఉంటుంది. ప్రవక్త (స) తుది శ్వాస వరకూ ఎన్నో ఆదర్శాలను ఆచరించి చూపారు. ప్రవక్త (స) అడుగడుగునా ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. చక్రవర్తిగా రాజభోగాలు

అనుభవించే అవకాశమున్నా జీవితాంతం నిరుపేదగానే బ్రతికారు. దేవుడొక్కడే, మనుషులంతా ఒక్కటే అన్న నినాదంతో 23 ఏళ్ల కాలంలో అరబ్బు సమాజాన్ని సమూలంగా మార్చివేశారు. హిరా గుహలో దైవవాణి ద్వారా ప్రవక్తా పదవి బాధ్యతను మోశారు. దైవ వాక్యాలతో అరబ్బు సామ్రాజ్యాన్ని కాంతిపుంజంతో నింపారు. కత్తితో సాధించలేనిది కరుణతో సాధించారు. ప్రపంచానికి జీవిత పాఠాలు నేర్పారు. ముహమ్మద్ ప్రవక్త (స) సందేశాన్ని అందించే ఆయన జీవితంలోని కొన్ని ఆదర్శ దృశ్యాలను అందిస్తున్నాము. ఈ ఘటనలు నేటికీ అనుసరణీయం, ఆచరణీయం.

★★★

ఒకసారి హజ్రత్ ఆయిషా సిద్దీఖా వద్దకు ఒక నిరుపేద మహిళ యాచించడానికి వచ్చింది. ఆమె వెంట ఇద్దరు పిల్లలున్నారు. ఆ సమయంలో కారుణ్యమూర్తి (స) కుటీరంలో ఒక్క ఖర్జూరపు పండు తప్ప మరేమీలేదు. అప్పుడు హజ్రత్ ఆయిషా (ర.అ) ఆ ఒక్క ఖర్జూరాన్నే ఆమెకు దానం చేశారు. ఆ మహిళ ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలుగా చేసి రెండు భాగాలను ఆ బాలికలిద్దరికీ సమంగా పంచిపెట్టింది. ఆ తల్లి మమకారం హజ్రత్ ఆయిషా(ర.అ)కు ఆశ్చర్యం కలిగించింది. ఈ ఘటనను ప్రవక్త (స) రాగానే వివరించారామె. ఇది విన్న ప్రవక్త (స) "ఆడపిల్లల పట్ల మంచిగా ప్రవర్తిస్తే వాళ్లు నరకాగ్నికి అడ్డుతెరగా నిలుస్తారు" అన్నారు.

## నైతికతకు పెద్దపీట

మహాప్రవక్త (స) కాలంలో ఇద్దరు మహిళలు విరుద్ధ భావాలు కలిగి ఉండేవారు. వారిలో ఒకామె రాత్రంతా నమాజులో లీనమై ఉండేది. పగటిపూట ఉపవాస వ్రతాలు పాటించేది. విస్తృతంగా దానధర్మాలు చేసేది. కాని ఆమె తన నోటి దురుసుతనం వల్ల ఇరుగు పొరుగు వారిని ప్రశాంతంగా బ్రతకనిచ్చేదికాదు. రెండవ మహిళ కేవలం ఫర్జ్ నమాజులు చేసేది. పేదవారికి పాలు, పదార్థాలు మాత్రం పంచేది అంతే. కాని ఎవరి మనసునూ నొప్పించేది కాదు. ఈ ఇరువురు మహిళల గురించి మహాప్రవక్త (స)ను ప్రశ్నించగా మొదటి మహిళ గురించి ప్రవక్త (స) వారు వ్యాఖ్యానిస్తూ 'ఆమెలో మంచి అనేది లేదు. పైగా ఆమె తన దుష్ప్రవర్తనకు గాను శిక్షను అనుభవిస్తుంది' అని పలికారు. రెండవ మహిళ గురించి "ఆమె స్వర్గంలో స్థానం సంపాదిస్తుంది" అని అన్నారు.

## చెడును చేత్తో ఆపాలి

చెడును తన చేత్తో ఆపటం, నిర్మూలించటం ప్రతి ముస్లిమ్ విధ్యుక్త ధర్మం. ఒక వేళ చేత్తో నిర్మూలించలేకపోతే నోటితో నిర్మూలించాలి. ఇదీ సాధ్యం కాకపోతే మనసులోనయినా దాన్ని చెడుగా భావించాలి.

★★★

జనులు మేలు చేకూర్చినట్లయితే మేము కూడా మేలు చేకూరుస్తామని, దౌర్జన్యం చేస్తే మేము కూడా అలాగే చేస్తామని మీరంటారు. ఇది సరికాదు. మిమ్మల్ని మీరు శాంత పరుచుకోండి, నెమ్మదించండి. జనులు మీకు మేలు చేస్తే మీరు వారికి మేలు చేకూర్చండి. ఒకవేళ వారు కీడు కలిగించినాసరే మీరు వారికి అన్యాయం చేయకండి.

## ఏమీ లేకపోతే దానమెలా చేయాలి?

ప్రవక్త (స) ఒకసారి "ప్రతి ముస్లిమ్‌పై సదఖా (దానం చేయటం) తప్పనిసరి" అని చెప్పారు. 'ఒకవేళ అతని వద్ద స్థోమత లేకుంటే ఏం చేసేది?' అని ప్రియసహచరులు ప్రశ్నించగా, 'అతను కూలి పని చేయాలి. తద్వారా వచ్చిన వేతనంతో తానూ తినాలి. అవసరార్థులకూ తినిపించాలి.' అదీ చేయలేకుంటే చెడు పనుల నుండి తన్ను తాను కాపాడుకోవాలి.

★★★

మీ ఎడల సత్సంబంధాలు కలిగి ఉండే ఆత్మీయులతోనే సంబంధాలు కలిగి ఉండటం కాదు. మీతో తెగత్రెంపులు చేసుకునే రక్త సంబంధీకులతో సయితం సంబంధాలు ఏర్పరచుకోండి. 'దౌర్జన్యపరుడైన నీ బంధువుపై కానుకల వర్షం కురిపించు అది నిన్ను స్వర్గానికి చేరుస్తుంది.

★★★

ఒకసారి ప్రవక్త(స) వద్దకు ఒక గర్భవతి వచ్చి, తాను చేసిన తప్పిదాన్ని ఒప్పుకుని, తనను శిక్షించమని కోరింది. ప్రసవించిన తరువాత రమ్మని చెప్పి ఆమెను వాపసు చేశారు. దైవ ప్రవక్త (స) ప్రసవానంతరం ఆమె మళ్లీ వచ్చింది. ప్రస్తుతం నీ శిశువుకు నీ అవసరం ఉంది. శిశువు పాలు విడిచిన తరువాత రావచ్చంటూ ఆమెకు సెలవు ఇచ్చారాయన (స). ఆమె కొంతకాలం తర్వాత ఆ బాధ్యతను కూడా నెరవేర్చి ప్రవక్త (స) సన్నిధికి తిరిగి వచ్చింది. అప్పటికీ ఆమెలో అపరాధం చేశానన్న భావన ఏ మాత్రం తగ్గలేదు. ఆమెను శిక్షించవలసిందిగా ఆయన (స) ఆజ్ఞాపించారు. ఈమె

పశ్చాత్తాపం ఎంత గొప్పదంటే, 'రాజరికపు (అన్యాయపు) సుంకం వసూలు చేసేవాడు ఇలాంటి పశ్చాత్తాపం చెందినా అతను క్షమించబడతాడు' అన్నారు.

## ప్రేమతో నచ్చజెప్పేవారు..

ఒకసారి ఒక శిష్యుడి వల్ల రమజాన్ మాసంలో ఉపవాస స్థితిలో ఒక తప్పు జరిగిపోయింది. తాను చేసిన తప్పేమిటో వివరించి తనను దైవప్రవక్త (స) సన్నిధికి తీసుకెళ్లమని ఆ వ్యక్తి ఆ వాడలో ఉన్న వారిని అభ్యర్థించాడు. ఇది మా వల్ల కాదని తోటివారు సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి ఒంటరిగానే ప్రవక్త (స) వద్దకు వచ్చి తన గోడు వినిపించుకున్నాడు. అంతా విన్నాక 'ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించు' అని సూచించారు. తన దగ్గర బానిస లేడని అన్నాడు. అయితే ఎడతెగకుండా ఉపవాసం పాటించు అన్నారు. దానికీ అతను ఒప్పుకోలేదు. పోనీ అరవై మంది నిరుపేదలకు అన్నమైనా పెట్టు అని ఆయన సూచించారు. నిరుపేదలకు అన్నం పెట్టేంత స్థోమత లేదన్నాడు. 'సరే బనీ జరీఖ్ నాయకుని దగ్గరకు వెళ్లి సదఖా (దానం) తీసుకో. దాంతో 60మంది అగత్యపరులకు అన్నంపెట్టి, మిగిలినది నీ ఇంటివారికి తినిపించు' అన్నారు.

## దరిద్రుడు ఎవడు?

ప్రవక్త (స) తన సహచరుల దృష్టిని తన వైపునకు మరల్చేందుకు 'మీకు తెలుసా?' అని అడిగేవారు. ఒకసారి ఆయన (స) తన సహచరులను ఉద్దేశించి, 'దరిద్రుడు ఎవరో మీకు తెలుసా?' అని అడిగారు. దానికి వారు, 'మాలో డబ్బు, వస్తు సామగ్రి లేనివారే దరిద్రులు అని మేము భావిస్తున్నాం' అని అన్నారు. అప్పుడు ప్రవక్త సమాధానమిస్తూ 'అసలు దరిద్రుడు ఎవడంటే, ప్రళయదినాన అతను నమాజ్, రోజా, జకాత్ తదితర పుణ్యకార్యాలతో హాజరవుతాడు. కాని అతను ఒకరిని తిట్టి ఉంటాడు. ఒకరిని కొట్టి ఉంటాడు. ఒకరిపై అపనిందలు మోపి ఉంటాడు. ఒకరి సొమ్మును అధర్మంగా భక్షించి ఉంటాడు. ఒకరి రక్తం చిందించి ఉంటాడు. అందువల్ల అతని సత్కార్యాలు తలో కాస్తా వారందరికీ పంచిపెట్టబడతాయి. ఈ విధంగా అతని సత్కార్యాలన్నీ అయిపోతాయి. కానీ బకాయి తీరదు. తత్కారణంగా ఇతని చేత బాధించబడిన ఆ వ్యక్తుల దుష్కర్మలు ఇతని ఖాతాలో రాయబడతాయి.''

★★★

పహిల్వాన్ ఎవరో మీకు తెలుసా? అంటూ ఆయన (స) ఒకసారి అడిగారు. 'కుస్తీలో పైచేయి సాధించేవాడే పహిల్వాన్' అని సహచరులు అన్నారు. 'కాదు, అసలు పహిల్వాన్ అతను కాదు. కోపావేశంలో తనను తాను నిగ్రహించుకున్నవాడే సిసలయిన పహిల్వాను' అని ఆయన చెప్పారు.

## ప్రాయశ్చిత్తానికి మార్గం చూపారు..

ధర్మ యుద్ధంలో పాల్గొనాలన్నది నా అభిలాష అని సహచరుల్లో ఒకరు వచ్చి ప్రవక్తను అడిగారు. 'నీ తల్లి బ్రతికే ఉందా?' అని ఆయన దర్యాప్తు చేశారు. దానికాయన బ్రతికే ఉంది అన్నారు. 'అయితే నీవు ఆమెను అంటిపెట్టుకుని ఉండు. స్వర్గం ఆమె పాదాల చెంతనే ఉంది' అని దయామూర్తి ఉపదేశించారు.

★★★

స్త్రీల ఎడల మంచిగా మెలగండి. వారు ప్రక్కటెముకచే పుట్టించబడ్డారు. వారి స్వభావంలో కొంత వక్రత ఉండటం సహజం. ఆ స్థితిలోనే వారితో సర్దుకుపోవడానికి ప్రయత్నించండి. ఒకవేళ మీరు దానిని సరిచేయదలిస్తే విరిచేస్తారు. (సరిచేయలేరు).

'మీరు మీ సతీమణిలో ఏదైనా లోపం చూసినంత మాత్రానికే ఆమెను ద్వేషించకండి. మీరు నిశితంగా చూస్తే ఆమెలో మరో విశిష్ఠత ఏదైనా కనబడవచ్చు.

★★★

## ఆయురారోగ్యాల కోసం ఏం చెప్పారో తెలుసా?

''తమ జీవనోపాధి వికాసమొందాలని, తమ ఆయుష్షులో శుభం, సమృద్ధి ఉండాలని కోరుకునేవారు బంధువుల హక్కును ఇవ్వాలి.''

★★★

ఒకసారి ప్రవక్త (స) వారి న్యాయస్థానంలో ఒక అనాథ ఒక ఖర్జూర తోట గురించి ఒక వ్యక్తిపై కేసు పెట్టాడు. కానీ అనాథ ఆ తోట తనదేనన్న దానికి తగు సాక్ష్యాధారం సమర్పించలేకపోయాడు. అందువల్ల దైవప్రవక్త (స) ఆ తోటను ప్రతిద్వందికి ఇచ్చేశారు. దానిపై ఆ అనాథ అబ్బాయి ఏడ్వటం మొదలెట్టాడు. అతని పరిస్థితిపై ఆయన (స)కు జాలివేసింది. 'నువ్వు ఆ ఖర్జూర తోటను ఈ అబ్బాయికి ఇచ్చేయ్. దీనికి బదులుగా దేవుడు నీకు స్వర్గం ప్రసాదిస్తాడ'ని ఆయన కోరారు. కానీ ఆ వ్యక్తి అందుకు అంగీకరించలేదు.

అబూ దహ్దా అనే అనుచరుడు ఆ సమయంలో అక్కడే ఉన్నారు. ఆయన ఆ వ్యక్తిని ఉద్దేశించి, 'నీవు నీ తోటను నాకిచ్చే మాటైతే నేను నాకు చెందిన ఫలానా తోటను నీకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. ఇది నీకు సమ్మతమేనా? అని అడిగారు. దానికావ్యక్తి సమ్మతించాడు. ఈ విధంగా ఆయన తన తోటను బదిలీ చేయించి ఆ అనాథకు కానుకగా ఇచ్చేశాడు.

★★★

## పాతికేళ్ల యవ్వనంలో నలభై ఏండ్ల వితంతువుతో వివాహం

మంచి యవ్వనంలో ఎవరయినా తనకు సరిజోడైన భార్యనే చూసుకుంటారు. కానీ మహాప్రవక్త ముహమ్మద్ (స) మాత్రం నలభై ఏండ్ల నడివయస్కురాలైన ఒక వితంతువును వివాహ మాడారు.

## మనుషుల్లో మార్పు తెచ్చారిలా

ఒకసారి ఒక వ్యక్తి 'దైవప్రవక్తా! నాలో నాలుగు దుర్గుణా లున్నాయి- 1. నేను వ్యభిచారం చేస్తాను 2. దొంగతనం చేస్తాను 3. సారా త్రాగుతాను 4. అబద్ధం చెబుతాను. తమరు నాకు ఆజ్ఞాపిస్తే వీటిలో ఏ ఒక్కదానినయినా పరిత్యజించ గలను.' అన్నాడు. దానికాయన (స) 'అబద్ధం చెప్పటం మానుకో' అని బోధించారు. దానికతను అంగీకరిస్తూ 'ఈ క్షణం నుండి అబద్ధం చెప్పనంటూ ప్రమాణం చేశాడు. సాయంత్రమవగానే అతని మనసు సారాయి వైపునకు లాగింది. ముందు సారాయి త్రాగి, ఆ తరువాత వ్యభిచారం చేయాలనుకున్నాడు. కాని తెల్లవారాక దైవప్రవక్త (స) అడిగితే ఏమి చెప్పను? నిజం చెబితే మద్యం సేవించినందుకు, వ్యభిచారం చేసినందుకు శిక్షపడుతుంది. అబద్ధం చెబితే ప్రమాణభంగం చేసినట్లవుతుంది అని ఆలోచించుకుంటూ గడిపాడు. రాత్రి బాగా చీకటి పడిన తరువాత దొంగతనం చేయడానికి బయలుదేరబోయాడు. కాని రేపు ఉదయం ప్రవక్త (స) నిలదీసి అడిగితే ఏమని చెప్పను? అన్న ఆలోచన వచ్చింది. రాత్రి దొంగతనం చేశానంటే చేయి నరకబడు తుంది. చేయలేదని అంటే వాగ్దానభంగానికి పాల్పడిన వాడనవుతాను. దాంతో అతను ఈ మూడు పనుల నుండి తనను కట్టిపడేసుకున్నాడు. తెల్లవారాక అతను పరుగెత్తు కుంటూ ప్రవక్త (స) సన్నిధికి వచ్చాడు. 'దైవప్రవక్తా! అబద్ధం చెప్పకూడదన్న దృఢ సంకల్పం మూలంగా నాలోని నాలుగు దుర్గుణాలు కూడా దూరమయ్యాయి అని చెప్పాడు. ఇది విని ప్రవక్త (స) ఎంతగానో సంతోషించారు.

★★★

ఒకసారి ఆయన (స) తన సహచరునితో, పరాయి స్త్రీపై యాదృచ్ఛికంగా దృష్టిపడితే- తొలిసారి చూపు అసంకల్పితంగా జరిగింది గనక అది క్షంతవ్యమే. కాని మలిసారి కూడా ఆమెపై దృష్టిని కేంద్రీకరించడం క్షంతవ్యం కాదు అన్నారు.

## పసితనం నుంచే సిగ్గూ బిడియాలు ఆయన ఆభరణాలు..

దైవప్రవక్త (స) బాల్యంలో ఉన్నప్పుడు మక్కాలో కాబా గృహ పునర్నిర్మాణం జరిగింది. ఆయన (స) ఇటుకలు మోసు కుంటూ వచ్చేవారు. నీ భుజం ఒరుసుకు పోకుండా ఉండేలా నీ లుంగీని విప్పి భుజం మీద వేసుకో అని ఆయన పినతండ్రి అబ్బాస్ (రజి) సూచించారు. ఆయన (స) అలా చేయగానే స్పృహ తప్పి పడిపోయారు. స్పృహలోకి వచ్చినప్పుడు ఆయన (స) నోట 'నా లుంగీ .. నా లుంగీ' అనే మాట వినవచ్చింది. పినతండ్రి వెంటనే ఆయనకు లుంగీ కట్టారు. 'సిగ్గు విశ్వాసంలో అంతర్భాగం'.

★★★

ప్రవక్త మహనీయుల (స) వారి సన్నిధిలో ఒక వృద్ధ మహిళ వచ్చింది. ఆయన (స) ఆమెనుద్దేశించి, 'ఎలా ఉన్నావమ్మా, నీ క్షేమ సమాచారాలేమిటి? మేము వెళ్లిపోయాక అక్కడ నీ పరిస్థితులెలా ఉన్నాయి' అంటూ ఆరా తీశారు. ఆ ముస లావిడ వెళ్లిపోయాక 'మీరు ముసలావిడ పట్ల అంత శ్రద్ధ వహించడంలోని విశేషమేమిటి?' అని ఆయన సతీమణి అడిగారు. గతంలో ఆమె తరచూ మన ఇంటికి వస్తూ ఉండేది. మనల్ని కలిసేవారితో ఆశించిన మేరకు పలకరించటం కూడా ధార్మిక విశ్వాసంలో భాగమేనన్నారు.

## బానిసల పట్ల కనికరం

అబూ మస్ఊద్ (రజి) అనే ప్రవక్త సహచరులు ఇలా అంటున్నారు: నేనొకసారి నా బానిసను కొడుతుండగా వెనుక నుండి 'తెలుసుకో, తెలుసుకో' అనే శబ్దం వినవచ్చింది. వెనక్కి తిరిగి చూస్తే దైవప్రవక్త (స) నిలబడి ఉన్నారు. 'అబూ మస్ ఊద్, నీకు ఈ బానిసపై ఎంత అధికారముందో అంతకన్నా ఎక్కువ అధికారమే దైవానికి నీపైన ఉంది' అన్నారు.

ఒక వ్యక్తి దైవప్రవక్త (స)తో, 'ఓ దైవప్రవక్తా, నేను నా సేవకుణ్ణి ఎన్నిసార్లు మన్నించను?' అని అడిగితే ఆయన (స) కాస్సేపు మౌనం వహించారు. ఆ వ్యక్తి మళ్లీ అదే ప్రశ్న వేయగా, 'ప్రతి రోజూ డెబ్బయిసార్లు' అని ఆయన సమాధానమిచ్చారు. సేవకులను వీలయినన్నిసార్లు మన్నించాలన్నదే ఈ ఉపదేశ ఉద్దేశం.

### స్వర్గం ఎవరి కోసం..

ఒకసారి ప్రవక్త మహనీయులు (స) స్వర్గం గురించి ప్రస్తావిస్తూ దాని వైశాల్యాన్ని అందలి భోగభాగ్యాలను వివరించి చెప్పారు. ఆ సమావేశంలో ఉన్న ఒక పల్లెటూరి సహచరుడు ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరై, 'దైవప్రవక్తా, ఇంతకీ ఈ స్వర్గం ఎవరికి లభిస్తుంది' అని ప్రశ్నించగా, 'మృదుభాషికి, ఆకలిగొన్నవానికి అన్నంపెట్టేవానికి, ఎక్కువగా ఉపవాసాలు పాటించేవానికి, లోకమంతా నిద్రిస్తున్న సమయంలో నమాజులు చేసే వానికి' అని సమాధానమిచ్చారు.

ఒక మంచిమాట కూడా దానంతో సరిసమానమని ఒకానొక సందర్భంలో చెప్పారు.

★★★

ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చాడు. అతను బాగా ఆకలితో ఉన్నాడు. ప్రవక్త కుటీరంలో ఆ సమయంలో మంచినీళ్లు తప్ప మరేమీ లేవు. అందువల్ల ఆయన (స) తన సహచరులనుద్దేశించి, ఈ రోజు రాత్రి ఈ వ్యక్తికి ఆతిథ్యమిచ్చే వారిపై అల్లాహ్ దయజూపుతాడని అన్నారు. ఈ ఆతిథ్య భాగ్యాన్ని ఒక అన్సార్ సహాబీ దక్కించుకున్నారు. ఆ వ్యక్తిని తన ఇంటికి పిలుచుకు వెళ్లారు. ఇంట్లో తినడానికి ఏమన్నా ఉందా? అని సతీమణిని అడిగితే, పిల్లలకు సరిపడా అన్నం మాత్రమే ఉందని చెప్పింది ఆ ఇల్లాలు. పిల్లల్ని ఎలాగో బుజ్జగించి నిద్రపుచ్చు. ఇంట్లోని దీపం ఆర్పివేయి. మనమిద్దరం కూడా ఈ రాత్రికి పస్తులుందాం. అయితే భోజనం చేస్తున్నట్లుగా అభినయం చేద్దాం. మనం పస్తులున్న విషయం అతిథికి తెలియకూడదు అని తన ఇల్లాలికి నచ్చచెప్పారు. ఆమె కూడా భర్త చెప్పినట్లే చేసింది. ఈ విషయం ప్రవక్త (స)కు దైవవాణి ద్వారా తెలిసి ఆ సహచరుడిని ఎంతగానో మెచ్చుకున్నారు.

### తమ పనులు తామే చేసుకునేవారు

ప్రవక్త (స) సతీమణి ప్రవక్త (స) ఇంట్లో ఎలా ఉండేవారో చెప్పిన విషయాలు ఆలోచించదగ్గవి. ఆమె ఏమన్నారంటే... ఆయన కూడా ఇతరుల మాదిరిగా ఒక మామూలు మనిషి. ఆయన తన దుస్తుల విషయం తానే చూసుకునేవారు. గొర్రెల పాలు పితికేవారు. చినిగిన దుస్తులు కుట్టుకునేవారు. పాదరక్షలు, తోలు సంచులు బాగు చేసుకునేవారు. సరుకులు మోసుకువచ్చేవారు. పశువులకు మేత వేసేవారు. నౌకరుకు తోడుగా పనిచేసేవారు. ఇంట్లో చాలా మృదువుగా ఉండే

## ప్రియప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉండేవారు

దైవప్రవక్త(స) ఎలా ఉండేవారని హజ్రత్ అలీ(రజి)ని అడిగినప్పుడు హజ్రత్ అలీ(రజి) ఇలా జవాబిచ్చారు.
ప్రియప్రవక్త(స)...

- ★ ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరించేవారు. ★ మృదు స్వభావులు, కాఠిన్యం ఆయనలో మచ్చుకు కూడా కనపడదు.
- ★ సరళత్వం, సానుకూలతలకు ప్రాధాన్యతనిచ్చేవారు. ★నోటి నుండి వ్యర్థమయిన మాటలు ఎన్నడూ వెలువడేవి కావు.
- ★ ఏనాడూ ఎదుటి మనిషిలోని లోపాన్ని ఎత్తి చూపేవారు కారు.
- ★ గర్వానికి కోసుల దూరంలో ఉండే నిగర్వి. ★ అనవసర విషయాలు మాట్లాడేవారు కారు.
- ★ ఎవరి పట్లా వ్యక్తిగత ద్వేషం పాటించలేదు. ఎవరినీ తక్కువగా చేసి చూడలేదు.
- ★ వ్యక్తిగత రహస్యాలను, దోషాలను బహిర్గతపర్చేవారు కారు. ఎదుటి మనిషి సిగ్గుపడే ప్రతి చర్య నుండి పత్యం పాటించేవారు.
- ★ ధన సంపదల వ్యామోహం ఎరుగని నిరాడంబరులు.

ఇంకా... తనకు నచ్చని వస్తువును తీసుకునేవారు కారు. అంతేగాని అందులోని లోపాలను ఏనాడూ ఎంచలేదు.
ఎంతటి ప్రియమైన వారో కదా! మన ప్రియప్రవక్త(స).

వారు. ఎప్పుడూ చిరునవ్వుతో, ఆత్మీయంగా ఉండేవారు. ఇంట్లో ముఖ్యంగా మూడు వ్యాపకాల్లో లీనమయ్యేవారు. కొంత సమయం దైవ ప్రార్థనల్లో , కొంత సమయం తన కుటుంబ సభ్యులతో, మరికొంత సమయం విశ్రాంతి తీసుకునేవారు. స్నేహితులు, అతిథుల కోసం సమయం కేటాయించేవారు. ప్రవక్త (స) తన జీవితాంతం అర్థరాత్రి తర్వాత లేచి, వుజూ చేసుకుని నమాజు చేసేవారు. ప్రశాంతంగా దివ్యఖుర్ఆన్ పఠించేవారు. ఒక్కోసారి నమాజులో నిల్చోడం మూలాన ఆయన కాళ్లు వాచిపోయేవి.

★★★

ప్రయాణంలో ఉన్న ఒక బాటసారి చెట్టు నీడన కాసేపు విశ్రాంతి తీసుకొని తిరిగి తన ప్రయాణాన్ని ఏ విధంగా కొనసాగిస్తాడో ఆవిధంగా మనిషి తన ఇహలోక జీవితాన్ని గడపాలని, ఇంటిలో వస్తుసామగ్రి ఆ విధంగా ఉండాలని ఆయన భావించేవారు.

★★★

ప్రవక్త (స)కు కొంత సొమ్ము అప్పు ఇచ్చిన ఒక వ్యక్తి వచ్చి పరుష పదజాలంతో ప్రవక్త (స)తో మాట్లాడి అప్పు వెంటనే చెల్లించాలన్నాడు. ప్రవక్త (స) అనుచరులు ఇది చూసి జోక్యం చేసుకోబోయారు. ఆ వ్యక్తి తన అప్పు తిరిగి చెల్లించాలని అడుగుతున్నాడు తప్ప మరేమీ అడగడం లేదన్నాడు. ప్రవక్త (స) కూడా తన అనుచరులతో ఆ వ్యక్తి చెబుతున్నది సబబేనని, వాళ్లు కూడా ఆ వ్యక్తికి మద్దతుగా మాట్లాడటమే న్యాయమని చెప్పారు. అలాగే తన అప్పు తీర్చేశారు.

## మితాహారం.. అమితమైన ఆరోగ్యం

ముహమ్మద్ ప్రవక్త (స) కాలంలో మదీనా పట్టణంలో వైద్యులు పనీపాటా లేకుండా ఉండేవారు. తమ వద్దకు రోగులు రాక గోళ్లుగిల్లుకుంటూ కూర్చునేవారు. ఒకానొక సందర్భంలో వైద్యులంతా కలిసి ముహమ్మద్ ప్రవక్త (స) వద్దకు వచ్చి "తమ వద్దకు ఒక్క రోగి కూడా రావడం లేదని మొరపెట్టుకున్నారు. దానికాయన "ఇక్కడి ప్రజలు బాగా ఆకలేస్తే తప్ప అన్నం ముట్టుకోరు. కడుపు నిండకముందే తినటం ఆపేస్తారు." అని అన్నారు. వారు అనారోగ్యానికి గురికాకపోవటానికి, ఆరోగ్యవంతులుగా ఉండటానికి కారణం వారి మితాహారం అలవాటేనని ప్రవక్త (స) చెప్పారు. ముహమ్మద్ ప్రవక్త (స) తమ సహచర శిష్యులకు ఆహారం తినే పద్ధతులను వివరించారు. ఒకసారి ప్రవక్త అనుచరులు వచ్చి, ప్రవక్తా! మేం అన్నం తింటాం కాని ఆకలి తీరిన అనుభూతి కలగడం లేదు' అన్నారు. దానికాయన "మీరు మీ ఇంటి వారితో కలిసి భుజించండి. అల్లాహ్ పేరు పలికి తినండి' అన్నారు. అందరూ కలిసి తినడం వల్ల ఇద్దరి అన్నం ముగ్గురికి, ముగ్గురి అన్నం నలుగురికి సరిపోతుంది. కలిసి తినడం వల్ల అందరూ తృప్తిగా తినగలుగుతారు. ముహమ్మద్ ప్రవక్త (స) తినేటప్పుడు తన చేతి మూడు వేళ్లతోనే ఆహారం తినేవారు. చేతిని పూర్తిగా ఆహారంలో ముంచేవారు కాదు. దైవ ప్రవక్త (స) ఎప్పుడూ ఒంటరిగా తినేవారు కాదు. 'సాటి సోదరునికి తినిపించే వారిపై దేవుని తరపున శుభవార్త అందజేయబడుతుంది' అన్నారు.


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

కథ

# మంచి మనసులు

ఖుర్షీద్ బేగం, మార్కాపురం

**ఫాతిమా, ఏమోయ్ ఫాతిమా,** మన కింది ఫ్లాట్‌లో ఎవరో కొత్తగా అద్దెకు వచ్చినట్టున్నారు. ఇప్పుడే సామాన్లు దించుతున్నారు. ఇద్దరే కనిపించారు. భార్యాభర్త అనుకుంటా. పిల్లలు ఎవరూ లేనట్టుంది. భార్యతో చెప్పారు ఖాదర్ గారు. అవునా? ఏమోనండి తెలియదు.. జవాబు ఇచ్చింది ఫాతిమా. సరేకానీ పాపం ఆవిడ ఒక్కరే సామానంతా సర్దుకోవాలంటే కష్టం కదా! మన పనమ్మాయి లక్ష్మిని తీసుకుని నువ్వు వెళ్ళి ఏదైనా సహాయం కావాలేమో? అన్నట్టు ఈ రోజే అద్దెకు దిగారు కదా వంట ఏం చేసుకుంటారు? టిఫిన్లు, భోజనాలు, టీ, కాఫీలు నువ్వే తీసుకెళ్లు. వాళ్ళకూ కొంచెం పని తగ్గుతుంది. సరేనండి... పొరుగున ఉండి ఆ మాత్రం చేయలేమా? లక్ష్మీ ఒకసారి ఇలా రా కేకవేసింది ఫాతిమా.



లక్ష్మీతో ఫ్లాస్క్‌లో వేడివేడి కాఫీ, కమ్మని నేతి ఇడ్లీ, పల్లీ చట్నీ రెండు వాటర్ బాటిళ్ళు ఇచ్చి క్రింది ఫ్లాట్‌లో కొత్తగా దిగిన దంపతులకు పంపించింది ఫాతిమా.

పది నిమిషాల తర్వాత బిక్కమొహం వేసుకుని తిరిగి వచ్చింది లక్ష్మీ. ఆమె వాలకం చూసి ఏమయ్యింది? అలా తెల్లమొహం పెట్టుకున్నావు అని అడిగింది ఫాతిమా.

అమ్మగారు ఇదిగోండి మీరు ఇచ్చిన టిఫిన్లు, కాఫీలు... అని బుట్ట టేబుల్ మీద పెట్టింది. అదేంటి కొత్తగా వచ్చిన కింది ఫ్లాట్ వాళ్ళకు ఇవ్వమన్నాను కదా... ఇవ్వలేదా? అయోమయంగా అడిగింది ఫాతిమా.

మీరు చెప్పినట్టే ఇవన్నీ పట్టుకెళ్ళి వాళ్ళ ఇంటికి వెళ్ళాను. వాళ్ళు మడి, శుభ్రత ఉన్నవాళ్ళంట. మీరు ఇచ్చినవి తీసుకోరంట. ఎవరివీ తినరంట. ఆ ఇంటి అమ్మగారు చెప్పారు. నా ప్రాణం చివుక్కుమంది. అయినా పరోపకారానికి విలువ లేదు. మంచితనానికి మర్యాద లేదు లెండి. అయినా ఆవిడ్ని కాదు మిమ్మల్ని అనాలి. ముక్కు మొహం తెలియని వాళ్ళతో మనకేంటి చెప్పండి? ఏదో మన అపార్ట్‌మెంట్‌లో దిగగానే ఎవరో, ఏమిటో తెలుసుకోకుండానే అందరికీ సహాయం చేసేయడమేనా? మీ మంచి మనసును అర్థం చేసుకునే మంచి బుద్ధి అందరికీ ఉండొద్దు. ఇది కలికాలం. జున్ను తిన్నా పన్ను రాలుతుంది. అలాంటిది మీరేమో పొరుగునున్న అందరికీ సహాయం చేయాలి అంటారు. అక్కసు వెళ్ళగక్కింది లక్ష్మీ ఫాతిమా మీద.

సరేలే నువ్వు నీ వెటకారం. పొరుగున ఉన్నప్పుడు ఆ మాత్రం

సహాయం చేయకపోతే ఎలా? వాళ్ళకు కొత్త కదా రానురాను మన గురించి తెలుసుకుంటారు.

తనదైన ధోరణిలో నచ్చజెప్పింది ఫాతిమా లక్ష్మీని. వీళ్ళిద్దరి ముచ్చట్లు హాల్‌లో ఉన్న ఖాదర్ గారి చెవిన పడ్డాయి.

మర్నాడు అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న పార్కులో వాకింగ్ చేస్తున్నారు. కొంచెం దూరంలో బెంచీ మీద కూర్చుని ధ్యానంలో నిమగ్నమయ్యారు కొత్తగా వచ్చిన క్రింది ఫ్లాట్ సార్ గారు.

మాట కలిపి వివరాలు తెలుసుకోవాలని ఆయన దగ్గరకు వెళ్ళారు ఖాదర్ గారు. గుడ్ మార్నింగ్ సార్. నా పేరు ఖాదర్ బాషా. మీరు ఉండే అపార్ట్‌మెంట్‌లోనే సెకండ్ ఫ్లోర్‌లో ఉంటాను. నైస్ టు మీట్ యూ అని ఆప్యాయంగా పలకరించారు. సార్ గారు ధ్యానంలో మౌనంగా ఉన్నారు. సమాధానం లేదు. బెంచీకి రెండో చివర కూర్చున్నారు ఖాదర్ భాషా గారు. పది నిమిషాల తర్వాత కళ్ళు తెరిచారు సార్ గారు. చెప్పండి అన్నట్టు చూశారు ఖాదర్ బాషా గారిని. పరిచయం మళ్ళీ చేసుకున్నారు. సమాధానం అటునుంచి అయిష్టంగానే వచ్చింది. నా పేరు రాఘవశర్మ. ఇక్కడ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో తెలుగు లెక్చరర్‌ను. ట్రాన్స్‌ఫర్ మీద విజయవాడకు వచ్చాను. మా సొంతూరు నిడమనూరు. చాలా సంతోషం సార్. మీరు మా పొరుగునే దిగడం ఎంతో సంతోషంగా ఉంది. నేను ఇక్కడే గవర్నమెంట్ హైస్కూల్‌లో హిందీ టీచర్‌గా చేస్తున్నాను. నాకు ఇద్దరు ఆడ పిల్లలు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. తన కుటుంబ వివరాలు చెప్పుకు పోతున్న ఖాదర్ గారిని ఆశ్చర్యంగా చూశారు శర్మగారు. ఇవన్నీ నాకెందుకు చెబుతున్నట్టు? అన్నట్టుగా.

మరి మీ పిల్లలు సార్? అని అడిగారు శర్మ గారిని. నాకు ఇద్దరు మగపిల్లలు. ఇద్దరూ అమెరికాలో సెటిల్ అయ్యారు అని గొప్పగా చెప్పారు. హ్యాపీ ఫ్యామిలీ. ఒకే బిల్డింగ్‌లో ఉంటున్నాం కదా.. కలుద్దాం సార్ అని చెప్పి వెళ్ళిపోయారు.

★ ★ ★

అపార్ట్‌మెంట్‌లో ఉన్న లేడీస్ అందరూ చిన్న గెట్ టుగెదర్ పార్టీ పెట్టుకున్నారు. అందరినీ ఆహ్వానించే పనిని ఫాతిమా బేగం గారికి అప్పజెప్పారు. అందరినీ పార్టీకి పిలిచారు. శర్మ గారి ఇంటికి కూడా వెళ్ళి పిలిచారు. సారీ అండీ, నాకు ఇలాంటి పార్టీలు అవీ పెద్దగా నచ్చవు. సున్నితంగా రానని చెప్పారు శర్మగారి భార్య అనుసూయ గారు.

ఆహ్వానాన్ని తిరస్కరించినా ఫాతిమా చిన్నబుచ్చుకోలేదు. మళ్ళీ కలుద్దాం వదినగారు అని వెళ్ళిపోయింది.

★ ★ ★

బంగాళాఖాతంలో వాయుగుండం రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు అని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు నదులలో పైనుంచి వరద ఉధృతి ఉండటం వల్ల విజయవాడకు వరద ముప్పు అధికంగా ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

న్యూస్‌లో చెప్పినట్టుగానే వర్షం మొదలైంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టు ఉంది. బయట కాలు పెట్టడానికి వీల్లేని విధంగా ఉంది. ఎవరి ఇళ్ళల్లో వారు ఉండిపోయారు.

ఖాదర్ గారికి ముందు జాగ్రత్త ఎక్కువ. వర్షం అని అన్నారు కదా అని సరుకులు, కూరగాయలు, పాలు, కావాల్సిన సామాన్లు అన్నీ ముందే ఇంట్లో తెచ్చి పెట్టుకున్నారు. వర్షం రోజురోజుకు ఎక్కువ అవుతూనే ఉంది. స్కూళ్ళకు, కాలేజీలకు సెలవులు ప్రకటించింది ప్రభుత్వం. విజయవాడలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏ క్షణం లోనైనా వాగు పొంగి లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉందని వార్తల్లో ఒక్కటే హెచ్చరికలు. కాబట్టి ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు అధికారులు. ఖాదర్‌బాషా గారి ఇద్దరమ్మాయిలు, అల్లుళ్ళు విజయవాడలోనే ఉంటున్నారు. అమ్మానాన్నలను తమ దగ్గరికి రావాలని ఎంతో బ్రతిమాలాడారు. కానీ ఖాదర్‌బాషా గారు ఏం భయం లేదు. అన్నింటికీ అల్లాహ్‌యే ఉన్నాడు అని నిబ్బ రంగా ఉన్నారు. శర్మ గారి ఇద్దరు పిల్లలు కూడా అమెరికా నుంచి కాల్స్ చేసి తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెబుతూనే ఉన్నారు. వర్షం తగ్గేలా లేదు. అనుకున్నట్లుగానే భారీ వర్షాలకు వాగులు పొంగి వరద నీరు అజిత్‌సింగ్ నగర్‌ను ముంచేసింది. కరెంటు లేదు. ఖాదర్‌బాషా, శర్మ గారు ఉన్న అపార్ట్ మెంట్ సెల్లార్‌లోకి వరద నీరు క్రమంగా పెరగసాగింది. సెల్లార్ అంతా వరద నీటిలో మునిగి పోయింది. వరద నీరు క్రమంగా ఫస్ట్ ఫ్లోర్‌లో

ప్రవేశించసాగింది. పరిస్థితిని ముందే గమనించిన ఫస్ట్ ఫ్లోర్ ఉండే ఫ్యామిలీస్ సురక్షిత ప్రాంతాలకు, వాళ్ళ బంధువుల ఇళ్ళకు ముందుగానే వెళ్ళిపోయారు. దాదాపుగా ఫస్ట్ ఫ్లోర్ అంతా సేఫ్ జోన్‌లో ఉన్నారు, ఒక్క శర్మ గారు తప్ప. పిల్లలు ఎక్కడో దూరంగా ఉన్నారు.

విజయవాడలో బంధువులు, తెలిసినవాళ్ళు ఎవరూ లేరు. ఒకవేళ ఉన్నా శర్మ గారిని ఇలాంటి కష్టసమయంలో ఆదుకునేంత గొప్ప మనసు, విశాల దృక్పథం ఉన్నవాళ్ళు ఎవరూ లేరు. శర్మ గారి, అనసూయ గారి అంటీ ముట్టని వ్యవహార ధోరణి ఇందుకు కారణం. శర్మ గారికి, అనసూయ గారికి ఇది ఊహించని ఉపద్రవం. ఇలాంటి పరిస్థితి వాళ్ళు కలలో కూడా అనుకోలేదు. ఎవరితో అవసరం లేదు, రాదు అని ఎప్పుడూ ఎంతో ధీమా. అన్నీ బాగున్నప్పుడు ఎవ్వరినీ లెక్క చేయలేదు. ఇప్పుడు కష్టం గడపదాటి ఇంట్లోకి వస్తుంటే ఎవరిని సహాయం కోసం అడగాలి? ఆత్మాభిమానం అడ్డు వస్తుంది? అలా అని ఇంట్లో కూర్చుంటే మరికొన్ని క్షణాల్లో ప్రాణాలు నీళ్ళల్లో కొట్టుకుపోతాయి. ఇద్దరిలో ఒకటే కంగారు. ఏమైనా అయితే అమెరికాలో ఉన్న పిల్లలకు చివరి చూపు కూడా దక్కదు. కరెంటు లేదు. సెల్‌ఫోన్‌లలో చార్జింగ్ లేదు. ఎవరితో కూడా మాట్లాడే పరిస్థితి లేదు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అని భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారు శర్మ దంపతులు. కరెక్ట్‌గా అప్పుడే ఖాదర్ బాషా గారు వచ్చారు శర్మ గారి ఇంటికి. ఏ బంధంలేని బంధువు, ఏ స్నేహం లేని ఆప్తుడు వచ్చినట్టు అనిపించింది శర్మ గారికి. ఇద్దరినీ తమ ఇంటికి రమ్మని ప్రేమపూర్వకంగా పిలిచారు. వరద నీరు ఎక్కువవుతూ ఉంది. సెల్లార్ అంతా ఇప్పటికే మునిగిపోయింది. మరికొద్ది క్షణాల్లో ఫస్ట్ ఫ్లోర్‌లో నీరు వచ్చేస్తుంది. మీరు ఇక్కడ ఉండటం చాలా ప్రమాదం. వెంటనే మీరు అక్కయ్య గారు మా ఇంటికి రండి. వరద నీరు తగ్గిన తర్వాత మళ్ళీ రావచ్చు అని చెప్పారు ఖాదర్‌బాషా గారు. శర్మ, అనసూయ గార్లు ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు ఆలోచించే సమయం లేదు. ఇంట్లో డబ్బులు, ఇంకా ఏమైనా ముఖ్యమైన వస్తువులు ఉంటే తీసుకుని వెంటనే మా ఇంటికి వచ్చేయండి బ్రతిమాలాడారు ఖాదర్ బాషా. ఇంకా ఇక్కడ ఉండటం తమకే ప్రమాదం అని అనుకుని శర్మ, అనసూయ గార్లు బ్యాగులో బట్టలు సర్దుకుని కావాల్సిన ముఖ్యమైన వస్తువులు తీసుకుని ఖాదర్ గారి ఇంటికి బయలుదేరారు. ఇంటికి వచ్చిన అతిథుల్ని ఎంతో ప్రేమగా ఆహ్వానించింది ఫాతిమా బేగం. అన్నయ్య, వదిన గారు అని అన్ని సదుపాయాలు సమకూర్చింది. వాళ్ళకు ఇంట్లో ఒక బెడ్‌రూమ్‌ని ఇచ్చారు. సమయానికి టిఫిన్లు, కాఫీలు, భోజనాలు అన్నీ ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతూ వారికి భయం, బాధ లేకుండా మేము ఉన్నాం అనే భరోసాను ఇచ్చారు. ఈ కష్టకాలంలో ఖాదర్ బాషా దంపతులు చూపిన ప్రేమ, సహకారం, సహాయం, ఆప్యాయత శర్మ దంపతులకు ఎంతో నచ్చింది. ఈ రోజుల్లో కూడా ఇలాంటి వారు ఉన్నారా? అని శర్మ దంపతులు మనసులో అనుకున్నారు. క్రమంగా వరద తగ్గింది. పరిస్థితులు క్రమంగా చక్కబడుతున్నాయి. నీరు పూర్తిగా తగ్గింది. కరెంటు వచ్చింది. శర్మ గారు అప్పటికి ఖాదర్ గారి ఇంట్లో ఉండి వారం అయింది. ఆకాశానికి మబ్బులు తొలగి లేలేత భానుడి కిరణాలు విజయవాడను తాకుతున్నాయి. అలాగే శర్మ దంపతుల మనసులో ఉన్న అపార్థ, అజ్ఞాన, అహంకార మేఘాలు తొలగిపోయి వారి మనసులో, ఆలోచనల్లో పొరుగువారి మీద సానుకూల దృక్పథం ఏర్పడింది. మంచితనానికి, మతంతో సంబంధం లేదని, ఇరుగు పొరుగు కలసి ఉంటేనే క్షేమమని తెలుసుకున్నారు. పరిస్థితులు చక్కబడ్డాక శర్మ దంపతులు తమ ఇంటికి బయలుదేరుతూ పశ్చాత్తాపంతో ఖాదర్ గారిని, ఫాతిమా గారిని ఇన్ని రోజులు తమ వైఖరికి, ప్రవర్తనకి క్షమించ మని, మీలాంటి మంచి మనుషుల మంచితనాన్ని తెలుసుకో లేని తమ అహంకారాన్ని మన్నించమని అడిగారు. ఖాదర్ భాషాగారు ఎంతో వినయంగా, ప్రేమగా, అదే చెదరని చిరు నవ్వుతో 'శర్మ గారు మనం ఇరుగు పొరుగున ఉండే వాళ్ళం. ఒకరి కష్టసుఖాల్లో మరొకరు సహాయం చేసుకోకపోతే ఎలా? మానవ సేవే అల్లాహ్ సేవ అని చెప్పిన ప్రవక్త ముహమ్మద్ బోధనను నమ్మి ఆచరించే ముస్లింని నేను. 'నీ పొరుగువారు పస్తులుంటే నీవు మాత్రం కడుపు నిండా భుజిస్తే నీవు నిజమైన విశ్వాసివి కాదు' అని హెచ్చరించారు మహాప్రవక్త. విశ్వకారుణ్యమూర్తి అయిన ముహమ్మద్(స) వారి అనుచరుణ్ణి. ఆయన బోధనలు విని, వాటిని తమ జీవితాలలో ఆచరించేవాడే నిజమైన ముస్లిం. నేనేమి ఉపకారం చేయలేదు శర్మ గారు. సాటి మనిషిగా, మీ పొరుగువాడిగా నా బాధ్యతను నిర్వర్తించాను అంతే. ఇందులో నా గొప్పతనం ఏమీలేదు. తన విశాల హృదయాన్ని, విశ్వాసి అయిన ముస్లిం బాధ్యతని, లక్షణాన్ని చెప్పకుండా ఆచరించి చూపారు ఖాదర్ బాషా, ఫాతిమా దంపతులు. మీరు ఏమీ అనుకోకపోతే అలాంటి మహనీయుడి గురించి ఇంకా తెలుసుకోవాలని ఉంది నాకు చెప్పగలరా? అని అడిగారు శర్మ గారు.

# ప్రవక్త (స) వారి హాస్యం

ముహమ్మద్ గౌస్‌ఖాన్

**ప్రియ ప్రవక్త ముహమ్మద్(స) ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరించేవారు. ఒకసారి ఆయన (స) ఇలా అన్నారు : "నీవు నీ సోదరుణ్ణి చిరునవ్వుతో పలకరించడం కూడా ఒక మంచి పనే".**

ఎక్కువ పనులు చేసేవారు, బరువైన భారాలు మోసేవారు చిరునవ్వును ఆస్వాదిస్తే, పనుల భారాన్ని ఇట్టే తగ్గించుకోవచ్చు. అంతేకాదు, చిరునవ్వు తోటి వ్యక్తుల హృదయాలను జయిస్తుంది.

ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) చిరునవ్వుతో పరిహాసాలు కూడా చేసేవారు. ప్రవక్త (స) సమావేశాల్లో ఆనంద సంతోషాలు వెల్లివిరిసేవి. అయితే, ప్రతి విషయంలోనూ ప్రవక్త (స) సమతౌల్యం పాటించేవారు.

ప్రవక్త గారి పరిహాసం చాలా హృద్యంగా, ఎవరి మనసునూ నొప్పించని విధంగా, హృదయ ఫలకంపై "హాయి వర్షంలా" ఉండేది. అందులో వాస్తవానికి విరుద్ధమైన విషయాలేవీ ఉండేవి కావు. పగలబడి నవ్వడం జరిగేది కాదు.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఒకసారి ఆశ్చర్యంగా ప్రవక్త (స) ను "మీరు మాతో పరిహాసం కూడా ఆడతారా?" అని అడిగారు. దానికి ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "అవును. కానీ నేను అసత్యమైన విషయాలేవీ మాట్లాడను" అన్నారు.

ఒకసారి ప్రవక్త (స) వారి సన్నిధికి ఒక ముసలావిడ వచ్చి తనకు స్వర్గప్రాప్తి కలిగేలా దుఆ చేయమని ప్రవక్త (స)తో విన్నవించుకుంది. ప్రవక్త (స) "ముసలివారు స్వర్గ ప్రవేశం చేయలేరు" అని సమాధానమిచ్చారు.

ఇలా పలికిన ప్రవక్త (స) వారు నమాజుకై వెళ్ళిపోయారు. ఆ ముసలావిడ ప్రవక్త (స) వారి మాటలు విని ఏకధాటిగా ఏడ్వడం ప్రారంభించింది. ప్రవక్త (స) నమాజు ముగించుకొని వచ్చాక, మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) ప్రవక్త(స) వారికి ఆ ముసలావిడ శోకం గురించి తెలుపగా, ముసలి వారు యవ్వనం పొంది స్వర్గ ప్రవేశం చేస్తారు. ఈ విషయం ఆ ముసలావిడకు చెప్పు అన్నారు చిరునవ్వుతో. విషయం తెలుసుకున్న ఆ ముసలావిడకు ఎనలేని సంతోషం కలిగింది.

ఒకసారి ఒక సమావేశంలో అందరూ ఖర్జూరాలు తింటున్నారు. ప్రవక్త (స) పరిహాసం కొరకు ఖర్జూరపు గింజలు హజ్రత్ అలీ (రజి) వారి గింజలలో వేస్తూ పోయారు. చివరలో ఆ గింజల వైపు సైగ చేసి ఇలా అన్నారు : "మీరు చాలా ఖర్జూరాలు తిన్నారు" అని. దానికి హజ్రత్ అలీ (రజి) జవాబిస్తూ నేను గింజలతో పాటు తినలేదు" అన్నారు.

ఒక వ్యక్తి ప్రవక్త (స) దగ్గరికి వచ్చి ప్రయాణానికై నాకు వాహనం కావాలని విన్నవించుకున్నాడు. దానికి ప్రవక్త (స) "నీకు వాహనంగా ఒంటె పిల్లనిస్తాను" అన్నారు. ఆ వ్యక్తి - "ఒంటె పిల్ల తీసుకొని ఏమి చేసుకోను. నా ప్రయాణం ఎప్పటికి పూర్తి కాను" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు. అదే విషయాన్ని ప్రవక్త (స)తో విన్నవించుకున్నాడు. అప్పుడు ప్రతి జవాబుగా ప్రవక్త (స) "ప్రతి ఒంటె కూడా ఒక ఒంటె పిల్లేగా" అని చమత్కరించారు.

ఫజర్ నమాజ్ తరువాత జరిగే సమావేశాలలో, అజ్ఞాన కాలం నాటి విషయాలు కూడా చర్చలకు వస్తూ ఉండేవి. అనుచరులతో పాటు ప్రవక్త ముహమ్మద్ (స) కూడా కొన్ని విషయాల పట్ల నవ్వేవారు. ప్రవక్త (స) వారు పిల్లలతో కూడా పరిహసించేవారు. ❀



# సందేశంతో సంస్కరణ

షహనాజ్ ఏజాజ్

**ప్రవక్తల** సందేశం కేవలం తౌహీద్, రిసాలత్, ఆఖిరత్‌లనే మూడు విషయాలపైనే ఉన్నదనే భావన చాలా ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం మనం చేసే సందేశ ప్రచారం కూడా ఈ మూడు ప్రధాన అంశాలపైనే ఆధారపడింది. ష సందేశ ప్రచారమే మన కర్తవ్యం అని మన బాధ్యతకు మనం ఒకరకంగా హద్దులను కూడా ఏర్పరచుకున్నాం అనేది వాస్తవం. నిజానికి మహాప్రవక్త(స) జీవిత చరిత్రను ఖుర్‌ఆన్ అవతరణను రెండింటిని గమనిస్తే తౌహీద్, రిసాలత్, ఆఖిరత్‌లతోపాటు అఖ్‌లాక్ (నైతిక నడవడి), హుఖూఖుల్ ఇబాద్ (సృష్టితాల హక్కులు). ఈ రెండు కూడా ప్రధానమైనవని అర్థం అవుతుంది. ముఖ్యంగా పేదవారు, బలహీనులు, వితంతువులు, అనాథల హక్కుల పరిరక్షణ, వారి పట్ల ప్రేమ, దయ, కరుణలతో వ్యవహరించటం. అలాగే ప్రజా వ్యతిరేక ఆచరణలను తీవ్రంగా విమర్శించడం జరిగింది.

మహాప్రవక్త(స) ఆ కాలంలో ఉన్న ఎన్నో దురాచారాలను ఎటువంటి చట్టాలు లేకుండానే సంస్కరించగలిగారు. ముఖ్యంగా సజీవంగా పాతిపెట్టబడిన బాలికను నీవు ఏ తప్పు వల్ల హత్య చేయబడ్డావని అడిగినప్పుడు". (81: 8) ఇది తక్వీర్ సూరాలోని ఆయత్. ఈ సూరా అవతరణ ఇస్లాం తొలి రోజులలో జరిగింది. కనీసం ఒక యాభై మంది కూడా అప్పటికి ఇస్లాంను స్వీకరించలేదు. ఇరవై నుండి ముప్పై మధ్యలోనే అప్పటికి ఇస్లాం స్వీకరించారు. అంత తక్కువ మంది అనుచరులతో ఉన్నప్పటికీ ఆనాటి కాలంలో బలంగా ఉన్న ఒక దురాచారాన్ని నిర్మూలించే ప్రయత్నం జరిగింది. ఇది ఒక సందేశ ప్రచారకుడిగా మహాప్రవక్త దైర్య సాహసాలకు ప్రతీకగా కూడా మనం చూడవచ్చు. ఒకటి సందేశ ప్రచారకుడు కేవలం తౌహీద్, రిసాలత్, ఆఖిరత్ అంశాలనే కాక ఆనాటి అనైతిక చర్యలపై కూడా గళం విప్పాలనే స్పృహ కలిగిస్తుంది. అలాగే కొద్దిమంది సహచరులతో మొత్తం అరబ్‌కు వ్యతిరేకంగా స్త్రీల ఉద్ధరణకు పూనుకోవడం కూడా అలాంటిదే. ఇద్దరు ఆడపిల్లలను పెంచి పోషించిన వారు స్వర్గంలో నాకు సమీపంగా ఉంటారనే శుభవార్తతో ఒక పెద్ద మార్పుకు శ్రీకారం చుట్టారు.

“తూనికలలో, కొలతలలో తగ్గించి ఇచ్చేవారికి వినాశం ఉన్నది. వారు ప్రజల నుండి తీసుకునేటప్పుడు పూర్తిగా తీసుకుంటారు; వారికి కొలిచిగాని తూచిగాని ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక మహాదినం నాడు వారు బ్రతికించి తీసుకురాబడనున్నారని వారికి తెలియదా? ఆ రోజున ప్రజలందరూ సకల లోకాల

ప్రభువు సమక్షంలో నిలబడతారు". (83: 1-6) ఇవి ముతఫ్ఫిఫీన్ సూరాలోని ఆయతులు ఇవి కూడా మక్కాలో అవతరించినవే. వీటి సందేశ ప్రచారం ఆనాటి మక్కా పరిస్థితుల రీత్యా అంత సులువైనది కాదు. మక్కానగరం అతిపెద్ద వ్యాపార కూడలిగా ఉండేది. వ్యాపారం మొత్తం మక్కా ధనవంతుల కబంధ హస్తాలలో ఉండింది. వ్యాపారంపై వీరి ఆధిపత్యమే కొనసాగేది. ఈ ధనవంతులు, సర్దారులే ఇస్లాం విరోధులుగా, శత్రువులుగా మారి ఉన్నారు. వీరికి వ్యతిరేకంగా ఈ కొలతలు తగ్గించి ఇచ్చేవారికి వినాశనం అని తాకీదు చేయడమంటే ఆనాటి అరబ్ పెద్దలపై యుద్ధ ప్రకటన చేయడమే. మక్కాపెద్దలు కేవలం మార్కెట్‌ను మాత్రమేకాక ప్రజల విశ్వాసాలను కంట్రోల్ చేసేవారు, సభ్యతా సంస్కృతులపై వీరి ఆధిపత్యమే కొనసాగేది. దీని నిర్మూలనకు ఇంకా ఇస్లామిక్ రాజ్యం ఏర్పడలేదు. అయినప్పటికీ "వ్యాపారంలో మోసం చేసేవారు తనవారు కాదు" అనే నైతిక బోధనతో ఆయన దీనిని సాధించారు.

ఒక సందేశ ప్రచారకుడిగా విషయాన్ని బోధించడంతోపాటు దానిని అమలు చేసే విధానాన్ని చట్టాల సహాయంతో కాక నైతిక బోధనల ద్వారా సాధించడం కేవలం ముహమ్మద్(స) వారికి మాత్రమే సాధ్యపడింది. ఈ వ్యాపార దోపిడీని వ్యతిరేకించడ మంటే ఒక రకంగా జాత్యాహంకార దోపిడి, సామ్రాజ్యవాద దోపిడి, ఆధ్యాత్మిక, మేథోపరమైన అన్ని రకాల దోపిడీలకు వ్యతిరేకంగా గళం విప్పడం, వాటిని నిర్మూలించడం కూడా ఒక సందేశ ప్రచారకుడి బాధ్యతగా మనం గుర్తించాలి. మక్కాలో జరిగిన ఈ సందేశ ప్రచారం మదీనాలో ఆచరణలోకి తెచ్చి చూపడం జరిగింది. ఆనాటి మార్కెట్‌లలో శ్రమ, ఆర్థిక దోపిడీ జరగకుండా ప్రధానమైన చర్యలు తీసుకోవడం జరిగింది.

నేడు కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. గ్రామ స్థాయిలో భూస్వాములు, నగర స్థాయిలో బ్లాక్‌మార్కెట్‌దార్లు, గుత్తేదారులు, రాష్ట్ర జాతీయ స్థాయిలో జాతీయ పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదులు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ వ్యాపార సంస్థలు, మల్టినేషనల్ కంపెనీలు, కార్పొరేట్ కంపెనీలు ఇవన్నీ కూడా నేటి ఆర్థిక దోపిడీని కొనసాగిస్తున్నాయి.

అబస సూరాలో ప్రవక్త(స) సందేశ విధానంపై ఒక మందలింపు కనిపిస్తుంది. దైవప్రవక్త(స) ఖురైష్ తెగ సర్దారులకు ఖుర్ఆన్ సందేశం అందజేస్తూ వారితో చర్చిస్తూ ఉండగా అక్కడకు కడు పేదవాడు, అంధుడు అయిన అబ్దుల్లా బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) ప్రవక్త(స) వారి వద్దకు వచ్చారు. ఖురైష్ సర్దారులు తన సందేశాన్ని అంగీకరిస్తే ఇస్లామీయ ఉద్యమానికి బలం చేకూరుతుందని మహాప్రవక్త(స) ఖురైష్ నాయకులపై తన ధ్యాస ఉంచారు. అయితే తనకు కొంత శిక్షణ ఇవ్వమని అక్కడకు వచ్చిన అబ్దుల్లా బిన్ ఉమ్మె మక్తూమ్(రజి)ను చూసి విసుగుతో ముఖం తిప్పుకున్నారు.

అబస సూరా ద్వారా సత్యధర్మ సందేశ నైజం ఎలా ఉండాలో ప్రవక్త(స)కు తెలియజేయడం జరిగింది. సామాజికంగా ఉన్నత స్థోమత, హోదాలు ఇస్లామీయ ఉద్యమానికి తోడ్పడేవి కావని, ఎవరికైతే దైవభీతి వుంటుందో వారే ఈ సందేశానికి అర్హులని తెలియజేయడం జరిగింది. కేవలం ఇది మహాప్రవక్తకు మాత్రమే మందలింపు, శిక్షణ కాదు. ఆయన(స) అనుచర గణానికి అందరికీ సందేశ ప్రచారంలో ఇదే పద్ధతిని అనుసరించాలని బోధించడం జరిగింది. దైవ ఆదేశంలోని ఈ తీవ్రతను ప్రజల ముందు ప్రకటించి ఆ ఆదేశ పాలనను ప్రజల్లో సర్వసాధారణం చేశారు. తన ద్వారా జరిగిన ఒక పొరపాటును అంగీకరించటం, దానిని బహిరంగంగా ప్రజల ముందు ప్రకటించటం, దైవాదేశాలకు ప్రవక్త(స) కూడా బద్ధుడే అని ప్రకటించడం ఒక దైవప్రవక్తకు మాత్రమే సాధ్యం. ఒక సందేశ ప్రచారకునిగా తన పూర్తి కర్తవ్యాన్ని నెరవేర్చిన ఘనత మహాప్రవక్త(స) దక్కుతుంది. అలాగే ఆయన ఈ ఆచరణ ద్వారా మనం సందేశ ప్రచారంలో జరిగే పొరపాట్లను సరిదిద్దుకుంటూ కర్తవ్యాన్ని బాధ్యతా యుతంగా నెరవేర్చాలని అర్థం అవుతుంది.

మహాప్రవక్త(స) మక్కాలో చేసిన సందేశ ప్రచార విధానానికి మదీనాలో విధానానికి చాలా వ్యత్యాసం ఉంది. హిజ్రత్‌కు పూర్వం మక్కాలో అబూజర్ గిఫ్ఫారి(రజి)కు, తుఫైల్ బిన్ అమ్రూ దౌసికి సందేశం ఇచ్చినప్పుడు వారు దానిని స్వీకరించారు. అయితే వారిని మక్కాలో తాము విశ్వాసులుగా మారిపోయిన విషయాన్ని ప్రకటించడాన్ని ఆయన వారించారు. ఆ సందర్భాన్ని బట్టి వారిని రహస్యంగానే ఉంచుతూ తమ తెగలలో సందేశ ప్రచారం చేయమని ఆదేశించారు. మదీనాలో బహిరంగంగా వివిధ రాజ్యాల రాజులకు ఉత్తరాల ద్వారా సందేశాన్ని పంపడం జరిగింది. ఒక సందేశ ప్రచారకునికి ఈ వ్యత్యాసాన్ని అర్థం చేసుకుంటూ తన కర్తవ్యాన్ని నెరవేర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది. ❁

# సిగ్గు అనే సుగుణ శ్రేష్ఠత

- నసీరా బేగం

**మనిషి జీవితంలో** సిగ్గు బిడియాల ప్రాముఖ్యత అత్యంత అధికంగా ఉంటుంది. ఈ సిగ్గూ బిడియాలే మనిషికి, జంతువుకి మధ్య ఉన్న తేడాను విశ్లేషిస్తాయి. అల్లాహ్ ఈ సుగుణాన్ని మనిషి నైజంలో పుట్టుకతోనే సృష్టించాడు. కనుకనే ఒక చిన్నపిల్లవాడు కూడా తన మర్మాంగాలు బహిర్గతమైనప్పుడు కప్పుకునే ప్రయత్నం చేస్తాడు. ఈ సుగుణం కొంతమందిలో ముందునుంచే కొంత అధికంగాను, మరి కొంతమందిలో కొంత తక్కువగాను ఉంటుంది. ఈ సుగుణం మనిషిని దుష్కార్యాల నుంచి సంరక్షిస్తుంది. సత్కార్యాలు చెయ్యమని ప్రేరేపిస్తుంది. మనిషి ఈ సిగ్గు బిడియాలు అనే సుగుణాన్ని తప్పకుండా కలిగి ఉండాలి, సిగ్గు బిడియాలు ఇస్లామ్ సహజ ఆభరణాలు.

ఏ మనిషైతే తమలోనుంచి సిగ్గూ బిడియాలను తీసివేసి వాటిని అటకమీద ఉంచివేస్తాడో అలాంటి మనిషి విచ్చలవిడిగా జీవిస్తాడు, కళ్లెంలేని గుర్రం మాదిరిగా పరుగెత్తుతాడు. ఇష్టానుసారం జీవిస్తాడు. అతనికి ఒక పద్ధతి, ఒక జీవన విధానం అంటూ ఏదీ ఉండదు. ఒక నీతి నిజాయితీ అని కూడా ఏమీ ఉండదు. అలాంటి వ్యక్తి తన కోసం తానే కట్టుబాట్లను నిర్ణయించుకుంటాడు. హద్దులను అతిక్రమిస్తాడు. తన చుట్టూ ఉన్న వాతావరణంలో తనకు ఏది ఆకర్షవంతంగా కనిపిస్తుందో దానినే ఎన్నుకుంటాడు. తనకు నచ్చని వాటిని ఇట్టే వదిలివేస్తూ ఉంటాడు. తన మధ్యన స్వేచ్ఛగా, తన ఇష్టానుసారంగా జీవిస్తున్న జంతువులను చూసి తాను కూడా అదేవిధంగా స్వేచ్ఛగా జీవిస్తే ఎంత బాగుంటుంది అని ఆశిస్తాడు. వాటి విధివిధానాలను అలవరచుకుంటాడు. ప్రపంచం మొత్తంలోనుంచి స్వేచ్ఛగా, ఇష్టానుసారంగా జీవిస్తున్న ప్రజలపై దృష్టి సారిస్తాడు. వారి కట్టుబాట్లను, తాను అనుసరించటానికి ప్రయత్నిస్తాడు. ఈనాడు మన సమాజంలో చూస్తున్నది అక్షరాలా నూరుశాతం ఇదే. కాని ఇంతా చేసి అతను తృప్తిగా జీవిస్తున్నాడా అంటే అదీ లేదు. అతనికి మనశ్శాంతి కరువైపోయింది. ఒకసారి అటు పరుగెత్తితే మరొకసారి ఇటు పరుగెత్తుతూ ఉన్నాడు. ఇటూఇటూ అతను పరుగెత్తటం తప్ప అతనికి ఒక గమ్యం అంటూ ఏదీ లభించటంలేదు. చివరికి అతని నిరాశా నిస్పృహలకు, మనోవేదనకు గురై మానసిక వ్యాధికి గురవుతున్నాడు. చివరకు భారంగా జీవిస్తున్నాడు. భారంగా జీవించలేనప్పుడు తనువు చాలించే శిక్షను తనకు తాను విధించుకుంటున్నాడు. ఇదీ నేటి మనిషి పరిస్థితి. పాశ్చాత్య దేశాల పోకడలను అనుసరించినందుకు అతనికి పట్టిన గతి ఇది. మనిషి దైవవిధానాలను మత సంకెళ్ళను త్రెంచుకొని స్వేచ్ఛగా ఎంత పరుగెత్తినా, ఎంత ఎగిరినా దేవుడు సృష్టించిన భూమ్యాకాశాల మధ్యనే కదా అతను ఎగిరేది, అతను పరుగెత్తేది.

ఆ భూమిని దాటి మరోచోట ఎక్కడకూ వెళ్ళనూ లేడు. ఆ ఆకాశాలలో నుంచి దూరి మరో ప్రపంచంలోకి ప్రవేశించనూ లేడు. చివరకు ఎక్కడినుంచి ప్రయాణం మొదలుపెట్టాడో అతను తిరిగి అక్కడికి రావటం అతనికి తప్పదు. ఈ విధంగా అతను జీవితం మొత్తం పరుగెత్తి పరుగెత్తి చివరకు నిరాశా నిస్పృహలకు లోనై పశ్చాత్తాపానికి గురి అయి వెనక్కి తిరిగి రావటం జరుగుతుంది. చేతులు కాలిపోయిన తరువాత ఆకులు పట్టుకుంటే ఏం లాభం అన్నట్టు ఉంటుంది అతని పరిస్థితి.

ఈ నష్టాలన్నింటి నుంచి కాపాడటానికే కారుణ్య ప్రభువైన అల్లాహ్ మనిషి హృదయంలోనే సిగ్గూ బిడియాలనే ఉత్తమ సుగుణాన్ని ఉంచాడు. ఆ సుగుణం కారణంగా అతను అందంగా, ఆకర్షవంతంగా రూపుదిద్దుకుంటాడు. సుఖసంతోషాల జీవితాన్ని అలవరచుకుంటాడు. ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతాడు. దుష్కార్యం నుంచి తమను తాము రక్షించుకుంటాడు. మంచి కార్యాల వైపునకు పరుగెత్తుతాడు. కనుకనే దైవప్రవక్త(స) సిగ్గు బిడియాలు అనే సుగుణాలు పూర్తిగా మేలుతో కూడుకున్నవి అన్నారు. దైవ విశ్వాసంలోని భాగాలివి. దైవ విశ్వాసం మనిషిని స్వర్గం వైపునకు తీసుకెళుతుంది. సిగ్గులేని తనం మనిషిని అన్యాయం, అక్రమం, దౌర్జన్యం వైపునకు మళ్ళిస్తుంది. అది నరకం వైపునకు తీసుకెళుతుంది.

ప్రవక్త(స) సెలవిచ్చారు: అల్లాహ్ మనిషిని వినాశానికి గురి చెయ్యదలుచుకుంటే మొట్టమొదట అతనినుంచి సిగ్గు అనే సుగుణాన్ని లాక్కుంటాడు. ఆ సిగ్గు అనే సుగుణాన్ని అల్లాహ్ లాక్కోవటం కారణంగా అతను ప్రజలలో అయిష్టమైన వ్యక్తిగా పరిగణించబడతాడు. అప్పుడు అతన్ని ప్రజలు అసహ్యించుకుంటూ ఉంటారు. దాని తరువాత అతని నుంచి నమ్మకం అనే సుగుణాన్ని కూడా అల్లాహ్ లాక్కుంటాడు. అప్పుడు అతను ప్రజలలో నమ్మకద్రోహిగా పరిగణించబడతాడు. ఇంకా ఆ తరువాత అల్లాహ్ అతని హృదయంలో నుంచి కారుణ్యాన్ని లాక్కుంటాడు. అప్పుడు అతను కఠిన హృదయుడై పోతాడు. దాని కారణంగా చెడు ప్రవర్తనలకు గురవుతాడు. దాని తరువాత అల్లాహ్ అతని నుంచి దైవ విశ్వాసాన్ని లాక్కుంటాడు. అప్పుడు అతను ఒక షైతాన్ మాదిరిగా తయారవుతాడు.

దీనిద్వారా సిగ్గు అనే సుగుణం ఎంత విలువైనదో, దానికి కట్టుబడి ఉండటం ఎంత అవసరమో దీనిద్వారా స్పష్టంగా అర్థమవుతుంది. షైతాన్ మనిషిని అనైతిక చర్యలకు గురి చెయ్యక ముందు అతనినుంచి సిగ్గు అనే సుగుణాన్ని అంతరించిపోయేలా చేస్తాడు. తరువాత మనిషి కోసం లాభదాయకమైనవిగా ఉన్న విషయాలను, నష్టదాయకమైనవిగా చూపిస్తాడు. ఇంకా అవి ఆటంకాలుగా, అవరోధాలుగా చేసి చూపిస్తాడు. అనైతిక చర్యలను ఆకర్షవంతంగా, గమ్యానికి సోపానాలుగా చేసి చూపిస్తాడు. అవివేకి అయిన మనిషి ఆ షైతాను వెంటపడి అతనిని అనుసరిస్తాడు. చివరకు అతడు ఆ అవివేకిని నట్టేట ముంచివేసి గట్టున నుంచొని చప్పట్లు కొడతాడు. అప్పుడు పాపం ఆ మనిషి ఇటు ఇహలోక సుఖానికి, గౌరవానికి నోచుకోలేడు. అటు పరలోక సుఖానికి, గౌరవానికి నోచుకోలేడు. చివరకు దైవశిక్షకు గురవుతాడు. అప్పుడు ఆ అభాగ్యుడు బాధ్యుడైన షైతాన్‌ను నిలదీసి అడిగినప్పుడు నేను నీకు కేవలం పిలుపునిచ్చాను కాని ఎలాంటి బలవంతం చెయ్యలేదు కదా! అని చెప్పి అతని నుంచి తప్పించుకుంటాడు తప్ప అతడు అప్పుడు ఆ మనిషికి ఎలాంటి సహాయమూ చెయ్యడు.

ఒకసారి దైవప్రవక్త(స) ఒక వ్యక్తి దగ్గర నుంచి అటుగా వెళుతున్నారు. అప్పుడు అతను తన సోదరునికి నీవు అధికంగా సిగ్గు పడుతున్నావు అని మందలిస్తున్నాడు. అంటే ఈ సిగ్గు నీకు నష్టాన్ని చేకూర్చుతుంది అని అంటున్నాడు. ఇది విన్న దైవప్రవక్త(స), అతని మానాన అతనికి వదిలిపెట్టు. ఎందుకంటే సిగ్గు, విశ్వాసంలో ఒక భాగం అని సెలవిచ్చారు.

సిగ్గు అనేది రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి, పుట్టుకతోనే వచ్చేది. రెండోది, జ్ఞానం కారణంగా లభించేది. అంటే అల్లాహ్ తాను చేసే ప్రతి పనిని గమనిస్తున్నాడు. దానికి సమాధానం చెప్పుకోవలసి ఉంటుందనే భయంతో ఏర్పడేది.

దైవప్రవక్త(స) ఇలా బోధించారు : మీరు మీ ఇంటి పెద్దవారి ముందు ఎలా సిగ్గుపడతారో ఆ విధంగా అల్లాహ్‌తో సిగ్గుపడండి. అంటే మీ తలను, మీ కడుపును నిషిద్ధమైన వాటి నుంచి రక్షించుకోండి. ఆపదలను, మరణాన్ని జ్ఞాపకం ఉంచుకోండి. ఎవడైతే పరలోక సాఫల్యం కోరుకుంటాడో అతను ఇహలోకపు ఆకర్షణలను, భోగభాగ్యాలను వదలుకుంటాడు.

చివరగా అర్థమయ్యే విషయమేమిటంటే సిగ్గూ బిడియాలు కల మనిషి ఈ సుగుణం కారణంగా సత్కార్యాలు చేస్తాడు, దుష్కార్యాలు వదిలివేస్తాడు. ❁



# సర్వోన్నత సుగుణాల ఖజానా- ముహమ్మద్(స)

మంగళగిరి జీలాని

**"నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది".** (ఖుర్ఆన్ 33:21)

ప్రపంచమంతా అజ్ఞానాంధకారంలో మునిగి ఉన్నప్పుడు ప్రకాశించిన కాంతి రేఖ, మహోజ్వల జ్యోతిగా మారి ప్రళయం వరకు రాబోయే ప్రపంచ మానవులందరికి వెలుగు బాటై, శ్రేయ స్కరమైన, ఋజుమార్గాన్ని చూపించారు చిట్టచివరి దైవప్రవక్త, మార్గదర్శి, ఆదర్శమూర్తి, మహా ప్రవక్త ముహమ్మద్ (స). ఆయన(స) జీవితం తెరిచిన పుస్తకం. దానిని అధ్యయనం చేసిన ప్రతిసారీ సర్వోన్నత సుగుణాల ఖజానాలో నుండి ఎన్నో విలువైన ఆణిముత్యాలు లభిస్తాయి. రండి, ఒక్కొక్క ఆణిముత్యాన్ని ఏరు కుందాం.

## సత్యం పలికేవారు

దైవసందేశహరులు ముహమ్మద్ (స) నిత్యం సత్యం పలికేవారు. అబద్ధాన్ని అసహ్యించుకునేవారు. చివరికి హాస్యానికి కూడా అబద్ధమాడేవారు కాదు.

ప్రవక్త(స) అబద్ధం పలికేవారు కారని శత్రువులు కూడా స్వయాన సాక్ష్యం పలికారు. అబూజహల్ దైవప్రవక్తకు బద్ధ విరోధి అన్న సంగతి మనకు తెలిసిందే. కాని అతడు సైతం ప్రవక్తవారి సత్యసంధతను అంగీకరించక తప్పలేదు.

'ఓ ముహమ్మద్ (స)! నువ్వు అబద్ధీకుడవని నేను చెప్పలేను. నీవు ఏనాడూ అబద్ధం చెప్పి ఎరుగవు. కాని నీవు ఏ సందేశం అయితే ఇస్తున్నావో అది సరైనది కాదని భావిస్తాను'' అని అబూజహల్ అన్నాడు.

దైవప్రవక్త (స) మొట్టమొదట సఫా కొండపై ఎక్కి ఖురైష్ ప్రజలను గొంతెత్తి పిలిచి అడిగిన ప్రశ్నను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకుందాం: "ఒకవేళ నేను మీతో ఈ కొండకు వెనుక వైపున ఒక శత్రు సైన్యం మనపై దాడి చేయడానికి వేచి వుందని చెపితే మీరు విశ్వ సిస్తారా?'' అని దైవప్రవక్త (స) అడిగిన ప్రశ్నకు అందరూ ముక్తకంఠంతో 'తప్పనిసరిగా విశ్వసిస్తాం! ఎందుకంటే నీవు ఏనాడూ అబద్ధం చెప్పి ఎరుగవు. నీవు అబద్ధం చెప్పడం మేము ఏనాడూ ఎరుగము' అని ప్రవక్త సత్య సంధతకు సాక్ష్యం పలికారు.

## వాగ్దాన పాలన

ప్రియప్రవక్త ముహమ్మద్ (స) వాగ్దానం చేస్తే దానిని తప్పనిసరిగా నెరవేర్చేవారు. మిత్రులు సరేసరి, కాని శత్రువులు సైతం ఆయన

(స) లోని ఈ సద్గుణాన్ని అంగీకరించారు.

రోమన్ చక్రవర్తి అబూ సుఫియాన్‌ను అడిగిన ప్రశ్నలు చరిత్రలో లిఖించబడి ఉన్నాయి. రాజు 'ముహమ్మద్ (స) ఎప్పుడైనా వాగ్దానం చేసి దానిని నెరవేర్చకపోవడం జరిగిందా?' అని ప్రశ్నించాడు. అందుకు అబూ సుఫియాన్ 'లేదు' అని స్పష్టంగా జవాబిచ్చాడు. ఈ సమాధానం విని రోమన్ పాలకుడు దీర్ఘమైన ఆలోచనలో మునిగిపోయాడు.

ఎవరైనా ఒక ముస్లిం మక్కా నుండి పారిపోయి మదీనాకు చేరితే అతనిని మక్కావాసులకు అప్పగించాలి"- ఇది హుదైబియా ఒప్పందంలోని ఒక షరతు.

సరిగ్గా ఈ షరతు వ్రాస్తూ వున్న సమయంలోనే అబూ జందల్ (రజి) ఒంటి నిండా సంకెళ్ళతో, గాయాలతో మక్కా ఖురైషుల ఖైదు నుండి తప్పించుకొని పారిపోయి వచ్చారు. దయనీయమైన తన స్థితిని, తనపై జరిగిన హింసా దౌర్జన్యాలను ఆయన వివరించారు. వాతావరణం గంభీరంగా ఉంది. విశ్వాసులందరి హృదయాలు ఆయన స్థితిపై విలపించ సాగాయి. కాని, దైవప్రవక్త (స) ప్రశాంతంగా, సంధి ఒడంబడికను గౌరవిస్తూ ' ఓ అబూ జందల్.. నీవు తిరిగి మక్కాకు వెళ్ళవలసి ఉంటుంది. నేను వాగ్దాన భంగం చేయలేను . ఒడంబడికను అగౌరవపర్చలేను' అని అన్నారు. ప్రవక్త(స) వారి మాటల్లో ఆవేదన, ఆర్ద్రత పెల్లుబుకుతూ ఉండింది. అబూ జందల్ (రజి) తమ నాయకులైన ప్రవక్త (స) మాటకు కించిత్తు కూడా బదులు పలకలేదు సరికదా, తనకు తానుగా మక్కా ఖురైష్ సర్దారులకు తిరిగి బందీగా వెళ్ళిపోయారు.

## దయార్ద్ర హృదయం

ప్రవక్తశ్రీ(స) వ్యక్తిగత జీవితాన్ని ఎరిగినవారి మాటలు చూద్దాం-

హజ్రత్ అనస్ (రజి) పది సంవత్సరాలు ఆయన (స)కు సేవ చేశారు. ఆయనేమన్నారంటే- మహనీయ (స) నన్ను ఎన్నడూ కొట్టలేదు. కోపగించుకోనూ లేదు, గద్దించనూ లేదు. అలా ఎందుకు చేశావ్, ఇలా ఎందుకు చేయలేదు? అని కూడా ఆయన (స) అనలేదు. ఎంతో క్షమాగుణంతో మెలిగేవారు.

తనకు అప్పగించబడిన బానిసను తీసుకొని వచ్చి ఖదీజా(రజి) ముహమ్మద్ (స)కు ఇచ్చారు. మహనీయ ముహమ్మద్(స) అప్పటికప్పుడు బాలుడ్ని బానిసత్వం నుంచి విముక్తి కల్పించి తన కుమారునిగా చేసుకున్నారు. ఎన్నో ఏళ్ళ తరువాత తండ్రికి తెలిస్తే ఆయనను తీసుకెళదామని మక్కాకు వచ్చాడు. కాని హజ్రత్ జైద్ మాత్రం ఆయన (స)ను విడిచి, తండ్రితో వెళ్ళడానికి సిద్ధపడలేదు. అందర్నీ వదిలిపెట్టి ఇక్కడ వెట్టిచాకిరి చేస్తూ బానిస బతుకు బతుకుతావా? అంటే "ఇక్కడ నేనేం బానిసగా బతకడంలేదు. ప్రవక్త నన్ను మంచిగానే చూసుకుంటున్నారు. ఈయనగారి మంచితనం నన్ను కట్టిపడేసింది. నేను మీ వెంట రాలేను" అన్నాడు జైద్.

ఆయన(స)తో ఎవరయినా అమర్యాదగా ప్రవర్తిస్తే ఆయన క్షమాగుణం కలిగి ప్రవర్తించేవారు. అంతేకాదు వారికి ఉపకారం కూడా చేసేవారు. ఆయన (స) అన్నారు: "ఇతరులపై దయ చూపని వారిపై అల్లాహ్ దయచూపడు" అని (మిష్కాత్).

ఆయన(స) ఎన్నడూ ఎవరితో తన వ్యక్తిగత వ్యవహారాలలో ప్రతీకారం తీర్చుకోలేదు. ఆయన(స) బోధనలలో మానవులపట్లనే కాదు, జంతువులతో సైతం దయతో ప్రవర్తించాలని బోధించారు. తమ ఆనందం, వినోదం కోసం జంతువులను పోట్లాడించటం, వాటిని హింసకు గురిచేయటాన్ని ప్రవక్త (స) వారించారు. జిబహ్ సమయంలో కూడా జంతువుకు నీళ్ళు త్రాగించాలని, వీలైనంత తక్కువ బాధ కలిగేలా జిబహ్ చేయాలని, అందుకు కత్తి పదునుగా ఉండాలని ప్రవక్త (స) బోధించారు.

ఒకసారి ఒక వ్యక్తి ఒక పిచ్చుక గూడు నుండి దాని పిల్లలను తీసుకొని వచ్చాడు. ఆ పిల్లల తల్లి పిచ్చుక కిచకిచలాడుతూ ఆ వ్యక్తి వెంట పడింది. విశ్వకారుణ్యమూర్తి (స) ఈ దృశ్యాన్ని చూశారు. వెంటనే ఆ పిచ్చుక పిల్లలను దాని గూడులో వదిలి పెట్టు' అని సూచించారు.

## ఉత్తమ ప్రవర్తన

దైవప్రవక్త (స) ప్రతి ఒక్కరితో ఉత్తమంగా ప్రవర్తించేవారు. ప్రతి ఒక్కరూ ప్రవక్త(స) వారు తననే ఎక్కువగా అభిమానిస్తున్నారని భావించే విధంగా ఆయన(స) ప్రవర్తన ఉండేది. సంభాషణా సందర్భంలో ప్రతి ఒక్కరితోనూ శ్రద్ధగా మాట్లాడేవారు. వారు చెప్పేది పూర్తిగా వినేవారు .

తనతో సంభాషించే ప్రతి వ్యక్తితో నగుమోముతో సంభాషించే వారు. తనతో మాట్లాడేవారి కుటుంబ, తెగ సంబంధ బాధ్యతలను గుర్తెరిగి ఆ స్థాయిలో వారితో సంభాషించేవారు. ఈ సందర్భంలో ఇతరుల మనసు గాయపడకుండా జాగ్రత్త వహించేవారు.

ఒక సందర్భంలో ప్రవక్త (స) వారు తన మనవడు హజ్రత్ హసన్ (రజి)ను ఒడిలో కూర్చోపెట్టుకొని ఆయనను ముద్దాడుతూ ఉండగా ఒక సహాబి (రజి) 'ఓ ప్రవక్తా ! నేను నా బిడ్డలను ఎప్పుడూ ఇలా ప్రేమగా ముద్దాడలేదు' అని చెప్పారు. అందుకు దైవప్రవక్త (స) 'అల్లాహ్ నీ హృదయం నుండి ప్రేమ, వాత్సల్యాలను తొలగించి వేస్తే దానికి నేనేమి చేయను' అని బదులిచ్చారు.

## నైతిక స్వభావం

విశ్వాసుల మాత హజ్రత్ అయిషా (రజి) ఆయన (స) అలవాట్ల గురించి చెబుతూ: ఆయనకు ఎవరి చెడు గురించి చెప్పే అలవాటు లేదు. చెడుకు బదులుగా చెడు చేసేవారు కాదు. పైగా ఆయన క్షమించేవారు. సులభమయిన రీతిని అవలంబించేవారు. ఆయన తన స్వంత విషయంలో ఎవరితో ప్రతీకారం తీర్చుకోలేదు. ఏ ముస్లింను కూడా శపించలేదు. సమ్మతమయిన ఫిర్యాదు వస్తే దానిని రద్దుపరచలేదు. తన ఇంటివారందరితో సంతోషంగా గడిపేవారు. స్నేహితులను గౌరవించేవారు. ఎదుటివారు తన మాటలను జ్ఞాపకం పెట్టుకోవడానికి ఆగి ఆగి సంభాషించేవారు. ఒకసారి ఎవరో హజ్రత్ ఆయిషా (రజి)ను అడిగారు: దైవప్రవక్త(స) స్వభావం ఎలా ఉండేది? అని. ఆమె "కాన ఖుల్‌ఖుహు ఖుర్‌ఆన్". "ఆయన స్వభావంలో ఖుర్‌ఆన్ కానవచ్చేది" అన్నారు. అంటే దివ్యఖుర్‌ఆన్‌లో ఆదేశించిన నైతికతలకు ఆయన ప్రతిరూపం.

## ఇతరులకు సహాయపడడం

దైవప్రవక్త(స) ఇతరులకు సహాయపడటంలో ఉత్సాహం చూపేవారు. ఇతరుల బాధల్లో, కష్టాల్లో వారికి తోడ్పాటు అందించేందుకు నిరంతరం తయారుగా ఉండేవారు. ప్రియప్రవక్త (స) సంఘసేవలో ముందు ఉండేవారు.

అనాథలు, పేదవారు, వితంతువులు, వికలాంగుల వంటి అవసరార్థుల అవసరాలు తీర్చటంలో ప్రవక్త (స) వారు అలుపెరగకుండా కృషి చేసేవారు. వారి సేవలో సంతృప్తి పొందేవారు. సంతోషంతో సేవలు అందించేవారు. తన సహచర బృందాన్ని సమాజ సేవ కోసం ఉత్సాహపరిచేవారు.

## వినయ విధేయత

విశ్వకారుణ్యమూర్తి (స) ఏనాడూ అహంతో తల ఎత్తుకుంటూ నడిచేవారు కాదు. చూపులను నిత్యం క్రిందకు దించి నడిచేవారు. ఇతరులతో కలిసి నడిచే సమయాల్లో ఇతరులకు ముందు నడిచే అవకాశం ఇచ్చేవారు. తాను వారి వెనుక నడిచేవారు . కూర్చోవటంలో అత్యంత ఒద్దిక కనబరిచేవారు.. భోజన సమయంలో అత్యంత వినయంగా ఒక సేవకునిలాగా కూర్చొనే వారు. 'నేను స్వయాన దైవదాసుడను, ఆయన దాసుడిలానే భోజనం చేస్తాను' అని పలికేవారు.

సమావేశాలలో అందరికంటే ముందుగా చేరేందుకు ఇతరులను దాటుకుంటూ వచ్చేవారు కాదు. ఎక్కడ స్థానం దొరికితే అక్కడే ఆసీనులయ్యేవారు. ఒక్కో సందర్భంలో వెనుక వరుసలోనూ కూర్చొనేవారు. ప్రియప్రవక్త (స) రాకడను గమనించి ఆయన గౌరవార్థం సహచరులు లేచి నిలబడటాన్ని ఆయన అంగీకరించే వారు కాదు.

మక్కా విజయం తర్వాత విజయులై నగరంలో ప్రవేశించే సమయంలో ఆయన(స) తల ఎంతో వినయంగా వంగి ఉండింది. ఆ సమయంలో ప్రవక్త (స) వారి గడ్డం ఒంటె మూపురానికి ఆని వుంది.

## దానధర్మాలు

దైవప్రవక్త (స) ఉదాత్త గుణం కలవారు. దానధర్మాలలో హద్దులు ఎరుగని వారు. చేతిలో లేని పక్షంలో మృదువుగా సమాధానం చెప్పి మరోసారి రమ్మని వాగ్దానం చేసేవారు.

ఒకసారి ఒకచోట నుండి చాలా ఎక్కువ మొత్తంలో శిస్తు వచ్చింది. అంతకు ముందెన్నడూ అంత సొమ్ము రాలేదు . ప్రియప్రవక్త(స) మస్జిద్ గోడకు ఆనుకొని ఆ సొమ్మును దానం చేయటం మొదలెట్టారు. సాయంత్రమయ్యేలోగా మొత్తం సొమ్మును దానం చేశారు.

ఆహార పానీయాలు ప్రవక్త (స) వద్దకు పంపబడినప్పుడు ఏనాడూ ఒంటరిగా భుజించలేదు. సహచరులందరికీ అందులో భాగం పంచి పెట్టేవారు. ఉన్న దానిలోనే అక్కడ హాజరై ఉన్న వారంతా పంచుకుని తినేవారు.

## అతిథి మర్యాదలు

దైవప్రవక్త (స) అతిథి మర్యాద పట్ల కడు శ్రద్ధ చూపేవారు. అతిథి మర్యాదలో ఎటువంటి లోపం రానీయకుండా జాగ్రత్త పడేవారు. బయట నుంచి మదీనా నగరానికి వచ్చే బృందాలను స్వయంగా ప్రవక్త (స) వారే పర్యవేక్షించేవారు. వారికి సదుపాయాలు స్వయంగా ఏర్పాటు చేసేవారు. అతిథుల ఆర్థిక అవసరాలను కూడా వీలైనంతగా తీర్చే ప్రయత్నం చేసేవారు. ఈ అతిథి మర్యాదలు విశ్వాసులు, తిరస్కారులు ఇరువర్గాల వారికీ సమానంగా ఉండేవి. ముస్లిమేతరులు ఆతిథ్యం కోరితే అందుకు అన్ని ఏర్పాట్లు ప్రవక్త (స) చేసేవారు.

అనుకోకుండా అరుదెంచే అతిథులకు తమ ఇంటిలో ఉన్న ఆహార సామగ్రిని అందించి ఇంటి వారు ఆకలితో ఉండేవారు. ఈ పరిస్థితి తరచూ ఏర్పడుతూ ఉండేది.

రాత్రిళ్ళు లేచి అతిథుల యోగక్షేమాలను విచారించేవారు . వారి అవసరాలు తీర్చేందుకు ప్రయత్నించేవారు.

## క్షమ, మన్నింపుల వైఖరి

దైవప్రవక్త (స) గారి సర్వోన్నత సుగుణాల ఖజానాలో సహనం, క్షమ, మన్నింపులు కూడా అందంగా అమరి ఉండేవి. ప్రియప్రవక్త

(స) నిత్యం ఇతరుల పొరపాట్లను, తప్పులను క్షమించేవారు. మనకందరికి తెలిసిన ఎంతో ప్రఖ్యాతి పొందిన సంఘటన తాయిఫ్ సంఘటన.

తాయిఫ్ ప్రజలు ఎంతో క్రూరంగా హింసించారు. రాళ్ళ వర్షం కురిపించి శరీరమంతా రక్తసిక్తం చేశారు. ప్రియప్రవక్త (స) చెప్పులు రక్తంతో నిండిపోయాయి. సర్వోన్నతుడు అల్లాహ్ వారి పట్ల ప్రతీకారం తీర్చుకునే అవకాశం దైవదూత ద్వారా కల్పించినప్పుడు విశ్వకారుణ్య మూర్తి (స) అందుకు అంగీకరించలేదు. కళ్ళ నుండి అశ్రువులు ధారా పాతంగా వర్షించాయి. 'ఓ అల్లాహ్! నీవు ఈ తాయిఫ్ ప్రజలను క్షమించు! వీరు నన్ను తెలుసుకోలేదు. వీళ్ళు కాకపోయినా వీరి సంతానం సన్మార్గం వైపునకు మరల వచ్చు' అని గద్గద స్వరంతో అల్లాహ్‌ను వేడుకున్నారు.

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం ప్రకారం 'ప్రియప్రవక్త (స) ఎప్పుడూ తన వ్యక్తిగత విషయంలో ప్రతీకారం తీర్చుకోలేదు. ఖురైష్ సర్దారులు ప్రవక్త (స)ని తిట్టారు. చంపివేసే కుట్రలూ పన్నారు. అనేక కష్టాలకు లోను చేశారు. దారిలో ముళ్ళు పరిచారు. పవిత్ర శరీరంపై కసువు పడవేశారు. గొంతుకు గుడ్డ బిగించి ఊపిరి ఆడనీయకుండా చేసి బాధించారు. గేలి చేశారు. ప్రవక్త (స) పట్ల అనేక అనుచిత కార్యాలు నిత్యకృత్యాలుగా మారాయి. దైవం క్షమించుగాక ! పిచ్చివాడని ప్రచారం చేశారు. ప్రవక్త (స)ను మాంత్రికుడని నిందించారు. కవి అని, జిన్ను పట్టినవాడని ప్రచారం చేశారు. విశ్వకారుణ్య మూర్తి(స) ఏనాడూ ఈ దుష్టులను నిందించలేదు. పల్లెత్తు మాట కూడా పలకలేదు. సరికదా! వారందరినీ క్షమించివేశారు.

## రోగుల పరామర్శ

ఎవరైనా జబ్బు పడినట్లు ప్రవక్త (స) వారికి కబురు అందితే వెంటనే వారిని పరామర్శించేందుకు వెళ్ళేవారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు, ఎవరైనా అందరినీ సమంగా యోగక్షేమాలు విచారించేవారు. పేదవారైనా, ధనికులైనా రోగి ఏ జాతికి చెందినవారైనా, విశ్వాసి అయినా అవిశ్వాసి అయినా అందరి పరామర్శకు స్వయంగా వెళ్ళేవారు. రోగివద్దకు వెళ్ళి అతని తల వైపున కూర్చునేవారు. తలపై తన హస్తాన్ని ఉంచేవారు. సాంత్వన వచనాలు పలికేవారు. ధైర్యం చెప్పేవారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకునేవారు. ఆపై రోగి ఆరోగ్యం, స్వస్థత కోసం అల్లాహ్‌ను ప్రార్థించేవారు. 'అర్ష్ అధికార పీఠానికి అధిపతి, సర్వోన్నతుడు అయిన అల్లాహ్ నీకు స్వస్థత ప్రసాదించాలని నేను ప్రార్థిస్తున్నాను' అనేవారు.

దైవప్రవక్త (స)ఇలా సెలవిచ్చారు, ప్రళయదినాన అల్లాహ్ 'ఓ ఆదం కుమారుడా! నేను రోగగ్రస్తుడనై ఉండగా నీవు నా పరామర్శకు రాలేదేమిటి? అని అడుగుతాడు. అందుకు ఆ దాసుడు 'ఓ ప్రభూ! నీవు సకల లోకాలకు స్వామివి. నేను నీ పరామర్శకు ఎలా రాగలను?' అని ఆశ్చర్యం ప్రకటిస్తాడు. అప్పుడు అల్లాహ్ 'నా ఫలానా దాసుడు జబ్బున పడి వుండగా నీవు పరామర్శకు వెళ్ళలేదు . నీవు అతని పరామర్శకు వెళ్ళి ఉంటే నన్ను అక్కడ పొంది ఉండేవాడివి' అని బదులిస్తాడు (అనగా ఈ పనిచేసి వుంటే నీకు నా ప్రసన్నత అంది ఉండేది). (ముస్లిం గ్రంథం)

## ముస్లిమేతరులనూ పరామర్శించడం

ప్రియప్రవక్త (స) సేవా గుణం సర్వమానవులకు సమానంగా ఉండేది. ముస్లింలు, ముస్లిమేతరులు అనే భేదం ఆయనలో ఎక్కడా పొడసూపేది కాదు. ఆయన కారుణ్య సరోవరం సర్వులకు దాహార్తిని తీర్చేదిగా ఉండింది. శత్రువుల పట్ల కూడా ఇదే విధమైన కరుణ, సేవాభావం కలిగి ఉండేవారు.

దైవప్రవక్త (స) నడిచే దారిలోనే ఒక వృద్ధ మహిళ గృహం కూడా ఉండేది. ఆమె ప్రవక్త (స)ని వేధించటంలో ఎప్పుడూ ముందడుగుగా ఉండేది. ప్రవక్త(స) ఆ దారి గుండా వెళుతూ ఉన్నప్పుడు చెత్తాచెదారాన్ని ప్రవక్త(స)పై కుమ్మరించేది. ప్రియ ప్రవక్త (స) ఆమెను పల్లెత్తు మాట అనేవారు కారు. బట్టలు, తల విదిలించుకొని చిరునవ్వుతో సాగిపోయేవారు. ఒకరోజున ప్రవక్త (స)పై చెత్తాచెదారం పడలేదు. ప్రవక్త (స) ఆశ్చర్యపోయారు. ఆ మహిళ గురించి విచారించగా ఆమె జబ్బు పడినట్లు తెలిసింది. వెంటనే విశ్వకారుణ్య మూర్తి (స) ఆమె పరామర్శకు వెళ్ళారు. ఆమె ప్రవక్త(స)ని చూసి సిగ్గుతో కుంచించుకుపోయింది. ప్రియప్రవక్త (స) ఆమె యోగక్షేమాలు విచారించారు. సాంత్వన వచనాలు పలికి ధైర్యం చెప్పారు. ప్రవక్త (స) సత్ప్రవర్తన ఆమెను ఎంతగా ప్రభావితపర్చిందంటే- వెంటనే ఆమె కలిమా పఠించి దైవవిధేయతను స్వీకరించింది.

మరో యూద యువకుడు ప్రవక్త (స)తో సఖ్యతగా ఉండి సేవలు అందించేవాడు. ఆ యువకుడు తీవ్రమైన జబ్బుకు గురయ్యాడు. ప్రవక్త (స) అతని పరామర్శకు వెళ్ళారు. ఆ యువకుని తలపై చేయి నిమిరారు. ధైర్య వచనాలు చెప్పి ఇస్లామీయ సందేశాన్ని అందించారు. ఆ యువకుడు దైవ విధేయునిగా మారి సద్వచనం (కలిమా) పఠించాడు. పరామర్శ తర్వాత తిరుగు ముఖం పడుతూ ప్రియప్రవక్త (స) 'దైవానికి కృతజ్ఞతలు. ఆయన ఈ యువకుడిని నరకాగ్ని నుండి రక్షింపజేశాడు' అని దైవానికి కృతజ్ఞతలు తెలిపారు.

అల్లాహ్ మనకందరికీ మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి సంప్రదాయం ప్రకారం జీవితం గడిపే భాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్.



# సమాజ సంస్కర్త ముహమ్మద్ (స)

పర్వీన్ సుల్తానా, విజయవాడ

**ముహమ్మద్(స)** ప్రవక్త విశ్వవిఖ్యాత నైతిక సార్వభౌముడు, కాలగతిని మార్చివేసిన సంస్కర్త. ప్రపంచ విప్లవాలలో అత్యద్భుత విప్లవాన్ని సాధించారు. మూఢజనాన్ని మహా జ్ఞానులుగా మార్చేసిన అద్వితీయ బోధకులు. బానిసలను పాలకులుగా మార్చివేసిన అత్యుత్తమ ప్రతిభాశాలి, మానవత్వం మంట కలిసిపోయి, పైశాచికత్వం విలయతాండవం చేస్తున్న తరుణంలో మానవ సమాజాన్ని సంస్కరించడానికి వచ్చిన ప్రవక్త ముహమ్మద్(స). ఆయన చేసిన బోధనలలో ఆయన ఆచరించి చూపిన విధానంలో గొప్ప ఆదర్శముంది.

- దేశ దిమ్మరులను ప్రపంచానికి మార్గదర్శకులుగా మార్చారు.
- ఆడపిల్ల పుడితే సజీవ సమాధి చేసే రాతి హృదయాలను ఆడబిడ్డ పట్ల ప్రేమ కురిపించే హృదయంగా మార్చారు.
- నిత్యం మద్యం మత్తులో మునిగే జాతిని మద్యం అంటేనే అసహ్యించుకునే వారిగా చేశారు.
- బానిస వ్యవస్థను నిర్మూలించారు.
- వరకట్నంను నిషేధించారు.
- భ్రూణహత్యలను రూపుమాపారు.
- స్త్రీ జాతికి ఉత్తమమైన గౌరవాన్ని, హక్కులను ప్రసాదించారు.
- అనాథలు, అభాగ్యులను ఆదరించాలని ఆదేశమిచ్చారు.

ఇలా సమాజంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మానవ మహోపకారి, జగద్గురువు ముహమ్మద్(స).

ఇంతటి విప్లవాత్మక మార్పు, సమాజ సంస్కరణ ఆయన కేవలం ఇరవైమూడు సంవత్సరాలలో సాధించారు. ఆయన చేసిన ప్రధానమైన మేలు, నిజ దైవాన్ని మరచి అనేక మిథ్యాదైవాల దాస్యంలో మ్రగ్గిపోతున్న మానవులను, మానవ జీవిత లక్ష్యం తెలియకుండా గమ్యరహితంగా తిరిగే మానవ జాతిని నిజ దైవానికి దగ్గర చేశారు. మనుషుల మధ్య కుల, మత, ప్రాంత, జాతి భేదాలను త్రెంచి విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించారు. మనిషికి జీవన సరళి తెలిపారు. భోజనం, కాలకృత్యాలు, భార్యాభర్తల హక్కులు, బిడ్డల హక్కులు, వ్యక్తిగత, సాంసారిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, ఆరాధన, సామాజిక లాంటి సమస్త రంగాలలో బాధ్యతలు,

విధులు, కర్తవ్యాలను తెలిపిన నాయకుడు ప్రవక్త ముహమ్మద్(స).

మరణం తరువాత రాబోయే జీవితం గురించి, మనిషి ఎదుర్కొనే పరీక్షల గురించి తెలిపారు. అజ్ఞాన కాలపు మూఢాచారాలు, తాతముత్తాతల గుడ్డి ఆచారాలు, స్వయం కల్పిత సిద్ధాంతాల ఊబి నుండి మానవాళిని విముక్తి చేసిన సంస్కర్త ప్రవక్త ముహమ్మద్(స).

ఆయన(స) విశ్వప్రవక్తల నాయకుడు, సత్యవంతుడు, విశ్వసనీయుడు, ఆలోచనాపరుడు, ఇహలోకంలో సాఫల్యం, పరలోకంలో ముక్తి మార్గం పొందాలంటే ఒక వ్యక్తి ఎలా జీవితం గడపాలని తెలిపిన నాయకుడు. 1400 సంవత్సరాల నుండి అనేక శతాబ్దాలలో స్ఫూర్తిదాయకంగా వెలుగొందుతూ చరిత్రలోనే మానవాళికి ఎక్కువగా ప్రభావితం చేసిన, ఆధునిక యుగంలోనూ మానవులపై తనదైన ముద్ర వేస్తున్న ఏకైక వ్యక్తిత్వం. భౌతిక, నైతిక, ఆధ్యాత్మిక జీవిత మార్గంలో మనిషికి విజయపథంలో నడిపించిన ఆదర్శ వ్యక్తిత్వం ఆయనది.

ఆసియా, ఆఫ్రికా, యూరప్ ఖండాల మధ్యలో ఉన్న అరబ్ దేశంలో మక్కా నగరంలోని కాబా గృహం ఇబ్రాహీం(అ) ప్రవక్త కాలం నుండే ఆ కాబాకి విశిష్టత ఉంది. ప్రవక్త(స) రాకపూర్వం పవిత్ర కాబా గృహంలో 360 విగ్రహాలు పెట్టి ఆరాధించేవారు. స్త్రీ, పురుషులు నగ్నంగా ప్రదక్షిణలు చేసేవారు. దోపిడీ, దౌర్జన్యాలు, దొంగతనాలు, వీటికి హద్దులు ఉండేవి కావు. జాత్యాహంకారం, వర్గ పోరాటాలు నిత్యకృత్యమయ్యాయి. ఎటుచూసినా అశాంతి, అలజడులు, హత్యలు జరిగేవి. అజ్ఞానం ఎంతమేరకు పెరిగిందంటే, ఒక తెగ వారి ఒంటె దారి తప్పి ఇంకొక తెగవారి పొలంలో మేసినా, యుద్ధాలు చేసుకునేవారు అజ్ఞానపు అరబ్బులు. తండ్రి చనిపోతే సవతి తల్లిని వివాహమాడేవారు. అంతటి నికృష్టమైన పరిస్థితి నెలకొంది. బహుదైవారాధన విరివిగా పెరిగిపోయి, ప్రజలంతా నిజ దైవాన్ని మర్చిపోయారు. దైవభీతి లేకపోవడం వలన అనేక చెడులు సర్వసామాన్యమైపోయాయి. చాలా భయంకరమైన, దారుణమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ దేశాలను జయించిన అలెగ్జాండర్ కూడా ఆ దేశాన్ని చూసి ఈ మూర్ఖులను జయించడం అవివేకం, అనవసరం అని అరబ్బును వదిలి తన దండయాత్రను ముందుకు సాగించాడు. మానవత్వం మంటకలిసిపోయి పైశాచికత్వం విలయ తాండవం చేస్తున్న తరుణంలో మానవ సమాజాన్ని ఉద్ధరించే, సంస్కరించే, లోకరక్షకుడు కావాలని ప్రజలు ఎదురుచూసే తరుణంలో అరబ్బులోని గౌరవప్రదమైన ఖురైష్ తెగలో అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు అబ్దుల్లాహ్ కుమారుడుగా జన్మించారు ముహమ్మద్ ప్రవక్త(స).

ముహమ్మద్ ప్రవక్త(స) వితంతువులకు సహాయం చేసేవారు. అనాథలను ఆదుకునేవారు, ఆపదలో ఉన్నవారిని వెతికి మరీ సహాయం చేసేవారు. అవసరార్థులకు అవసరం తెలుసుకుని మరీ సహాయం చేసేవారు. గొప్ప నైతికత, గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తిగా ప్రజల గుర్తింపు పొందారు. శత్రువులు సైతం ఆయన నైతికత గురించి సాక్ష్యమిచ్చేవారు.

అనేక దుర్గుణాలతో కూడినటువంటి, ఎల్లప్పుడూ రక్తపాతాన్ని సృష్టించుకునేటటువంటి అరబ్బు జాతిని ఒక గొప్ప ఆదర్శ జాతిగా, సత్సమాజంగా ఎలా మార్చారు? ఆయన ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టలేదు. ఆయన ఉత్తమ నైతిక ప్రవర్తనతో ప్రజలలో దైవభీతి, పరలోక భీతి, నైతిక విలువలు జనింపజేసి ప్రజలలో మార్పు తీసుకువచ్చారు. దారిదోపిడీలు చేసే వారిని దానధర్మాలు చేసేవారిగా మార్చేశారు. మానభంగాలు చేసేవారిని మానవత్వాన్ని ప్రపంచానికి చాటేవారిగా తీర్చిదిద్దారు. కిరాతకంగా మానవ ప్రాణాలు తీసేవారిని మానవత్వానికే నిలువుటద్దంగా మార్చారు. ఆయన గొప్ప విప్లవకారుడు, సమాజ సంస్కర్త. అరబ్బు జాతిలో ఎంత గొప్ప మార్పు వచ్చిందంటే వారి గురించి అల్లాహ్ దివ్యగ్రంథం (2:185)లో "మేము విన్నాము, విధేయులం అయ్యాము. మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము. కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే అని అంటారు" అలాంటి మార్పు తీసుకువచ్చిన తరువాత ఖుర్ఆన్‌లోని ఆజ్ఞ పూర్తి సమాజాన్ని సంపూర్ణ మద్యపాన నిషేధంగా మార్చేసింది. ఖుర్ఆన్‌లోని 5:90వ వాక్యం "ఓ విశ్వసించినవారలారా! సారాయి, జూదం, బలిపీఠాలు, జోస్యం కోసం వాడే బాణాలు, ఇవన్నీ పరమ జుగుప్సాకరమైన విషయాలు, షైతాన్ చేష్టలు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి" అనే ఆజ్ఞ ప్రవక్త నోట వెలువడగానే మదీనా నగరంలో మద్యం ఏరులైపారింది. త్రాగుతున్న మద్యాన్ని బయటకు కక్కేశారు. ఆజ్ఞని విన్నాము, శిరసా వహించాం. ఇలాంటి గొప్ప నైతిక మార్పు తీసుకువచ్చి సంపూర్ణ మద్యపాన నిషేధం

చేసి ఒక ఆదర్శ సమాజంగా అరబ్బు జాతిని సంస్కరించారు ముహమ్మద్(స).

బానిసత్వం- ఆ రోజుల్లో రోమ్, పర్షియ దేశాలలో బానిసలను జంతువులకన్నా హీనంగా చూసేవారు. బలహీన తెగలు, బలహీన జాతులపై పోరాడి వారిని బానిసలుగా మార్చుకునే వారు. వారికి కడుపు నిండా ఆహారం ఇచ్చేవారు కాదు. రాత్రి సమయంలో పది నుండి ఏభై వరకు బానిసలను చీకటి గదిలో ఎలుకలు, గండు చీమలలో, దుర్వాసనలలో కుక్కేసే వారు. బానిసలను బంధించి వారిని హింసించి సంతోషించే వారు. అలాంటి వాతావరణంలో ఆయన(స) ఇలా తెలియ జేశారు : "అబూజర్ గఫ్ఫారి (ర) కథనం ప్రకారం ప్రవక్త(స) ఇలా తెలియజేశారు : మీ అధీనంలో ఉన్న బానిసలు మీకు సోదరులు. మీరు ఏం తింటున్నారో, మీ సోదరులకు అదే తినిపించండి. మీరేం తొడుగుతున్నారో వారికి అదే తొడిగిం చండి. వారి మీద పనిభారం ఎక్కువగా వేయకండి. వారితో వెట్టిచాకిరి చేయించకండి. ఒకవేళ పనిభారం ఎక్కువగా ఉంటే వారికి సహాయపడండి" ఇలాంటి నైతిక విలువలతో కూడిన సందేశం అరబ్బు జాతిలో పెనుమార్పు తీసుకు వచ్చింది. నైతిక విలువలతో కూడిన ఇలాంటి అనేక బోధనలు శాశ్వతంగా బానిసత్వపు సంకెళ్ళను త్రుంచేశాయి.

ఆడపిల్లల హత్యలు, లింగ వివక్ష సమూలంగా రూపు మాపాయి.

దారిద్ర్య భయంతో మీరు సంతానాన్ని హతమార్చకండి. వారికీ మీకూ ఉపాధిని ఇచ్చేది మేమే. ముమ్మాటికీ వారి హత్య మహా పాతకం (17: 31)

సల్మాన్ ఫార్సీ కథనం ప్రకారం మహాప్రవక్త (స) ఇలా తెలి పారు: "ఎవరైతే ముగ్గురు కూతుళ్లను లేదా ముగ్గురు సోదరీ మణులను, ఇద్దరు కుమార్తెలను లేదా ఇద్దరు సోదరీ మణులను వారి బాధ్యత చేపట్టి వారికి మంచి విద్యా బుద్ధులు నేర్పిస్తే వారికి స్వర్గంలో ఉన్నత స్థానం లభిస్తుంది. అతడు స్వర్గంలో నాతోపాటు ఉంటాడని ప్రవక్త(స) తెలిపారు: "ఈ బోధన ద్వారా ఆడపిల్లను నామోషీగా భావించి సజీవంగా పాతిపెట్టే అరబ్బు జాతి ఆడపిల్ల పుట్టడం అదృష్టంగా భావించేలా ప్రవక్త(స) సంస్కరించారు.

స్త్రీ ధనం (మెహర్) విధానాన్ని ప్రవేశపెట్టారు. భార్యతో ఎలా వ్యవహరించాలో తెలియజేశారు "మీలో ఎవరైతే మీ భార్యల పట్ల ఉత్తములో వారే ఉత్తములు. నేను భార్యల పట్ల సత్ప్ర వర్తన కలిగిఉన్నాను. మీరు కూడా సత్ప్రవర్తన కలిగి ఉండండి" అని స్త్రీ గౌరవాన్ని పెంచారు.

వ్యభిచారం రూపుమాపడానికి వివాహం సులభతరం చేయడానికి వచ్చాను అని వ్యభిచారానికి అడ్డుకట్ట వేశారు. స్త్రీ జాతికి గౌరవాన్ని ప్రసాదించారు. ఆడదంటే అంగడి వస్తువు కాదని స్త్రీకి విద్యాహక్కును, ఆస్తి హక్కుని ఇచ్చి జ్ఞానవంతురాలిగా మార్చారు.

వడ్డీ వ్యాపారాన్ని నిషేధించారు. (2: 276)

"అల్లాహ్ వడ్డీని హరింపజేస్తాడు. దానధర్మాలను పెంచు తాడు. మేలును మరిచేవారిని పాపిష్టులను అల్లాహ్ సుతరామూ ప్రేమించడు"

వడ్డీ వ్యాపారం చేసేవాడు, వడ్డీ కాగితాలు వ్రాసేవాడు, వడ్డీ ఇప్పించేవాడు, వడ్డీకి సాక్షులుగా ఉండేవారు, వీరందరిపై అల్లాహ్ శాపం ఉంటుందని ప్రవక్త(స) బోధించి వడ్డీ రహిత సమాజంగా సంస్కరించారు.

ఇంకా మానవతా విలువలను పెంపొందించాలని, తల్లి దండ్రులతో ప్రేమగా మెలగాలని, అనాథలను ఆదరించా లని, ఇరుగు పొరుగువారి హక్కులను నెరవేర్చాలని, తోటి సోదరుల పట్ల ప్రేమగా ఉండాలనీ, అసూయ, ద్వేషాలను, అనైతిక చేష్టలను విడనాడాలని, అరబ్బుజాతికి బోధించి ఒక సుందర సమాజం స్థాపించారు ప్రవక్త(స) వారు. వారి గురించి సర్ జార్జ్ బెర్నార్డ్ షా ఏమన్నారంటే, "ముహమ్మద్ ప్రవక్త(స) లాంటి మనిషి ప్రపంచానికి పాలకు డయితే ప్రపంచంలో ఉన్న సమస్యలన్నీ కూడా సునా యాసంగా పరిష్కరించగలడని నా గట్టి నమ్మకం" అన్నారు.

ముహమ్మద్(స) వారు గొప్ప సంస్కర్త. ఆయన సమాజాన్ని సుందర సమాజంగా తీర్చిదిద్దారు. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి, వర్గం, జాతి, దేశం, అందరూ ఆయన చూపిన విధానాలు, బోధనలు అవలంబిస్తే మన సమాజం కూడా సుందర సమాజంగా మారుతుంది. ఆ దైవం మనందరికీ ఆయనను అనుసరించే సద్బుద్ధిని కలిగించాలి. ❁



# ఆయన(స) అడుగు జాడలే నేటి సమస్యలకు పరిష్కారం

అబ్దుల్ సత్తార్, మహబూబాబాద్

**'మత సామరస్యం నేటి ఆవశ్యకత' అనే అంశంపై అంబేద్కర్ భవన్‌లో యువకులు, మేధావులు, ప్రజా ప్రతినిధులు, వివిధ మతాల ధార్మిక పండితులు, అనేక పుర ప్రముఖులు హాజరయ్యారు.**

"డేవిడ్ ప్రసంగిస్తూ, 'ఔను, ఈ సమాజం చెడ్డవారి వల్ల కాదు... మంచి వారి మౌనం వల్ల నష్టపోతున్నది. ఇప్పటికైనా శాంతి కాముకులందరూ నడుం బిగించి ముందుకు వచ్చి ఎక్కడ అరాచకాలు, అన్యాయాలు చెలరేగుతాయో అక్కడికి చేరుకుని శాంతి స్థాపనకై పాటుపడాలి" అంటుండగా, 'బాగా చెప్పారు డేవిడ్ గారు. ఈ మధ్యకాలంలో కొంతమంది స్వార్థపరులు మతాల మధ్య చిచ్చు రగిలిస్తూ సమాజాన్ని చీల్చుతున్నారు. దీనివల్ల ఒకే వీధిలో నివసిస్తున్న మనం ఒకరి ముఖాలు మరొకరు చూసుకోకుండా కనీసం పలకరింపులు కూడా లేకుండా జీవితం సాగిస్తున్నాం. ఇది మన దౌర్భాగ్యం. అంటూ తనవంతు ప్రసంగాన్ని ముగించారు శాస్త్రి గారు.

'నిజమే! దీనిక్కారణం మనందరం ధార్మిక గ్రంథాల్లోని సారాన్ని అర్థం చేసుకోకపోవడం, దానికనుగుణంగా ఆచరించకపోవడం మూలంగా జరుగుతుంది. అలాగే మహా పురుషుల బోధనలు పెడచెవిన పెట్టడం వల్ల కూడా అనేక అనర్థాలు పొడచూపుతున్నాయి. ఉదాహరణకు మహాప్రవక్త (స) 'భూవాసులపై కరుణించండి... ఆ ఆకాశవాసి మీపై కరుణిస్తాడు' "మీ పొరుగు వాడు పస్తులుండి.. మీరు కడుపు నిండా భుజిస్తే మీరు విశ్వాసులు కారు" కూలి వాని చెమట ఆరకముందే అతని కూలి వేతనాన్ని చెల్లించండి" అనే హితబోధనలు 1450 సంవత్సరాలకు పూర్వమే సెలవిచ్చారు. కాని ఎవరైనా ఆచరిస్తున్నారా?' అంటూ ఆవేదనతో తన అభిప్రాయాన్ని ముందుంచాడు అబ్దుల్లా.

"ఆపండీ! అబ్దుల్లా గారు.. ఈ సమాజం మీలాంటి వారి వల్ల సమస్యల్లో చిక్కుకుంది. ఎంతమంది ముస్లిములు జన జీవన స్రవంతిలో భాగంగా వుంటున్నారు? మీ కాలనీలు వేరు.. బస్తీలు వేరు. మసీదు నాలుగు గోడలకే మీరు పరిమితం. ఓ సామాజిక స్పృహ ఉండదు. ఎప్పుడూ మా ఇస్లాం గొప్పదంటూ చెప్పడమే కానీ' అని ఆవేశంతో ఊగిపోతున్న శ్రీనివాస్‌ను సముదాయించారు సభలో హాజరైనవారు. ఊహించని పరిణామానికి బిత్తరపోయిన నిర్వాహకులు అతికష్టంగా సభను ముక్తసరిగా ముగించారు.

★ ★ ★

ఆ రోజు సెప్టెంబర్ మొదటి తారీఖు. ఆకాశంలో దట్టమైన మబ్బులు. చూస్తుండగానే కుండపోత వర్షం. పల్లె, పట్నం అని తేడాలేకుండా రాత్రికి రాత్రే జల విలయం. తెల్లారేసరికి ఎక్కడ చూసినా, రైలు పట్టాలు ధ్వంసమైన దృశ్యాలు, నీట మునిగిన కాలనీలు, కూలిపోయిన బ్రిడ్జీలు ఇలా చెప్పుకుంటూ పోతే... పొట్ట చేత పట్టుకుని ప్రాణాలు మిగిలితే చాలనుకుని బిక్కుబిక్కుమంటూ సహాయ శిబిరాలకు తరలిస్తున్న దృశ్యాలు. ఇండ్లలోని విలువైన వస్తువులతోపాటు దాచుకున్న డబ్బు, నగలు నీటిలో కొట్టుకుని పోయిన వారెందరో! కష్టపడి నిర్మించుకుని మురిసిపోయిన బంగ్లాలు శిథిలమైన దృశ్యాలు, నీట మునిగిన బంధువుల మృతదేహాలను చూసి గుండె పగిలి ఏడుస్తున్న రోదనలు... ఇలా ఎన్నో హృదయ విదారక దృశ్యాలు.. కేవలం ఒకే ఒక రాత్రి మిగిల్చిన విషాదగాయం.

★ ★ ★

స్వచ్ఛంద సేవల ఆధ్వర్యంలో ఊరు, వాడ అనే తేడా లేకుండా సహాయ పునరావాస కేంద్రాల ఏర్పాటు... లయన్స్ క్లబ్ ప్రసాద్, రెడ్‌క్రాస్ శ్రీనివాస్, వాసవి క్లబ్ వెంకటేశ్... ఇలా ఎందరో దుప్పట్లు, దుస్తులు, ఆహార పదార్థాలు,మెడికల్ క్యాంపుల పేరిట ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఇంతలో అబ్దుల్లా భాయ్ తన సంస్థ సభ్యులను వెంటబెట్టుకొని వేలాది ఆహార పొట్లాలను, వాటర్ బాటిళ్ళను, మెడికల్ కిట్‌లను స్వయంగా ఒక్కొక్కరి దగ్గరకు చేర్చి వారిని పరామర్శిస్తూ, ఓదారుస్తూ, గుండె ధైర్యాన్ని నింపుతూ ముందుకు సాగుతున్నాడు. ఇంతలో 'మత సామరస్య సదస్సులో అబ్దుల్లా భాయ్ మీద ఉరిమిన శ్రీనివాస్ ఎదురై "అబ్దుల్లా భాయ్ నా అపోహలు పటాపంచలు చేశావ్... నిజమే! మహాప్రవక్త సెలవిచ్చినట్లు "భూవాసులపై కరుణించండి! ఆకాశవాసి మీపై కరుణిస్తాడు" "పొరుగువారి ఆకలి తీర్చనంత వరకు మీ విశ్వాసం పరిపూర్ణంకాదు" ఇటువంటి సమాజం కొరకు అందరం పాటుపడదాం భాయ్! అంటూ అబ్దుల్లాను ఆలింగనం చేసుకున్నాడు శ్రీనివాస్. ❀



# మానవ మహోపకారి

ముహమ్మద్ వహీదుద్దీన్, సిద్దిపేట

**'ఎవరి నైతికత అత్యుత్తమంగా** ఉంటుందో అతడు సృష్టికర్త అల్లాహ్‌కు అత్యంత ప్రియతముడు' అని పలికిన దైవ ప్రవక్త(స) తన జీవితంలో అత్యుత్తమ నైతిక విలువలను ఆచరించి, స్థాపించి ప్రపంచానికి ఆదర్శప్రాయుడయ్యారు. అందుకే ఆయన (ప్రవక్త) జననం సర్వ మానవాళికి 'శుభోదయం' అయింది. ప్రవక్త(స) జన్మ దినోత్సవాన్ని ముస్లిం సోదరులు 'మీలాద్ ఉన్ నబీ'గా జరుపుకుంటారు. కేవలం బోధనల నైతిక విలువలను సమాజంలో పాదుకొల్పడం సాధ్యం కాదు. బోధకుడు ఆ విలువలను స్వయంగా ఆచరించి ఆ విలువల పునాదులపై సత్సమాజాన్ని సర్వోత్తమ వ్యవస్థను స్థాపించాలి. దాని పరిరక్షకుడు, ప్రచారానికి అన్ని చర్యలు తీసుకోవాలి. దైవప్రవక్త ముహమ్మద్(స)పై విషయాలన్నింటిని తన జీవిత కాలంలోనే సాధించారు.

## సంతానం బాధ్యత

తల్లిదండ్రులను గౌరవించడం, వారికి సేవ చేయడం, వారి ఆజ్ఞలను శిరసావహించడం పిల్లల బాధ్యత. ప్రవక్త జన్మించక ముందే ఆయన తండ్రి అబ్దుల్లా పరమపదించారు. అలాగే ఆయన తల్లి హజ్రత్ అమీనా దైవప్రవక్త జన్మించిన ఆరు సంవత్సరాలకు ఇహలోకాన్ని వీడిపోయారు. అందువల్ల ప్రవక్త(స)కు వారి తల్లిదండ్రులకు సేవ చేసే భాగ్యం కలుగలేదు. అయితే దైవప్రవక్త(స) తల్లిదండ్రుల సేవ, వారి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని హితవు పలికారు. దైవప్రవక్తకు పాలు పట్టిన తల్లి దాయీ హలీమాను తన సొంత తల్లిలా చూసుకున్నారు.

## తల్లిదండ్రుల బాధ్యత

తమ పిల్లలను ప్రేమించడం, మంచి విద్యాబుద్ధులు నేర్పించడం, సజ్జనులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేయడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రవక్త(స) తన కుమార్తె హజ్రత్ ఫాతిమాను ఎంతో అమితంగా ప్రేమించేవారు. ఆమెకు ఉన్నతమైన విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దారు.

### భర్తగా...

దైవప్రవక్త(స) తన ఇరవై ఏట తనకన్నా వయసులో పది హేనేళ్ళు పెద్దవారు. వితంతువు అయిన ఖదీజాను వివాహ మాడి స్త్రీ జనోద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఆమెతో రెండు దశాబ్దాలకు పైగా అత్యంత సంతోష జీవితాన్ని గడిపారు. ఆమె మరణానంతరం, ఇస్లామీయ ఉద్యమ అవసరాలు, అరబ్బు తెగల మధ్య ఐక్యత సాధించడానికి వేర్వేరు తెగల నుంచి వివాహాలు చేసుకున్నారు. అందులో ఆయిషా(ర) తప్ప మిగతా వారంతా వితంతువులే. కుటుంబ జీవనం భార్యాభర్తల పవిత్ర బంధంతో ప్రారంభమవుతుంది. భార్యాభర్తలిద్దరు సంసారిక జీవితం, దాని నియమాల్ని, బాధ్య తలను సరిగ్గా అర్థం చేసుకుని తదనుగుణంగా నడచుకుంటే ఆ కుటుంబం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వికసి స్తుందని చెప్పారు.

### మిత్రునిగా...

దైవప్రవక్త(స) తన సహచర మిత్రులను చాలా ప్రేమించారు. ఎప్పుడూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉండేవారు. సత్యం విషయంలో ఆయన అందరినీ సమదృష్టితో చూసే వారు. ధనికులైనా, పేదవారైనా, స్వతంత్రులైనా, బానిసలైనా ప్రతి ఒక్కరి ఆహ్వానాన్ని మన్నించేవారు. వ్యాధిగ్రస్తులు స్వంతవారైనా, పరాయి వారైనా వారి పరామర్శకు వెళ్ళేవారు. ఇతరులను ఆ దిశగా ప్రోత్సహించేవారు.

### అతిథుల హక్కులు

ఎవరైతే అల్లాహ్‌ను, పరలోక దినాన్ని విశ్వసిస్తారో వారు తమ అతిథిని ఆదరించి సత్కరించాలి అని దైవప్రవక్త(స) తెలిపారు. ఆతిథ్యం మూడు రోజుల వరకు ఉంటుంది. మొదటి రోజు విందు, సత్కారింపుల దినం. ఆ రోజు అతిథికి వీలైనంత మంచి అన్న పానీయాలు సమకూర్చాలి. రెండవ రోజు శ్రమించవలసిన అవసరం లేదు. మూడు రోజుల తరువాత అతిథికి చేసే సేవలు సదకా (దానం)గా పరిగణించబడ తాయి. ఇంటి వారిని కష్టపెట్టే వరకు బస చేయడం అతిథికి ధర్మసమ్మతం కాదని ఉద్బోధించారు.

### పొరుగువారి హక్కులు

తల్లిదండ్రులు, బంధుమిత్రుల హక్కుల తరువాత ఇరుగు పొరుగు వారితో మంచిగా ఉండాలని, వారితో సత్సం బంధాలు కలిగి ఉండి, మంచిగా ప్రవర్తించాలని ప్రవక్త(స) సూచించారు.

### అనాథల హక్కులు

అనాథలను ప్రేమించడం, పెంచడం, వారి ఆలనా పాలనా చూడటం, మంచి విద్యాబుద్ధులు నేర్పించడం సాటి మనుషులుగా మన బాధ్యత అని ప్రవక్త(స) తెలిపారు. అనాథ లను ఆదుకోండి, ఆర్తులకు భోజనం పెట్టి దాహార్తులకు మంచినీరు అందివ్వాలని నొక్కి చెప్పారు.

### దానశీలిగా...

ఒకసారి ఒక వ్యక్తి ఆయన పవిత్ర సన్నిధిలోకి వచ్చారు. ఆ సమయంలో సుదూరం వరకు గొర్రెల మంద ఉంది. ఆ వ్యక్తి వాటిని చూసి ప్రవక్త నాకు వీటిని దానం చేయగలరా అని అడిగాడు. దానికి ప్రవక్త చిరు మందహాసంతో వాట న్నింటిని దానం చేసేశారు. అలాగే ఎవరైనా ఏదైనా అడిగితే ఉంటే ఇచ్చేవారు. లేకపోతే ఫలానా రోజు ఇస్తానని చెప్పి పంపేవారే తప్ప ఏనాడు లేదు అన్న మాటను సైతం వాడని మహోన్నతుడు.

### న్యాయాధిపతిగా...

ప్రవక్త(స) ఒక న్యాయాధిపతిగా, ఆదర్శప్రాయుడిగా చరిత్రలో నిలిచిపోయారు. సమాన న్యాయవ్యవస్థ, సామాజిక న్యాయ వ్యవస్థను స్థాపించారు. తద్వారా నల్లవారైనా, తెల్లవారైనా, అరబ్బైనా, అరబ్బేతరుడైనా, గొప్ప వంశస్తుడైనా, బానిస అయినా, ప్రవక్త వారి వంశానికి చెందినవారైనా, తెగ సర్దారు లైనా న్యాయం, చట్టం, శిక్షల ముందు సమానులైపోయారు.

### ప్రపంచానికి ఆదర్శప్రాయుడుగా..

కిరీటం లేని చక్రవర్తిగా, సంపద లేని మహరాజుగా, రాజమహలు ఎరుగని పాలకునిగా, హంసతూలికా తల్పం తెలియని మహా మనిషిగా, మరణించే రోజున దీపంలోనైనా నూనె సైతం లేని సామ్రాజ్యాధిపతిగా ప్రపంచ చరిత్రలో కనీవిని ఎరుగని నభూతో నభవిష్యత్ లాంటి గొప్ప వ్యక్తిత్వం గల సంక్షేమ రాజ్యస్థాపకునిగా ప్రపంచానికి ఆదర్శప్రాయు డయ్యారు. ❀



# మిలాదున్ నబీ

షేక్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం

**ఆ రోజు శుక్రవారం.** మా ఊరికి కాస్త దూరంలో ఒక గ్రామం. అక్కడి మౌలానా తన ప్రసంగంలో మొహమాటం లేకుండా వాస్తవాలు చెబుతారు. అందుకే కాస్త సమయం దొరికినా నమాజ్ కోసం అక్కడికే వెళుతా.

అప్పుడే ప్రసంగం మొదలైంది.

ఈ నెల 12 వ తేదీన ప్రవక్త ముహమ్మద్(స) జన్మదినం సందర్భంగా ‘మిలాదున్ నబీ’ పేరుతో చాలా మంది పెద్ద పెద్ద సభలు, ర్యాలీలు నిర్వహిస్తారు. మసీదులను రంగు రంగుల దీపాలతో అలంకరిస్తారు. కొన్ని చోట్ల మంచి భోజనాలు కూడా పెడతారు.

అయితే ఇవన్నీ చేయడం బిద్అత్ అంటే ధర్మంలో కొత్త పోకడలు. ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల ప్రేమను వ్యక్తం చేయడానికి ఇదో మార్గమని మరి కొందరు అంటారు.

మనం చేస్తున్న కార్యాలు సమంజసమైనవేనా? నిజంగా మనకు ప్రవక్త ముహమ్మద్ (స)పై విశ్వాసం, ప్రేమ ఉంటే మనం ఏం చేయాలి? అసలు ముహమ్మద్ (స)ను అల్లాహ్ ఎందుకోసం సందేశహరుడుగా చేసి పంపాడో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు ఏమిటో మనం చేయాల్సింది ఏమిటో కూడా కాస్త తెలుసుకుందాం.

మానవులంతా ఒకే జంట ఆదం, హవ్వాల సంతానం. కనుక మీరంతా పరస్పరం సోదరులు. ఇక్కడ తెల్లవారికి నల్లవారిపై, నల్లవారికి తెల్లవారిపై, అరబ్బులకు అరబ్బేతరులపై, అరబ్బేతరులకు అరబ్బుల మీద ఎలాంటి ఆధిక్యతా లేదు. మానవుల మధ్య హెచ్చుతగ్గుల భేదం లేదు. మీలో అందరి కన్నా ఎక్కువ దైవభీతి కలవారు, నైతికంగా ఉన్నతులే నిజమైన గొప్ప వారు'' అని చాటి చెప్పారు.

దైవాన్ని విశ్వసించే వారు, ప్రవక్త ముహమ్మద్ (స)ను ప్రేమించే వారు ముందుగా ఈ సమాజంలో తక్కువ కులం, ఎక్కువ కులం. నేను పెద్ద, నువ్వు చిన్న అన్న బేధభావం లేని సమానత్వం కోసం కృషి చేయాలి. సమాజంలో హెచ్చు తగ్గుల భేదాలను రూపుమాపేందుకు కృషి చేయాలి.

మనందరి సృష్టి కర్త అయిన దేవుడు ఒక్కడే అని చాటిచెప్పాలి.

అందుకు ధన మాన ప్రాణాలను సైతం త్యాగం చేయాడానికి సిద్ధంగా ఉండాలి.

అలా మనం చేస్తున్నామా లేదా ఆలోచించండి. అలా చేయకపోతే ప్రవక్త ముహమ్మద్(స)పై మీ ప్రేమలో లోపముందని గ్రహించండి. ఆయన మానవాళికి నిజ దైవాన్ని పరిచయం చేయడానికి వచ్చారు.

ఈ సందేశ ప్రచారం చేయడం వల్లే తాయిఫ్‌లో ఆయనపై రాళ్ళతో దాడి చేసి రక్తసిక్తం చేసారు. ఆకలిదప్పులతో తల్లడిల్లేలా రెండు సంవత్సరాలు నిర్బంధించారు. ఆయన అనుచరులు ఎందరినో చిత్ర హింసలకు గురిచేశారు. మరెందరినో నిలువునా చీల్చి చంపేసారు.

ఆయన చేసిన నిరంతర కృషి కారణంగానే నేడు మనం సత్యధర్మంలో ముస్లింలుగా జీవించ గలుగుతున్నాం. ఇప్పుడు ఆ బాధ్యత ప్రవక్త ముహమ్మద్(స)ను విశ్వసించే మనందరిపై మోపబడింది.

మనం ఈ బాధ్యత మరిచిపోయి వేడుకల్లో కాలక్షేపం చేస్తున్నాం. ఈ వైఖరి సరయిందా?

కన్నవారికి ఏ లోటూ లేకుండా చూసుకోవాలని ఆయన బోధించారు.

"కన్న వారి కంట కన్నీరు పెట్టించకండి. కన్న వారిని జీవితాంతం భుజాల మీద మోసుకుని తిరిగి సేవ చేసినా నిన్ను కని పెంచడానికి వారు పడిన చిన్న కష్టం ఋణాన్ని కూడా తీర్చుకో లేవు" అని తెలిపారు.

ఒక్కసారి గుండె మీద చేతులు వేసుకుని చెప్పండి, మనలో ఎంత మంది మన తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరిస్తు న్నామో?

నిజంగా మనం ప్రవక్త ముహమ్మద్ (స) మీద ప్రేమ వ్యక్తం చేయాలనుకుంటే ముందుగా ఆయన చెప్పినట్లు నడుచు కోవాలి.

నేను నైతికోన్నతి కోసం పంపబడ్డాను. అంటే సమాజంలో చెడులను రూపుమాపడానికి, మంచిని పెంచడం కోసం వచ్చాను అన్నారాయన. ఇంకా ఇలా బోధించారు, మీలో ఎవరైనా చెడు జరుగుతుండగా చూస్తే మీలో శక్తి ఉంటే చేతితో ఆపాలి, లేదా నోటితోనైనా ఆపాలి. లేదా ఆ చెడును మనసులో అసహ్యించు కోవాలి.

మన చుట్టూ మద్యం, జూదం, వ్యభిచారం, అశ్లీలత, అత్యా చారాలు, వడ్డీ లాంటి చెడులు నగ్నంగా నాట్యం చేస్తుంటే మనం మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' నెత్తిన టోపీ పెట్టుకొని ఐదు పూటల నమాజు చేస్తూ పెద్ద భక్తిపరులం, మేము ప్రవక్త ముహమ్మద్ (స) అనుచరులం అని చెప్పే అర్హత మనకు ఉందో లేదో ఆలోచించండి?

మిత్రులారా! కేవలం ఒక రోజు మీలాదున్ నబీ సంబరాలు జరుపుకుని ప్రవక్త ముహమ్మద్(స) ను ప్రేమిస్తున్నాను అంటే సరిపోతుందా ఆలోచించండి?

"బంధుత్వ సంబంధాల విచ్ఛితికి పాల్పడకండి" అని బోధించారాయన.

ఒక్కసారి గుండెల మీద చేతులు వేసుకుని చెప్పండి ఎంత వరకు మన బంధుత్వ సంబంధాలు పదిలంగా ఉన్నాయి.

"మీ పొరుగు వారు ఆకలితో ఉండగా మీరు కడుపు నిండా తిని నిదుర పోతే మీరు విశ్వాసులే కాదు అని కూడా అన్నారు. అంటే మీ పొరుగు వారు బాధల్లో కష్టాల్లో ఉండగా మీరు మీ కుటుంబ సభ్యులు మాత్రం హాయిగా ఉంటే మీ దైవాన్ని, దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ను విశ్వసించనట్లే .

"అనాథలు, పేదలు, వితంతువులు, అగత్యపరుల బాగోగులు చూసే వారు పగలంతా ఉపవాసం ఉండే వారితో, రాత్రంతా నమాజు చేసే వారితో, దైవ మార్గంలో జిహాద్ చేసే వారితో సమానం" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).

మనలో ఎంత మంది మన పొరుగున ఉన్న వారి బాగోగులు గురించి ఆలోచిస్తున్నాం. కనీసం మన తోడ బుట్టిన వారి బాగోగులు అయినా చూస్తున్నామా? జీవితంలో ఒక్క అనాథ, వితంతువు, పేదవారికైనా ఆసరాగా నిలబడ్డామా?

వ్యాపారం ధర్మం సమ్మతమైన ఉపాధి. కాని ఇందులో అబద్ధం, మోసం వంచన, కల్తీ బ్లాక్ మార్కెటింగ్ లాంటి అధర్మమైన పనులు లేకుండా చూసుకోవాలి.

కాని ప్రాపంచిక ప్రయోజనాల కోసం, అధిక లాభాల కోసం చాలా మంది మోసాలకు పాల్పడుతున్నారు. ఇలా చేస్తూ ప్రవక్త ముహమ్మద్(స)ను ప్రేమిస్తున్నాము అంటే అది సరికాదు.

దైవం ఏదైనా ఇస్తే తిరిగి దానిని దైవ మార్గం లో అంటే మంచి పనుల్లో ఖర్చు చేసి. పరలోకంలో గృహాన్ని నిర్మించుకునే ప్రయత్నం చేయాలి.

అల్లాహ్ మనందరికీ ప్రవక్త ముహమ్మద్ (స) చూపిన మార్గంలో నడిచి మరణానంతరం స్వర్గాన్ని పొందే అవకాశం కల్పించు గాక.. అని మౌలానా ప్రసంగించారు.

నిజమే కదా అన్న ఆలోచనల్లో పడిపోయాను నేను. ❀

# మహాప్రవక్త రాకను గూర్చి ముందే వివరించిన వేదవేదాంగాలు

## అనూహ్యం- కాని నిజం!

ఎక్కడో అరేబియా దేశంలో మహాప్రవక్త ప్రబోధం చేస్తున్నారని, వారి రాకను గురించి వైదిక మతంలోని వేదాలు ముందుగానే చెప్పి ఉన్నాయని- తలపండిన ఒక పండితుడు అనగా, అది విని ఆ విషయం గురించి- వివరాలు తెలుసుకోవాలన్న ఆతృత నాలో కలిగింది.

ఆ విషయాల గురించి వెతకటం ప్రారంభించిన తరువాత ఆయన చెప్పినదాంట్లో నిజం ఉంది- అన్నది తెలుసుకుని నేనే ఆశ్చర్యపోయాను.

వ్యాస మహర్షిచే వ్రాయబడినవి అని చెప్పబడుతున్న పద్దెనిమిది పురాణాల్లో ఒకటైన భవిష్యత్ పురాణంలోని ఒకటో సూత్రాన్ని ఈ క్రింద యథాతథంగా పొందుపరిచాను.

ఏతన్ మిన్నస్తరే మ్లేచ్ఛ ఆచార్యేణ సమన్వితః

మహామద ఇతిఖ్యాతః శిష్య శాఖా సమన్వితః

నృపశ్చైవ మహాదేవం మరుస్థల నివాసినమ్...

(భవిష్యపురాణం- పర్వం : 3: ఖండం : 3: అధ్యాయం : 3: శ్లోకం : 5-8)

ఒక మ్లేచ్ఛుడు, పరదేశస్థుడయిన ఒక ప్రబోధకుడు తన శిష్యులతోపాటు వస్తాడు. ఆయన పేరు మహమద్. ఆయన ఎడారి ప్రదేశానికి చెందినవారయి ఉంటారు.

మహమద = ముహమ్మద్

అతి స్పష్టంగా, సూటిగా పేరూ, రాబోయే వ్యక్తి నివాసమూ చెప్పబడినది అంటే, అది విస్మయాల్లోకెల్లా అతి పెద్ద విస్మయం!

ఆ ప్రబోధకుని జాతి, ఆయన గుణగణాదుల గూర్చి, అదే పురాణం చెపుతున్నది.

లింగచ్ఛేది శిఖాహీనః శ్మశ్రుధారిన దూషకః

ఉచ్ఛలాపీ సర్వభక్షీ భవిష్యతి జనోమమ

.......................................

ముసలైనైవ సంస్కారః ............

(భాగం : ఖండం : 3; అధ్యాయం 3: శ్లోకం : 25-27)

ఆయన 'లింగచ్ఛేది'- అంటే సున్నతి చేయించుకున్న వాడయి వుంటారు. తలపైన ముడి ఉండదు, గడ్డం పెంచుకుని వుంటారు. మాంసాహారి అయివుంటారు. బిగ్గరగా, గొంతెత్తి మాట్లాడుతారు. 'ముసలై' అని పరిచయం చేయబడతారు అని ఆ పురాణం చెబుతూ వుంది.

మరోసారి మళ్ళీ చదివి చూస్తే అతిముఖ్యమైన విషయం ఒకటి బోధపడుతుంది.

లింగచ్ఛేది- సున్నతి- అన్నది హిందూ మతంలో లేదు. తల మీద ముడి అన్నది హిందూ మతంలో తప్పకుండా వుండాలి. కాని 'శిఖాహీనః' శిరోముండనం చేయించుకున్న వాడు అన్నది స్పష్టంగా చెప్పబడింది.

వీటన్నింటికంటే ఆశ్చర్యమైన మాట 'ముసలై' అన్నది.

ముస్లిమ్, ముసల్మాన్ అనువారికి 'ముసలై' అన్న పదం ఆపాదించి చూడండి.

ఇవ్వే కాదు.. మహాప్రవక్త జీవితం గురించి కూడా చెప్పి ఉన్న మాటలు- ఆయన ఎలా ఉండేవారు- అచ్చు అదేవిధంగా వర్ణించబడింది.

ఇదం జనా ఉపశ్రుత నరాశం సస్తవిష్యతే
షష్టిం సహస్రానవతిం చ కౌరుమ్ ఆ
రుశమేషు దజ్మహే
ఉష్ట్రాయస్య ప్రవాహీణో వధూమన్తో ద్విర్దశ
వర్షమా రథస్యని జీహీడతే దివ
ఈషమాణా ఉప స్పృశః
ఏష ఇషాయ మా మహే శతం నిష్కాన్ దశ స్రజః

త్రీణి శతాన్య ర్వతాం సహస్రా దశ గోనామ్
(అధర్వణ వేదం-20వ కాండం, 127వ సూక్త, 1-3వ మంత్రం)

"ఓ భక్తులారా! ఈ ప్రబోధకుని మాటలు వినండి..

ప్రశంసనీయుడూ, ప్రశంసింపబడినవాడూ అయిన ఆ మహర్షి 60090 మంది మనుషుల మధ్య జననమొందుతాడు."

(ముహమ్మద్ అంటేనే ప్రశంసనీయులు, ప్రశంసింప తగిన లక్షణములు గల వ్యక్తి. ఆయన జన్మించేనాటికి మక్కా నగర జనాభా సంఖ్య 60వేలు).

"ఆయన ఇరవై ఆడ, మగ ఒంటెల మీద సవారీ చేస్తారు. అమోఘమయిన వారి కీర్తి స్వర్గలోకం దాకా పాకుతుంది. ఈ మహర్షి 100 బంగారు నాణెములు కలిగి ఉంటారు."

(ఒంటెల మీద పయనించిన మహర్షులు మన భరత ఖండంలో కనిపించరు. అందుచేత అది ముహమ్మద్ ప్రవక్తను ఉద్దేశించి రాసిన మాటలై వుంటాయి. 100 బంగారు నాణెములు- అరేబియా వదిలి అబిసీనియాకు వలస వెళ్ళిన 100 మంది ప్రవక్త శిష్యులు అని అర్థం.)

"10 ముత్యాల హారాలు- 300 అరబ్బీ గుర్రాలు 10వేల పశువులు వుంటాయి."

(మహాప్రవక్త చేత అమరలోకపు వాసులుగా ప్రకటింపబడిన 10 మంది భక్తుల గూర్చి చెప్పినదే 10 ముత్యాల హారములు. మహిమాన్వితుడైన ప్రవక్త సలిపిన ప్రథమ యుద్ధంలో ఉన్న 313 మందిని యుద్ధ అశ్వాలుగానూ, ఆయన వెంట ఉన్న 10వేల మంది అనుయాయులను 10వేల పశు సంపదగానూ చిత్రించ బడినట్లుగా మౌల్వీ ముహమ్మద్ ఉమర్ చెపుతున్నారు.)

మహాప్రవక్తను విశ్వకారుణ్య స్వరూపుడుగా దివ్య ఖుర్ఆన్ నిర్వచిస్తున్నది.

ఋగ్వేదంలో ఈ ప్రపంచాన్ని పరిరక్షించిన పదివేల మంది పేర్లను పేర్కొన్నారు. అటువంటి వారిలో ఈ మహోత్తమ నాయకుని- ఒకరిగా పేర్కొన్నారు.

అనస్వన్తా సత్పతిర్ మామహే మే గావా చేతిష్ఠో
అసురోమ ఘోసః
త్రైవృష్ణో అగ్నే దశభిః సహస్రైర్ వైశ్వానర త్ర్యరుణ శ్చికేత
(ఋగ్వేదం- మండలం : 5: సూక్తం : 27, మంత్రం:1)

ఈ విధంగా సంస్కృత భాషలో కూడా మామహే అనియు 'ముహమ్మద్' అనియు పిలువడం, స్పష్టంగా చెప్పబడి వుంటం మిక్కిలి ఆశ్చర్యమూ- అనూహ్యామూ!

**('నేను ఆరాధించే ఇస్లాం' పుస్తకంలోనుంచి...)**

యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
**Central Bank of India,**
**Noor Khan Bazar Branch, Hyderabad**
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

లేదా

**పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.**

**GEETURAI WEEKLY**
**SANDESHA BHAVANAM, LAKKADKOT,**
**CHATTA BAZAR, HYDERABAD - 500 002.**
**Phone: 24564583, 24576237**
**E-mail: geeturaiweekly@gmail.com**

# మహిళల హక్కుల పరిరక్షణ

పర్వీన్ బాసిత్, రుద్రం పూర్

**ఆడపిల్ల పుట్టడమే అరిష్టంగా భావించి సజీవ సమాధి చేసే అజ్ఞాన అంధకారంలో మగ్గుతున్న కాలం అది.**

మరోవైపు ఆడది అంటే విలాస వస్తువుగా, మగవాడి కోరికలు తీర్చే ఆటవస్తువుగా భావించే రోమన్ సామ్రాజ్యం.

ఇంకో వైపు భర్త చనిపోతే భర్తతో పాటు అగ్నికి ఆహుతి చేసే సతీ సహగమనం రాజ్యం ఏలుతున్న రోజులవి.

"ఆడవారికి గౌరవ స్థానం లభింపజేసిన మహనీయుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

1450 సంవత్సరాలకు పూర్వమే స్త్రీ విద్యకు శ్రీకారం చుట్టిన మహానుభావుడు ఆయన.

స్త్రీ పురుషులు తప్పనిసరిగా జ్ఞానాన్ని అర్జించాలి అని ఆనాడే తెలిపారు.

యుద్ధ ఖైదీలుగా పట్టుబడిన వారిలో చదువుకున్న వారుంటే పరిహారంగా చదువురాని వారికి చదువు నేర్పితే విడుదల అయ్యే అవకాశం కల్పించారు. దీనిని బట్టి విద్యకు ఆయన ఇచ్చిన విలువ ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

ఒక పురుషుడు విద్యావంతుడు అయితే అది అతని వరకే పరిమితం. కానీ స్త్రీ విద్యావంతురాలు అయితే తరతరాలకు ప్రయోజనం. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ తల్లి ఒడియే మొదటి బడి కదా.

జ్ఞానవంతురాలైన తల్లి ఒడిలో సభ్యతా సంస్కారమనే ఓనమాలు నేర్చుకున్న సంతానం సమాజానికి లభిస్తుంది.

"భార్య అంటే బానిస కాదు. ఆమె మీ పేరును, వంశాన్ని తరతరాలుగా నిలబెట్టే మాతృమూర్తి. ఆమెను గౌరవించండి. వారి అవసరాలు తగు రీతిలో తీర్చండి. మీరు తినేది వారికి తినిపించాలి. మీరు ధరించేదే వారికి ధరింపజేయాలి" అని తెలిపారు.

అంతే కాదు మీలో ఎవరైతే మీ భార్యల పట్ల మంచి వారో వారే మీలో ఉత్తములు, జాగ్రత్త! వారి హక్కులను కాలరాస్తే రేపు మరణానంతరం కఠిన శిక్షకు గురవుతారు అని కూడా చెప్పి. స్త్రీలకు ఇంటికి మహారాణిగా మార్చిన మహనీయుడు ఆయన.

వితంతు వివాహం చేసుకోరాదని భర్త మరణిస్తే, సతీ సహగమనం పేరుతో భర్తతో పాటు చితిపై అగ్నికి ఆహుతి చేసేవారు. వితంతువులు అపశకునానికి చిహ్నంగా మార్చారు. నెత్తి గొరిగించుకొని ఎలాంటి అలంకరణ లేకుండా తెల్ల చీర కట్టుకుని ఇంట్లో ఒక మూలన పడి ఉండేలా చేసారు.

అలాంటి సమాజంలో వితంతు పునర్వివాహం చేసుకోవచ్చు అని చెప్పడమే కాదు, 25 సంవత్సరాల యవ్వనంలో 40 సంవత్సరాల వితంతువును వివాహం చేసుకుని సంస్కరణ ఆచరణతో చూపిన సంస్కర్త ఆయన.

ఆడపిల్లలు కట్నకానుకలు ఇవ్వడం కాదు, వారికే మెహర్ అంటే స్త్రీ ధనం ఇచ్చి మరీ పెళ్లి చేసుకునే సంస్కృతి 1450 సంవత్సరాలకు పూర్వమే బీజం వేసారు ఆయన. ఆస్తి హక్కు చట్టం కల్పించింది కూడా ఆయనే.

చెడు చూపు వ్యభిచారానికి తొలి మెట్టు. వ్యభిచారం దరిదాపుల్లోకి కూడా వెళ్ళకండి. అది అతి చెడ్డ మార్గం. మొదటి చూపు మీది. మలి చూపు షైతాన్‌ది. స్త్రీపై చూపు ఆనక ముందే మీ చూపు మరల్చుకోండి అని మగవారిని హెచ్చరించారు.

స్త్రీలను గౌరవించండి. ఆమె మీ తల్లి, మీ చెల్లి, మీ ఆలి, మీ తనయ.

"తల్లి పాదాల చెంత స్వర్గం ఉంది."

"ఇద్దరు లేక ముగ్గురు కుమార్తెలను, లేదా సోదరీమణులను పెంచి, పోషించి వారిని ఒక ఇంటి వారిగా చేస్తే స్వర్గం గ్యారంటీ" అని తెలిపి వారి సంరక్షణ చేసారు.

తల్లి పాదాల క్రింద స్వర్గం ఉందన్నారు.

ఇలా అనేక బోధనలతో స్త్రీలకు సంరక్షణ కల్పించిన మహనీయుడు ఆయన.

పురుషులతో సమానంగా పని చేయవచ్చు. కానీ వారికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. స్త్రీ ప్రతి రంగంలో రాణించాలి. కానీ వారి వారి పరిధుల్లో ఉంటూ కొనసాగాలి.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**